ఆంధ్రభూమి

సంపుటి 59 సంచిక 98 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | సోమవారం 7 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం
తిథి: శుద్ధ పాడ్యమి ఉ.7.24
నక్షత్రం: ఉత్తరాషాఢ రా.7.13
వర్జ్యం: రా.11.38 నుండి 1.24 వరకు
దుర్ముహూర్తం: మ.12.24 నుండి 01.12 వరకు
తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు
రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు



అమెరికాలోని మిచిగాన్ పట్టణంలో చికిత్స పొందుతున్న సాయికృష్ణ.. ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో

అమెరికాలో తెలంగాణ యువకుడిపై కాల్పులు

- ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న సాయికృష్ణ
- మహబూబాబాద్‌లో కలవరం


మహబూబాబాద్, జనవరి 6: మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పూసల సాయికృష్ణ అనే యువకునిపై అమెరికాలోని మిచిగాన్‌లో గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరిపారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న సాయికృష్ణ ప్రస్తుతం అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తెలంగాణ రాష్ట్రంలోని మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు కాల్పులకు గురయ్యాడనే వార్త తెలియడంతో మానుకోట పట్టణ ప్రజలు కలవరానికి గురయ్యారు. జనవరి 3వ తేదీ రాత్రి మిచిగాన్‌లో ఈ సంఘటన జరిగినప్పటికీ బాధితుని కుటుంబ సభ్యులకు ఆలస్యంగా ఆదివారం ఉదయానికి గానీ ఈ వార్త తెలియలేదు. బంధువుల కథనం ప్రకారం మహబూబాబాద్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పూస ఎల్లయ్య, శైలజ దంపతులు ఏకైక కుమారుడు సాయికృష్ణ బిటెక్ అనంతరం ఎంఎస్ చేయడానికి అమెరికాలోని మిచిగాన్ వెళ్లాడు. అక్కడ చదువుకుంటూనే పార్ట్‌టైం ఉద్యోగం - మిగతా 6వ పేజీలో

కేటీఆర్‌కు హార్వర్డ్ వర్సిటీ ఆహ్వానం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావుకు హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి ఆహ్వానం వచ్చింది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వర్సిటీ వార్షిక సదస్సులో పాల్గొనాల్సిందిగా ఆ వర్సిటీ ఆదివారం ఆహ్వానించింది. వచ్చే నెల 16, 17 తేదీల్లో అమెరికాలోని మసాచుసెట్స్‌లో జరగనున్న ఈ సమావేశంలో వివిధ దేశాలకు చెందిన ప్రముఖ వ్యక్తులు హాజరవుతారు. సమకాలిన దేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళు, వివిధ అభివృద్ధి అంశాలపై రెండు రోజుల పాటు ఈ సమావేశంలో చర్చిస్తారు. సుమారు వెయ్యి మంది విద్యావేత్తలు, విద్యార్థులు, యువ వృత్తి నిపుణులు హాజరుకానున్న ఈ సదస్సుకు కేటీఆర్‌ను ఆహ్వానించడం విశేషం.

ఘనగామా



అలానే హామీలు నెరవేర్చే అభ్యర్థి ఎవరో ముందే తెలుసుకునేలా ఏదన్నా కనుగొంటే బాగుండు..!



తమిళనాడులో ప్రమాదానికి గురైన మెదక్ జిల్లా అయ్యప్ప స్వాములు ప్రయాణిస్తున్న వాహనం

11మంది అయ్యప్పలు దుర్మరణం

- రాంగ్‌రూట్‌లో వచ్చిన లారీని ఢీకొన్న అయ్యప్ప స్వాముల వ్యాన్
- డ్రైవర్ పరారీ.. గాలిస్తున్న పోలీసులు
- తిరుగు ప్రయాణంలో ఘోరం
- మృతులంతా మెదక్ జిల్లావాసులు
- శోకసంద్రంగా మారిన నర్సాపూర్
- సీఎం కేసీఆర్ సంతాపం



ప్రమాదానికి కారణమైన కంటైనర్

చెన్నై, జనవరి 6: తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాకు చెందిన పదిమంది అయ్యప్ప స్వామి భక్తులు రోడ్డు ప్రమాదంలో మరణించారు. వీరు శబరిమలలో శ్రీస్వామి అయ్యప్ప దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. పుదుక్కోటి జిల్లాలో తిరుమాయమ్ బైపాస్ రోడ్డుపై ఈ దుర్ఘటన జరిగినట్లు పోలీసులు చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో వ్యాన్‌లో 14 మంది భక్తులు ఉన్నారు. ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే ఏడుగురు భక్తులు మరణించారు. వేగంగా వస్తున్న కంటైనర్ లారీ ఢీకొనడంతో వ్యాన్ తుత్తునియలైంది. ఏడుగురు భక్తులు ప్రమాద స్థలంలో మరణించగా, మరో నలుగురు గాయాలతో ప్రభుత్వాసుపత్రిలో మరణించారు. ప్రమాద వార్త తెలుసుకున్న వెంటనే పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం 2.20 గంటలకు జరిగింది. ఘటనకు బాధ్యులైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ ప్రమాదం సంభవించిన తర్వాత ట్రాఫిక్ నిలిచిపోయింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు - మిగతా 6వ పేజీలో

నా పేర యువసేనలు, అభిమాన సంఘాలు వద్దు

తక్షణం రద్దు చేయండి

- కార్యకలాపాలు నిలిపివేయండి
- వాటిని అంగీకరించేది లేదు
- పార్టీతోనే కలిసి పనిచేయాలి
- స్పష్టం చేసిన కేటీఆర్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: కొంతమంది నాయకులు తమ పేరిట యువ సేనలు, అభిమాన సంఘాలు ఉండాలని, కాలనీలకు, బస్తీలకు తమ పేరు చిరస్థాయిగా ఉంటే బాగుంటుందని కోరుకుంటారు. ఆ విధంగా కొంత మంది నాయకుల పేరిట యువ సేనలు, అభిమాన సంఘాలు, కాలనీలు, బస్తీలూ ఉన్నాయి. కానీ టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు అందుకు భిన్నం. తన పేరిట యువ సేన, అభిమాన సంఘాలు వద్దని ఖండితంగా చెప్పారు. వాటికి తాను అంగీకరించనని, గుర్తింపు ఇచ్చేది లేదని తేల్చేశారు. యువసేన, అభిమాన సంఘాలను వెంటనే రద్దు చేసుకోవాలని హితవు చెప్పారు. తనపై అభిమానం ఉంటే టీఆర్‌ఎస్ పార్టీతో, లేదా పార్టీ అనుబంధ సంఘాలతో కలిసి పనిచేయాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో వారికి సూచించారు. ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంఘాలను వెంటనే రద్దు చేసుకోవాలని కేటీఆర్ కోరారు. తన పేరిట ఏర్పాటు చేస్తున్న లేదా ఇదివరకే ఏర్పాటైన వివిధ సంఘాలు, యువ సేన, అభిమాన సంఘాలకు తన వైపు నుంచి ఎటువంటి మద్దతు ఉండదన్నారు. కేటీఆర్ యువసేన, కేటీఆర్ అభిమాన సంఘం, కేటీఆర్ సేవాదళ్ వంటి పేర్లతో సంఘాలు ఏర్పాటు చేసినట్లు తన దృష్టికి వచ్చిందని, వీటిని తాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించనన్నారు. తనపై, పార్టీపై అభిమానంతో ఏర్పాటు చేసే సంఘాలను కూడా ఆమోదించనని తెలిపారు. ఇప్పటికే తన పేరిట ఏర్పాటు చేసిన సంఘాలను, యువసేన, సేవాదళ్‌లను వెంటనే



రద్దు చేసుకోవాలన్నారు. అంతేకాకుండా సామాజిక మాధ్యమాల్లోనూ కేటీఆర్ యువసేన, కేటీఆర్ అభిమాన సంఘం వంటి పేర్లతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారు వెంటనే నిలిపి వేయాలని సూచించారు. కేటీఆర్ యువ సేన పేరిట ఆదివారం కేటీఆర్‌ను కలిసిన కార్యకర్తలను ఆ సేనను వెంటనే రద్దు చేసుకోవాలని సూచించారు.

పంచాయతీ ఎన్నికలకు

నేడు ‘నోటీసు’

- తొలిదశ ఎన్నికలు షురూ
- 4,480 సర్పంచ్ స్థానాలు
- 39,832 వార్డులు
- 21న పోలింగ్
- ఆ రోజే కౌంటింగ్
- వెంటనే ఉపసర్పంచ్ ఎన్నిక

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు తొలిదశ ఎన్నికల కోసం సోమవారం ‘నోటీస్’ జారీ అవుతోంది. తొలిదశలో 4,480 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు, 39,832 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికలు జరిగే పంచాయతీలకు రిటర్నింగ్ అధికారులుగా ఎంపీడీఓ (మండల పరిషత్ అభివృద్ధి అధికారులు) లు, ఇతర గెజిటెడ్ ఆఫీసర్లు పనిచేస్తారు. రెండు లేదా మూడు గ్రామ పంచాయతీలకు ఒకరిని రిటర్నింగ్ ఆఫీసర్‌గా నియమించారు. రిటర్నింగ్ ఆఫీసర్లు తమ తమ పరిధిలోని గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల ప్రణాళికను ‘నోటీస్’ ద్వారా జారీ చేస్తారు. అంటే రాష్ట్రంలో ఉన్న మొత్తం 12,732 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలు, 1.13 లక్షల వార్డు సభ్యుల స్థానాలను మూడు విభాగాలుగా విభజించి ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

తొలిదశ ఎన్నికల కార్యక్రమం సోమవారం ప్రారంభం అవుతోంది. మొత్తం మూడు దశల్లో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తామని ఈనెల ఒకటిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి. నాగిరెడ్డి ‘నోటిఫికేషన్’ ద్వారా షెడ్యూల్‌ను జారీ చేసిన విషయం విదితమే. ఎన్నికల కమిషనర్ విడుదల చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా తొలిదశ ఎన్నికలకు సంబంధించిన నోటీస్‌ను సోమవారం రిటర్నింగ్ - మిగతా 6వ పేజీలో

పార్లమెంట్ ఎన్నికల్లో

పొత్తుపై సందిగ్ధం

ఎటూ తేల్చుకోలేని స్థితిలో కాంగ్రెస్

- ముగిసిన సమీక్షలు
- నేతల భిన్నాభిప్రాయాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: టీఆర్‌ఎస్‌ను ఓడించడమే లక్ష్యంగా శాసనసభ ఎన్నికల్లో ఇతర పార్టీలతో కలిసి ప్రజాకూటమిని ఏర్పాటు చేసిన ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలా? పొత్తు పెట్టుకోవాలా? ఎటూ తేల్చుకోలేకపోయింది. శాసనసభ ఎన్నికల్లో పొత్తుల వల్లనే ఓడిపోయామని కొందరు, పొత్తుల వల్ల నష్టం జరుగలేదని మరి కొందరు నాయకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తుందా? పొత్తు పెట్టుకుంటుందా? అనేది తేల్చుకోలేకపోయింది. పొత్తులపై నిర్ణయాన్ని అధిష్టానానికే వదిలేసింది. పంచాయతీ, పార్లమెంటరీ ఎన్నికలకు వ్యూహరచన, శాసనసభ ఎన్నికల్లో పార్టీ ఓటమికిగల కారణాలపై గత మూడు - మిగతా 6వ పేజీలో

వద్దే వద్దు

- డీకే అరుణ ఫామ్‌హౌస్‌లో ముఖ్యుల భేటీ
- అధిష్టానానికి తెలియజేస్తామని వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీతో పొత్తు వద్దని కాంగ్రెస్ ముఖ్య నేతలు అభిప్రాయపడ్డారు. టీడీపీతో పొత్తు వల్ల ఆ పార్టీకి పట్టున్న కొన్ని చోట్ల లాభం జరగవచ్చు కానీ, రాష్ట్రవ్యాప్తంగా నష్టమేనని వారు అభిప్రాయం - మిగతా 6వ పేజీలో

సర్వేపై సస్పెన్షన్ వేటు

- కుంతియా, ఉత్తమ్‌పై ఆరోపణల ఫలితం
- తీవ్రంగా పరిగణించిన పార్టీ అధిష్ఠానం
- పార్టీ సమీక్షా సమావేశం రసాభాస
- అడ్డుకున్న నేతపై వాటర్ బాటిల్ విసిరిన సర్వే
- ఓటమి కారకులే సమీక్షలు పెట్టడమేమిటి?
- నాపై చర్య తీసుకునే అధికారం లేదని సర్వే ఆగ్రహం





గాంధీభవన్‌లో ఆదివారం జరిగిన సమీక్షా సమావేశంలో కుంతియా, ఉత్తమ్ తదితరులు.. సస్పెన్షన్ అనంతరం విలేఖరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణను పార్టీ అధినాయకత్వం సస్పెండ్ చేసింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ ఆర్‌సి కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై సర్వే సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన పార్టీ అధిష్టానం ఈ మేరకు సస్పెన్షన్ వేటు వేసినట్టు టీపీసీసీ ప్రకటించింది. గాంధీభవన్‌లో గత మూడు రోజులుగా పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా సమీక్షా సమావేశాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షా సమావేశం నిర్వహించింది. మల్కాజ్‌గిరి సమీక్షా సందర్భంగా ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ, పార్టీ ఓటమికి కారణమైన కుంతియా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షలు నిర్వహించడమేమిటీ? అని ప్రశ్నించారు. కనీసం ఇంటి పక్క వాడు ఓటు వేయని వారికి టికెట్లు ఇవ్వడం వల్లనే పార్టీ ఓడిపోయిందని సర్వే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సర్వే వ్యాఖ్యలపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ తీవ్రంగా స్పందిస్తూ అడ్డుకున్నారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం పెరగడంతో సర్వే ఆగ్రహంగా తన ముందున్న వాటర్ బాటిల్‌ను బొల్లు కిషన్‌పై - మిగతా 6వ పేజీలో



రాయలసీమపై ఏమిటీ నిర్లక్ష్యం?!


- ఉద్యమానికి మైసూరారెడ్డి కసరత్తు
- ఫిబ్రవరి 10నాటికి రూపురేఖలు
- నీటి కేటాయింపులు తేల్చాలని డిమాండ్
- ప్రాంతీయ యాస, భాషలతో పాటలు
- సంక్రాంతి తర్వాత ఉద్యమ కమిటీలు
- కడప నుంచే ఉద్యమానికి కార్యాచరణ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ముందే రాయలసీమ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళి, సీమకు జరిగిన అన్యాయాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీల ముందు ఉంచేందుకు, అందుకు అవసరమైన నివేదికలను రూపొందించడానికి సీనియర్ రాజకీయ నేత, మాజీ హోంమంత్రి ఎంవి మైసూరారెడ్డి కసరత్తు చేస్తున్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటివాటాను తేల్చడంలో తెలుగుదేశం, వైఎస్సార్ పార్టీలు ద్వంద్వ నీతి పాటిస్తూ సీమకు అన్యాయం చేయడాన్ని ప్రజలకు ఎత్తిచూపాలన్న యోచనలో ఉన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత 80-100 టీఎంసీల నీటిని ‘సీమ’కు తరలించాలన్న ఆలోచనను అధికార, ప్రతిపక్ష పార్టీలు విస్మరించాయన్న అంశాలను ఆయన గుర్తు చేస్తున్నారు. ఆంధ్రాలో చింతలపూడి, గుద్దిగూడెం పనులు వేగవంతం చేస్తున్నందున సీమకు రావాల్సిన నీటివాటపై లెక్కలు తెల్చాల్సిందేనని ఆయన గట్టిగా వాదిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రంతో అభివృద్ధి గణాంకాలు చెప్పడం విడ్డూరమేనంటున్నారు. శ్వేతపత్రాల్లో శూన్యత తప్ప వాస్తవాలు లేవంటున్నారు. పట్టిసీమ నుంచి 45, గుద్దిగూడెం 30, మహాసంగం నుంచి 30 టీఎంసీ నీటిని రాయలసీమకు తరలించవచ్చునన్న వాస్తవాలను ప్రజలకు వివరించనున్నారు. తక్కువ సమయంలో ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడానికి చేపట్టడానికి అవసరమైన ప్రణాళికలపై మైసూరా దృష్టి పెట్టారు. ఉద్యమం బలపడడానికి రాయలసీమ యాస, భాషతో కూడిన పాటలతో ఆకట్టుకోవడానికి సిద్ధమవుతున్నారు. అలాగే స్వాతంత్ర ఉద్యమ సమరంలో పోరాడిన ‘సీమ’ నేతల పౌరుషానికి సంబంధించిన చారిత్రక ఘటనలను ప్రజలకు వివరించేందుకు పోస్టర్లను పరిశీలిస్తున్నారు. ఇక నుంచి పూర్తి స్థాయిలో కడప నుంచి ఉద్యమానికి సంబంధించిన కార్యచరణ ప్రణాళికను అమలు చేయడానికి ఆయన సమాయత్తం అవుతున్నారు. ఉద్యమం బలపడడానికి తక్షణం రాయలసీమ వ్యాప్తంగా జిల్లాల్లో ఉద్యమ కమిటీలు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేపట్టారు. సంక్రాంతి తర్వాత రాయలసీమను చుట్టి రావడానికి రోడ్డు మ్యాపును మైసూరా సిద్ధం చేసుకుంటున్నారు. ముఖ్యంగా రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులకు సంబంధించిన గణాంకాల నివేదిక రూపొందిస్తున్నారు. పోలవరం నీటితో కృష్ణా డెల్టాకు మేలు జరుగుతున్నందున కృష్ణానీటిని రాయలసీమకు మళ్ళించేందుకు అడ్డంకులు లేవన్న సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకుపోతున్నారు. ఇదే అంశాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీకు వివరించడానికి మైసూరా సిద్ధం అవుతున్నారు. ప్రాజెక్టుల నీటివాటాలపై తెలుగుదేశం, వైఎస్సార్ పార్టీలు తమ ఆలోచనలను ఎన్నికలకు ముందే ప్రజలకు స్పష్టం చేయాలన్న అంశాన్ని చర్చకు తెస్తున్నారు. ప్రాజెక్టులపై - మిగతా 6వ పేజీలో



శిల్పస్తంభాలపై చెక్కిన నాణాలు





యాదాద్రి శిల్పకళలో మన చరిత్ర!

ఆలయ కట్టడాల్లో తెలంగాణ జీవనశైలి



ఆలయం ముందు తూర్పుభాగంలో నిర్మాణంలో ఉన్న రక్షణగోడ

యాదగిరిగుట్ట, జనవరి 6: చరిత్రలో వేల సంవత్సరాల రాజుల పాలన కాలంలో లేని రీతిలో, వేయ్యేళ్లపాటు అద్భుత శిల్పాలయంగా నూతన చరిత్ర లిఖించే దిశగా వేయి కోట్లతో, వేల మంది శిల్పకారుల శిల్పకళావైభవంతో నిర్మితమవుతున్న యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ ఆలయం నిర్మాణం పనులు తుది దశకు చేరుకుంటున్న కొద్ది ఆలయ విశేషాలు అందరిని ఆకట్టుకుంటున్నాయి. సీఎం కేసీఆర్ సారధ్యంలోని తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న యాదాద్రి ఆలయంలో దేవతామూర్తులు, నారసింహావతార విశేషాలు, భారత, భాగవత, రామాయ, పురాణా ఇతిహాస విశేషాలతో శిల్పాలు, ప్రాకార స్తంభాలను మలిచారు. కాకతీయ శిల్పకళా రీతులతో పాటు దేశంలోని ప్రసిద్ధి శిల్పకళాకృతల సమ్మేళనంతో కూడిన శిల్పకళతో ఆగమశాస్త్రాను సారం ఆధార శిల నుండి కపాల శిల వరకు పూర్తిగా రాతితో సప్త రాజగోపురాలు, అష్టభుజ మండప ప్రాకారాలతో నిర్మిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఆలయంలోని ప్రాకార స్తంభాలు, అష్ట భుజ మండప స్తంభాలపై తెలంగాణ ప్రజల జీవన శైలులు, వృత్తులు, పాలనా విశేషాలు, చలమణిలో ఉన్న సంస్కృతులు, ఆటలు, నాణాలు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాలను పొందుపరుస్తు శిల్పాలను ఏర్పాటు చేస్తుండటం విశేషంగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన రీతులు ప్రతిబింబించేలా శిల్పాలను చెక్కుతున్నారు. ఆలయ సందర్శనకు వచ్చే వారికి అటు ఆధ్యాత్మిక, దైవిక అంశాలతో పాటు ఇటు తెలంగాణ సమాజం ప్రత్యేకతలు కూడా చాటిచెప్పేలా శిల్పాసంపద ఆకట్టుకోనుంది. ఆలయ వాయువ్య దిశగా ప్రాకార మండప బాలపాద స్తంభాలపై తెలంగాణ ఆటలు కర్రబిళ్ల, అష్టచెమ్మ, క్రికెట్, వాలిబాల్, కబడ్డీ, బొంగురం వంటి ఆటలను చెక్కుతున్నారు. నైరుతి దిశన బాలపాద స్తంభాల్లో తెలంగాణ ప్రాజెక్టులు, వ్యవసాయం, చేనేత, చేతి వృత్తుల శిల్పాకృతులు చెక్కుతున్నారు. బాహ్యాప్రాకారంలో బాలపాద స్తంభాలపై ఒక పైస, ఐదు, పది, ఇరుపై, ఇర్వై ఐదు పైసల నాణెలు, ఐదు రూపాయలు, పది రూపాయలు, 200రూపాయలు, 2వేల రూపాయల నోట్లను చెక్కారు. తెలంగాణ పండుగలైన బతుకమ్మ, దసరా, ఉగాది, సంక్రాంతి విశేషాల దృశ్యాలను చెక్కుతున్నారు. ఆగ్నేయ దిశగా బాలపాద స్తంభాలపై తెలంగాణ చిత్రపటం, ఉద్యమ దృశ్యా లు తెలంగాణ తల్లి విగ్రహం, ఉద్యమకారుల చిత్రా లు చెక్కనున్నారు. ఆయా ఆ తెలంగాణ రాష్ట్ర ప్రజ ల సంస్కృతి, జీవన విధానాలు భవిష్యత్ తరాలకు అందించే చరిత్ర పుస్తకంగా యాదాద్రి ఆలయం నిర్మాణం సాగుతుండటం ఆసక్తిరేపుతుంది.

హరిహరుల క్షేత్రం యాదాద్రి..
నిర్మాణంలో నూతన శివాలయం

హరిహరుల కొలువుగా యాదాద్రి కొండ విరాజిల్లుతుండగా లక్ష్మీనరసింహ స్వామి నూతన ఆలయంతో పాటు కొండపై వెంచేసియున్న శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వరుడికి సైతం 11కోట్ల వ్యయంతో నూతన నిర్మితమవుతున్న నూతన శివాలయం పనులు వేగంగా సాగుతున్నాయి. ఫిబ్రవరి నాటికి శివాలయం పనులు పూర్తి చేసే దిశగా పనులు సాగిస్తున్నారు. అష్టాదశ శక్తిపీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలు, వినాయకుడు, సుబ్రమణ్యస్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహాలు, నాగదేవతల నిర్మాణాలతో శివాలయం నిర్మితమవుతుంది. త్రితల రాజగోపురం, సలాహారంతో ప్రకారం, కృష్ణశిలతో నిర్మిస్తున్న శివుడి గర్భాలయం, అమ్మవారి ఆలయం, మహామండపం పనులు సాగుతున్నా యి. యాదాద్రిపై హరిహరులకు నూతన ఆలయా లు అద్భుత శిల్పకళతో నిర్మితమవుతుండటం హరిహరుల భక్తులను పులకింపచేస్తుంది.

బీసీ రిజర్వేషన్లపై మహా ధర్నా

దద్దరిల్లిన ధర్నాచౌక్ ❖ భారీగా బీసీ సంఘాల రాక



ఇందిరా పార్క్ వద్ద ఏర్పాటు చేసిన మహా ధర్నాలో పాల్గొన్న నేతలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: జరగబోవుపంచాయతీ ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన రిజర్వేషన్లను కొనసాగించాలని ప్రతిపక్షాలతో కలసి బీసీ సంఘాలు ఆదివారం భారీ ఎత్తున ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా చేపట్టింది. బీసీలకు రిజర్వేషన్లను కుదించడం కేసీఆర్ రాజకీయ తప్పిదమని బీసీ సంఘాలు విరుచుకుపడ్డాయి. ఆదివారం ఇందిరా పార్క్ వద్ద ఏర్పాటు చేసిన మహా ధర్నాలో నేతలు కేసీఆర్ వ్యవహార శైలిని ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను అమలు చేయక పోవడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల్లో బీసీల గురించి గొప్పగా చెప్పిన కేసీఆర్ ఎన్నికల అనంతరం బీసీలను వదిలేశారని వారు ధ్వజమెత్తారు. సుప్రీం కోర్టు కొత్తగా ఇచ్చిన ఆదేశాలు కాదని చెప్పారు. అయితే సుప్రీం కోర్టు పేరు చెప్పి కేసీఆర్ బీసీలకు అన్యాయం చేయడం ఏమిటని వారు నిలదీశారు. 2010 సంవత్సరంలో సుప్రీం కోర్టు 50 శాతం రిజర్వేషన్లు దాటవద్దని సూచించినప్పటికీ 2013, 2014 జరిగిన స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన సంఘటనలు కేసీఆర్ గుర్తు చేసుకోవాలని వారు చెప్పారు. కేసీఆర్‌కు బీసీల పట్ల శ్రద్ధ ఉంటే తక్షణం 34 శాతం రిజర్వేషన్ల అమలకు సుప్రీం కోర్టును ఆశ్రయించాలని వారు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా బీసీల రిజర్వేషన్లను తగ్గించి జారీ చేసిన ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధమన్నారు. మంత్రి వర్గ నిర్ణయం లేకుండా ఆర్డినెన్స్ ఎలా తెస్తారని వారు నిలదీశారు. బీసీ రిజర్వేషన్ల తగ్గించడంతో 1400 గ్రామ పంచాయతీలు, 18వేల వార్డులు బీసీలకు దక్కకుండా పోయాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ గెలిచిన ఊపులో ఉన్నారని అందకు ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే అహంకార ధోరణిలో ఉన్నారని వారు నిప్పులు చెరిగారు. ఈ ధర్నాలో జాతీయ బీసీ సంఘం నేత ఆర్ కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, నీలా వెంకటేష్, కోలా జనార్ధన్, అనంతయ్య, రాజేందర్, సురేష్, జైపాల్ ముదిరాజ్‌తో పాటు ప్రతిపక్షాల నేతలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల కోసం ఎస్‌ఈసీలో ప్రత్యేక సెల్

వెంటనే పరిష్కారం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఎవరికైనా ఏదైనా అనుమానం ఉన్నా, ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమస్యలు ఏవైనా ఎదురైనా, అభ్యర్థులపై ఏవైనా కంప్లైంట్ చేయాలనుకున్నా అధికారికంగా ఫిర్యాదు చేసేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో గ్రీవెన్స్/ఫిర్యాదుల సెల్‌ను ఏర్పాటు చేశామని ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం. అశోక్ కుమార్ తెలిపారు. పగటివేళ ఆఫీసు సమయంతో పాటు రాత్రి తొమ్మిది గంటల నుండి ఉదయం తొమ్మిది గంటల వరకు కూడా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని వివరించారు. వీరు నిర్ణీత సమయంలో ఫోన్‌లో అందుబాటులో ఉంటారన్నారు. ఫిర్యాదులను ఫోన్ (040-2980 2895) ద్వారా చేయవచ్చని అశోక్ కుమార్ సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు చర్య తీసుకుంటారని, ఫిర్యాదు చేసిన వారికి ఆ విషయం తెలియచేస్తారని స్పష్టం చేశారు.

త్వరలో 'బ్రాహ్మణ సదన్' ప్రారంభం

❖ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా బ్రాహ్మణ పరిషత్
❖ సీఎం సీపీఆర్‌వో జ్వాలా నరసింహారావు వెల్లడి



మొబైల్ యాప్‌ను ప్రారంభిస్తున్న బ్రాహ్మణ సంక్షేమ సంఘం పరిషత్ వైస్ చైర్మన్ జ్వాలా నరసింహారావు

హైదరాబాద్, జనవరి 6: బ్రాహ్మణ సంక్షేమం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం ఆరు ఎకరాల్లో 'బ్రాహ్మణ సదన్'ను త్వరలోనే ప్రారంభించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం పరిషత్ వైస్ చైర్మన్, సీఎం సీపీఆర్‌వో జ్వాలా నరసింహారావు అన్నారు. ఆదివారం చిక్కడపల్లిలో ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ముద్రించిన క్యాలెండర్, డైరీ, మొబైల్ యాప్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు.

ఆరువేల నియోగులు చాల గొప్పవాళ్లు, పాలనా దక్షులని, వీరందరూ పాలనా వ్యవస్థల్లో భాగస్వాములు కావాలని ఆకాక్షించారు. బ్రాహ్మణ వైదికులతో పాటు నియోగులది కూడా కులవృత్తేనని, కులవృత్తులను ఆదరించి గౌరవించుకోవాలని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే ఎంతో వైభవాన్ని సంతరించుకున్న కులవృత్తులకు ప్రజాస్వామ్యం ఏర్పడిన తర్వాతే ప్రాబల్యం తగ్గడంతోపాటు పోటీ పెరిగిందని అన్నారు. గ్రామాలలో ఏదైనా సంఘటన జరిగితే దానికి బ్రాహ్మణులనే నిందించడం సరికాదని, అటువంటి సంఘటనలు పునరావృతం రాకుండా ఉండే రోజులు వస్తాయని అశిస్తున్నట్లు తెలిపారు. దేశ ప్రథమ ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో 60 నుంచి 70 శాతం మంది బ్రాహ్మణులే ఉండేవారని గుర్తుచేశారు. దేశంలో ఉన్న న్యాయమూర్తులు, సీనియర్ ఐఏఎస్ అధికారులు ఉన్నారని, ప్రస్తుతం అటువంటి స్థానాల్లో లేకపోవడానికి గల కారణం మనలో చర్చించాల్సిన అవసరం ఉంతైనా ఉందని తెలిపారు. బ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుకు సాగే విధంగా కృషి చేయాలని సూచించారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా తెలంగాణ బ్రాహ్మణ పరిషత్‌ను ఏర్పాటు చేసి వారి సంక్షేమం కోసం కేసీఆర్ పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. త్వరలోనే ఆరు ఎకరాల స్థలంలో బ్రాహ్మణ సదన్‌ను గోపన్‌పల్లిలో ప్రారంభించబోతున్నట్లు వివరించారు. సదన్‌లో తెలంగాణ రాష్ట్రంవారే కాకుండా వివిధ రాష్ట్రాల బ్రాహ్మణులతో పాటు పీఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు కూడా కార్యక్రమాలను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఉభయ రాష్ట్రాలను కలిసి ఆరువేల నియోగుల బ్రాహ్మణ సంఘం ఏర్పాటు కావడం విశేషమని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీ.మాధవరావు, సుంకరణ సూర్య ప్రకాష్, తణుకు రామసుబ్బారావు, కోశాధికారి డాక్టర్ ఫణీంద్ర, ఉపాధ్యక్షుడు పెండ్యాల ప్రసాద్, డా.శ్రీనివాస్, ప్రతినిధులు పుర్రేవు సత్యానారాయణ, సుందర కృష్ణ, మల్లికార్జున్ రావు, పల్లం రాజు, ఉషశ్రీ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు, వార్డుకు ఒకే వ్యక్తి పోటీ చేయొచ్చు

❖ రెండు వార్డులకు ఒకరు పోటీ చేయకూడదు
❖ స్పష్టం చేసిన కమిషన్ కార్యదర్శి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: సర్పంచ్ స్థానానికి, వార్డు సభ్యుడి స్థానానికి ఒకే వ్యక్తి ఏకకాలంలో పోటీ చేయవచ్చని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం. అశోక్ కుమార్ ఆదివారం ఒక లేఖ జారీ చేశారు. వివిధ జిల్లాల నుండి వచ్చిన లేఖలకు సమాధానంగా ఆయన ఈ లేఖను జారీ చేశారు. ఈ లేఖను హైదరాబాద్ మినహా మిగతా అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపించారు. సర్పంచ్ స్థానానికి, వార్డ్ సభ్యుడి స్థానానికి ఎవరైనా పోటీ చేసి రెండు చోట్ల గెలిస్తే, ఎన్నికల తర్వాత ఏదైనా ఒక పోస్టుకు రాజీనామా చేసి, మరొక పోస్టులో కొనసాగాల్సి ఉంటుందని వివరించారు. ఎంపీటీసీ లేదా జడ్‌పీటీసీ సభ్యులు కూడా సర్పంచ్ స్థానానికి, వార్డు సభ్యుడి స్థానానికి పోటీ చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఆ విధంగా పోటీ చేసే వారు విజయం సాధిస్తే ఏదైనా ఒక పోస్టులో కొనసాగుతూ, మరొక పోస్టుకు రాజీనామా చేయాల్సి ఉంటుందని అశోక్ కుమార్ వివరించారు. అయితే ఒకే వ్యక్తి గ్రామంలోని ఒకే వార్డు సభ్యుడిగా పోటీ చేసేందుకు అవకాశం ఉందని, రెండు లేదా అంతకు మించి వార్డుసభ్యుల స్థానాలకు పోటీ చేసేందుకు వీలులేదని వివరించారు.

మజ్లిస్ ఎమ్మెల్యే ప్రొటెం స్పీకర్‌గా ఉంటే

ప్రమాణం చేయను

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కఠిన నిర్ణయం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రొటెం స్పీకర్‌గా ఉంటే ప్రమాణం చేయవద్దని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ నిర్ణయం తీసుకున్నారు. కొత్తగా స్పీకర్‌ను ఎన్నుకున్న తర్వాతే ప్రమాణం చేయవచ్చని ఆయన నిర్ణయించుకున్నారు. ఈ నెల 17న అసెంబ్లీ కొలువుదీరనున్న సంగతి తెలిసిందే. అయితే కొత్త ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించేందుకు, అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక నిర్వహణకు గవర్నర్ నరసింహన్ రాజ్‌భవన్‌లో ఈ నెల 16న ముంతాజ్ ఖాన్‌తతో ప్రమాణం చేయించనున్నారు. 17న ఉదయం 11.30 గంటలకు ప్రొటెం స్పీకర్ కొత్త ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయిస్తారు. ఆ రోజున తాను హాజరుకాకుండా, కొత్తగా స్పీకర్‌ను ఎన్నుకున్న తర్వాత ప్రమాణం తీసుకోవచ్చని రాజాసింగ్ నిర్ణయం తీసుకున్నారు.

రైతు ఖాతాల్లోకి ధాన్యం డబ్బులు

రూ. 6292 కోట్ల రూపాయల చెల్లింపులు



జిల్లా మేనేజర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న పౌరసరఫరాల శాఖ కమిషనర్

ఆంధ్రనూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన రైతుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు చెల్లించామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ తెలిపారు. ఆదివారం పౌర సరఫరా శాఖలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా మేనేజర్‌లతో కమిషనర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. మిల్లర్లకు చెల్లించే బకాయిలు, ముఖ్యంగా మిల్లింగ్ చార్జీల విషయంలో జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. ఇదే సమయంలో బియ్యం (సీఎంఆర్) ఎగవేతదారులపై కటినంగా వ్యవహరించాలన్నారు. ఉద్దేశ పూర్వకంగా అధికారులు ఎవరైనా తప్పుచేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గోదాముల్లో నిరుపయోగంగా ఉన్న సరుకులను తక్షణమే టెండర్ ద్వారా విక్రయించాలన్నారు. అలాగే బియ్యం నిల్వ కోసం తీసుకునే గోదాములు లీజ్ ధరల విషయంలో పారదర్శకంగా అధికారులు వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. రైతుల నుంచి 37 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించామని, అందుకు దాదాపు 7.25 లక్షల మంది రైతులకు నేరుగా బ్యాంకుల్లో రూ. 6291 కోట్ల రూపాయలు చెల్లించామని కమిషనర్ తెలిపారు. ఈ యేడాది కూడా ఖరీఫ్ సీజన్‌లో భారీగా ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ముందుగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

కేటీఆర్ ఆరోపణల్లో వాస్తవం లేదు

❖ టీం ఇండియా స్ఫూర్తితో అన్ని రాష్ట్రాలను సమానంగా చూస్తున్న మోదీ
❖ బీజేపీ ఎంపీ బండారు దత్తాత్రేయ


ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: ప్రధాని నరేంద్ర మోదీ టీం ఇండియా స్ఫూర్తితో దేశంలోని అన్ని రాష్ట్రాలను సమానంగా చూస్తున్నారని బీజేపీ జాతీయ నాయకుడు, లోక్‌సభ సభ్యుడు బండారు దత్తాత్రేయ తెలిపారు. బీజేపియేతర రాష్ట్ర ప్రభుత్వాల పట్ల కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు చేసిన విమర్శల్లో ఏ మాత్రం వాస్తవం లేదని దత్తాత్రేయ ఆదివారం విలేఖరుల సమావేశంలో అన్నారు. నాలుగున్నర సంవత్సరాల్లో తెలంగాణకు కేంద్రం పైసా ఇవ్వలేదని కేటీఆర్ ఆరోపణ చేసి ఓటర్లను టీఆర్‌ఎస్ వైపు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన తెలిపారు. రెండు లక్షల కోట్ల రూపాయలను అనేక గ్రాంట్ల రూపంలో ఇవ్వడం జరిగిందన్నారు. 11 సాగు నీటి ప్రాజెక్టులు, 24 గంటల విద్యుత్తు సరఫరా చేసేందుకు వీలుగా ఉత్తర, దక్షిణ పవర్ గ్రిడ్లను అనుసంధానం చేయడానికి యాదాద్రి పువర్ ప్రాజెక్టుకు రూ.50 వేల కోట్లు కేటాయించిందని ఆయన వివరించారు.

రాష్ట్రంలో 2400 కిమీ జాతీయ రహదారులు ఉండగా, 5600 కిమీలకు కేంద్రం పెంచిందని ఆయన చెప్పారు. దీనికి రూ.60 వేల కోట్లను కేంద్రం ఖర్చు చేస్తున్నదని ఆయన వివరించారు. వరంగల్‌లో టెక్స్‌టైల్ పార్కు, కరీంనగర్-నిజామాబాద్ రైల్వే లైన్లను పూర్తి చేసింది కేంద్రం కాదా?, రామగుండంలో ఎరువుల పరిశ్రమను తెరిపించేందుకు చర్యలు చేపట్టింది కేంద్రం కాదా? అని దత్తాత్రేయ ప్రశ్నించారు.

దురదృష్టవశాత్తు సుహాసిని ఓటమి చెందింది

సినీమా నటుడు బాలకృష్ణ విచారం



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: గడచిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దురదృష్టవశాత్తు నందమూరి సుహాసిని ఓటమి చెందారని సినిమా నటుడు బాలకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. మా ఇంటి అమ్మాయి ఇంట్లో నుంచి బయటకు వచ్చి పోటీ చేయడం ఇదే మొదటిసారి అన్నారు. ఎన్నికల్లో ప్రతికూల పరిస్థితుల కారణంగా సుహాసిన ఓటమి చెందారని చెప్పారు. 2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి పోటీ చేసిన నందమూరి సుహాసినీ ఓటమిపై సినీ నటుడు బాలకృష్ణ పై విధంగా స్పందించారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమేనని చెబుతూ నందమూరి ఆడపడచు తొలి సారిగా ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోవడం పట్ల కుటుంబ సభ్యులు కొంత ఆవేదనకు గురైయ్యారని ఆయన చెప్పారు.

20 నిమిషాల ముందు రావాల్సిందే

రైల్వే స్టేషన్లలో కొత్త విధానం ప్రవేశపెట్టే యోచన




న్యూఢిల్లీ, జనవరి 6: ప్రయాణ వేళకంటే ముందుగా రావాలని విమానాశ్రయాల్లో ఉన్న నిబంధన ఇప్పుడు రైల్వేస్టేషన్లలో కూడా ప్రవేశపెట్టనున్నారు. అయితే విమానాశ్రయాల్లోలా రెండు గంటల ముందు కాకుండా సెక్యూరిటీ చెక్ లాంటి వాటికోసం 15-20 నిముషాల ముందు ప్రయాణికులను రైల్వేస్టేషన్లకు రప్పించాలని రైల్వే శాఖ యోచిస్తోంది.

ఇప్పటికే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అలహాబాద్‌లో దీనిని ప్రవేశపెట్టడమే కాకుండా ఈనెలలో రాబోయే కుంభమేళాను పురస్కరించుకుని కర్నాటకలోని హుబ్లీ, మరో 202 రైల్వేస్టేషన్లలో ఈ విధానాన్ని ప్రవేశపెట్టడానికి రైల్వే అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోందని రైల్వేరక్షణ దళం డీజీపీ అరుణ్ కుమార్ తెలిపారు. దీనిప్రకారం రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశానికి ఇప్పుడున్న ద్వారాలను మూసివేస్తారు. అవసరమైతే పలుచోట్ల గోడలు సైతం కట్టేస్తారు. మిగిలిన ప్రవేశాల చోట ఆర్‌పీఎఫ్ సిబ్బందిని ఉంచుతారు. ప్రతి ప్రవేశద్వారం వద్ద తనిఖీలు నిర్వహిస్తారు. అయితే ప్రయాణికులు నిర్ణీత సమయం కన్నా విమానాశ్రయాల్లోలా రెండు గంటల ముందు కాకుండా 15-20 నిముషాల ముందు వస్తే సరిపోతుందని ఆయన తెలిపారు. రైల్వేస్టేషన్లలో మరింత భద్రతా చర్యలు చేపట్టాలని గతంలో తీసుకున్న చర్యల్లో భాగంగా వీటిని అమలు చేస్తామని ఆయన చెప్పారు. ప్రయాణికులను తనిఖీ, భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు, బాంబ్ తనిఖీ బృందాలు వంటివి ఏర్పాటు చేస్తామన్నారు.

ఎన్నికల ఖర్చుకు బ్యాంక్ అకౌంట్

అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేకంగా ఒక బ్యాంక్ అకౌంట్ ప్రారంభించాల్సిన అవసరం లేదని, ఇప్పటికే అభ్యర్థులు ఉపయోగిస్తున్న బ్యాంక్ అకౌంట్‌నే ఉపయోగించవచ్చని రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఎన్నికల కమిషన్ ఇంతకు ముందు జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఎన్నికల ఖర్చుకు అభ్యర్థులు ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయాల్సి ఉండేది. అయితే బ్యాంక్ అకౌంట్ ప్రారంభించేందుకు వారం, పదిరోజుల సమయం పడుతుందంటూ మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ శనివారం ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దాంతో ఎన్నికల కమిషన్ స్పందించింది. అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుకోసం ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ ప్రారంభించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అంటే గతంలో జారీ చేసిన ఆదేశాల్లో స్వల్ప మార్పు చేశామని అశోక్ కుమార్ వివరించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించే సమయంలోనే బ్యాంకు అకౌంట్ నెంబర్, బ్యాంకు బ్రాంచీ నెంబర్ ఇవ్వాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన ఖర్చును మాత్రమే ఈ అకౌంట్ ద్వారా ఎన్నికల సమయంలో కొనసాగించాలని, అభ్యర్థి ఎన్నికల కోసం చేసే ప్రతి రూపాయి ఖర్చు బ్యాంకు ద్వారానే చేయాలని కమిషన్ కార్యదర్శి వివరించారు.

విద్యుదాఘాతంతో
ముగ్గురు రైతుల దుర్మరణం

అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధిత కుటుంబీకుల ఆందోళన

వేమనపల్లి, జనవరి 6: మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండల విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో మండలానికి చెందిన ముగ్గురు రైతులు ముల్కల్ల పేట గ్రామానికి చెందిన సినగొండ సురేందర్ (25), సినగొండ రామయ్య (55) , నీల్వాయి గ్రామానికి చెందిన వాసక భీం రావు (30) విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. వివరాలలోకి వెళ్తే.. ఆరు నెలల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు అయి గ్రామానికి వచ్చిన్నప్పటికీ సంబంధిత విద్యుత్ అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎన్నిసార్లు సమాచారం ఇచ్చినా తమ పంట పొలం వద్ద బిగించకపోవడంతో రైతులు స్వయంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. వాసక భీంరావు రైతు అయినప్పటికీ విద్యుత్ పనులు చేస్తుండటంతో అతని సాయంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు.

అయితే, వీరితో పాటు పంట పొలాల కోసం విద్యుత్ తీగలను అమర్చే క్రమంలో మరొక స్తంభాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అదే క్రమంలో పైన ఉన్న 11 కేవీ విద్యుత్ సరఫరా కావడంతో స్తంభానికి ఉన్న ఇనుప రాడు బయటకు వెళ్లి.. తీగలకు తాకింది. దీంతో స్తంభాన్ని ముట్టుకున్న ముగ్గురు రైతులకు విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

బాధిత కుటుంబీకుల ఆందోళన

ముగ్గురి మరణానికి కారణమైన విద్యుత్ శాఖకు సంబంధించిన అధికారులు సంఘటన జరిగిన స్థలానికి రావాలని.. వచ్చేవరకు మృతదేహాలను కదలనిచ్చేది లేదని కుటుంబ



పొలం వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందిన సురేందర్ , రామయ్య, భీం రావు

సభ్యులతో పాటు గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. అలాగే, మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 30 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాతో పాటు వేమనపల్లి మండల విద్యుత్ ఏఈ బాపును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంతవరకూ మృతదేహాలను తరలించకుండా నిరాహార దీక్ష చేస్తామని గ్రామస్థులు బైఠాయించారు. కోటపల్లి సీఐ జగదీశ్‌తో పాటు నీల్వాయి ఎస్సై భూమేష్‌లు కుటుంబ సభ్యులతో పలు మార్లు చెప్పించినప్పటికీ ఫలితం రాలేదు. పోస్టు మార్టం కోసం డాక్టర్ ఇక్కడకే రావాలని చెన్నూర్‌కు వెళ్లే ప్రసక్తే లేదని విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలానికే వచ్చి ప్రకటించాలని లేనిపక్షంలో మృతదేహాలను కదలనిచ్చే ప్రసక్తే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారిని సస్పెండ్ చేసి మండలంలోని గ్రామాల్లో విద్యుత్ లైన్‌మెన్‌లను ఏర్పాటు చేయాలని, ఏఈ నిర్లక్ష్యంతోనే సంఘటన జరిగిందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పురాణం లక్ష్మీ కాంత్ పేర్కొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలు పరిష్కరిస్తాం

కేసీఆర్ మళ్లీ సీఎం కావటం కాంట్రాక్టు లెక్చరర్లకు వరం • కాంగ్రెస్ నేతలు కోర్టుకు వెళ్లి నోటికాడి బుక్కను ఎత్తగొట్టారు

అడ్వకేట్ జనరల్‌తో చర్చించి క్రమబద్ధీకరణకు కృషి • మాజీ మంత్రి హరీష్‌రావు హామీ

సిద్దిపేట, జనవరి 6 : టీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి..కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావటం కాంట్రాక్టు లెక్చరర్ల పాలిట వరమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ ఉద్యమ సమయంలోనే అధికారంలోకి వస్తే కాంట్రాక్టు లెక్టరర్లను క్రమబద్ధీకరిస్తానని హామీనిచ్చిందని... అధికారంలోకి రాగానే కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేస్తూ జీవోను తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ నేతలు కోర్టును ఆశ్రయించి నోటికాడి బుక్కను ఎత్తకొట్టారని ఆరోపించారు. దీంతో కాంట్రాక్టు లెక్చరర్లకు వేతనాలు పెంచటంతో పాటు, ఉద్యోగ భద్రతకు టీఆర్‌ఎస్ సర్కార్ నిర్ణయం తీసుకుందన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ప్రభుత్వ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృతజ్ఞత సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంట్రాక్టు లెక్చరర్లకు టీఆర్‌ఎస్ పార్టీ ఉద్యమం నుండి అండగా నిలిచిందన్నారు. కాంట్రాక్టు లెక్చరర్లు తమ సాధనలో చేపట్టిన ప్రత్యక్ష ఉద్యమంలో టీఆర్‌ఎస్ పార్టీ పక్షాన మీ ఉద్యమంలో పాల్గొన్నానన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సైతం శాసనసభ వేదికగా కాంట్రాక్టు సమస్యలను లేవనెత్తి సమస్యల పరిష్కారానికి చొరవ చూపినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషిచేస్తానన్నారు. క్రమబద్ధీకరణ విషయంపై అడ్వకేట్ జనరల్, న్యాయ నిపుణులతో చర్చించి సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. కాంట్రాక్టు లెక్చరర్లు తెలంగాణ ఉద్యమానికి బాసటగా నిలిచారని, ఉద్యమాన్ని ఉధృతం చేయటంలో మీ వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఇటీవలే జరిగిన ఎన్నికల్లో సైతం టీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి తెచ్చేందుకు మీవంతు పాత్ర నిర్వహించారన్నారు.

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను కాపాడుకున్న ఘనత కాంట్రాక్టు లెక్చరర్లుకు దక్కుతుందన్నారు. కాంట్రాక్టు లెక్చరర్లు లేకుంటే సర్కార్ కళాశాలలు లేవని, వాటిని సమర్థవంతంగా నడిపించిన ఘనత మీకే దక్కుతుందన్నారు. కోర్టు కేసులను త్వరలో పరిష్కరించి మీ ఆకాంక్షలను నేరవేర్చేందుకు కృషిచేస్తానన్నారు. మీరు, మేము ఒక కుటుంబ సభ్యులమని టీఆర్‌ఎస్ సర్కార్‌పై భరోసా, విశ్వాసంతో ఉండండి, సర్కార్ అండగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తుందన్నారు. మరణించిన, ప్రమాదానికి గురైన కాంట్రాక్టు లెక్చరర్ల కుటుంబాలను సర్కార్ పక్షాన ఆదుకొని, ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు కృషిచేస్తామని హరీష్‌రావు భరోసా నిచ్చారు. కాంట్రాక్టు లెక్చరర్ల ఏలాంటి సమస్యలైన తన దృష్టికి తీసుకవస్తే సత్వర పరిష్కారానికి కృషిచేస్తానని హామీనిచ్చారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ ప్రతినిధులు కనకచంద్రం, పరాంకుశం నాగేందర్, బాలకిషన్, సువర్ణ, నగేష్, సత్యనారాయణలు మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలను వివరించారు. ఆనంతరం మాజీ మంత్రి హరీష్‌రావును ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్, మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్ ప్రభాకర్, రంగాచారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు, సత్కరిస్తున్న కాంట్రాక్టులెక్చరర్ల అసోసియేషన్ ప్రతినిధులు

వచ్చే ధనుర్మాసం నాటికి
సిద్దిపేటలో 'వికాస తరంగణి'

- **జీయర్ ట్రస్టు వేద భవనం**
- **త్వరలో చిన్న జీయర్ స్వామిచే శంకుస్థాపన**
- **మాజీ మంత్రి హరీష్‌రావు**

సిద్దిపేట, జనవరి 6 : సిద్దిపేటలో వచ్చే ధనుర్మాసం నాటికి వికాస తరంగణి భవనం అందుబాటులో రానుందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట పొన్నాల ప్రాంతంలో వికాస తరంగణి గోదాగోష్టి ఆధ్వర్యంలో జరిగిన గోదాపూజ, సుదర్శన హవనం కార్యక్రమంలో హరీష్‌రావు పూజలు చేశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ సిద్దిపేటలో 30లక్షలతో వికాస తరంగణి భవనం నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సంక్రాంతి తర్వాత పనులు ప్రారంభంకానున్నట్లు పేర్కొన్నారు. శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామిని హైదరాబాద్‌లో కలసి ఆశీర్వాదం తీసుకున్నట్లు తెలిపారు. సిద్దిపేటలో వికాసభవనం నిర్మాణం గూర్చి చర్చించగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. చిన్న జీయర్‌స్వామి పర్యవేక్షణలో సిద్దిపేటలో వికాస తరంగణి, వేద భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

అమ్మవారి అనుగ్రహంతో అద్భుతమైన వికాస తరంగణి భవనం నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కరీంనగర్ స్థాయిలో వేద భవనం వచ్చే ధనుర్మాసం నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులో తెస్తానన్నారు. ధనుర్మాసం సందర్భంగా ఈ ప్రాంతంలో గోదా పూజ కార్యక్రమం నిర్వహించటం చాల సంతోషంగా ఉందన్నారు. ఆనంతరం హరీష్‌రావును ఆశీర్వదించి, సన్మానించారు. సిద్దిపేట వికాస తరంగణి ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర పథకాలకు మరాఠాలు ఫిదా

తెలంగాణలో విలీనం కోరుతూ ఉద్యమిస్తున్న వైనం • ధర్మాబాద్ తాలూకాలోని 40 గ్రామాలను తెలంగాణలో చేర్చాలని డిమాండ్

ఆంధ్రభూమి బ్యూరో

నిజామాబాద్, జనవరి 6: తెలంగాణలో తెరాస ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొరుగునే ఉన్న 'మరాఠా'లను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ప్రత్యేకించి రైతాంగానికి ఆదురువునందించేందుకు స్థానికంగా అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, 24గంటల విద్యుత్ సరఫరా వంటి వాటిని చూసి, తమ గ్రామాలను కూడా తెలంగాణలో చేర్చాలంటూ మహారాష్ట్రలోని రైతులు, ప్రజలు ఉద్యమానికి శ్రీకారం చుట్టడం చర్చనీయాంశమవుతోంది. ఈ ఉద్యమానికి అక్కడి సర్పంచ్‌లు ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి నేతృత్వం వహిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు ఆనుకుని సరిహద్దునే ఉన్న మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా, ధర్మాబాద్ తాలూకా పరిధిలోని 40గ్రామాల రైతులు, ప్రజలు తమను తెలంగాణలో విలీనం చేయాలంటూ ఆందోళన పథంలో పయనిస్తున్నారు. నిన్నమొన్నటి వరకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకపోవడంతో ప్రత్యక్ష కార్యాచరణకు దిగారు. ఇందులో భాగంగానే ధర్మాబాద్‌లోని సమితి కార్యాలయం ఎదుట ఇటీవలే నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సమిష్టిగా అన్ని గ్రామాల వారు కలిసి చేపడుతున్న ఆందోళన కావడంతో మహారాష్ట్రలో అధికార పక్షంగా ఉన్న బీజేపీ నాయకులు కూడా మద్దతు తెలుపాల్సి వచ్చిందంటే అక్కడి రైతులు, ప్రజలు తెలంగాణలో విలీనం అయ్యేందుకు ఎంత బలంగా తమ అభీష్టాన్ని వ్యక్తపరుస్తున్నారో స్పష్టమవుతోంది. నిజానికి గత నాలుగు మాసాల క్రితమే ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చి, అంతకంతకూ బలపడుతూ ఉద్యమ రూపం దాల్చింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ధర్మాబాద్ తాలూకా పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు నిజామాబాద్‌కు విచ్చేసి తెరాస పార్టీ తరపున ప్రాతినిథ్యం వహిస్తున్న ఎం.పీ కల్వకుంట్ల కవితను, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులను కలిసి తమ గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. అదే సమయంలో మహారాష్ట్రలోని ప్రజాప్రతినిధులకు కూడా ఈ మేరకు విజ్ఞాపనలు అందించారు. దీంతో అక్కడి మంత్రులు, ఎమ్మెల్యేలు సరిహద్దు గ్రామాల సర్పంచ్‌లు, రైతు ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు, రైతుబీమా తదితర పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు తాము కూడా పొరుగు రాష్ట్రంలో చేరాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. అంతేకాకుండా ఆసరా పథకం కింద పెన్షన్లు, కేసీఆర్ కిట్లు, ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకున్న వారికి అందజేస్తున్న ప్రోత్సాహకాలు వంటి వాటిని ప్రస్తావించినట్టు తెలిసింది. తమవి సరిహద్దు ప్రాంతాలు కావడం వల్ల తమ బాగోగుల గురించి ఎవరూ అంతగా పట్టించుకోవడం లేదని, మౌలిక సదుపాయాలు మృగ్యంగా మారాయని, వీటికి తోడు సంక్షేమ పథకాల లేమి వల్ల అభివృద్ధి అగమ్యగోచరంగా మారిందని అసంతృప్తి వెళ్లగక్కినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా మరాఠా మంత్రులు, ఎమ్మెల్యేలు, అక్కడి అధికారులు వారికి నచ్చజెబుతూ, సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ భారీగా నిధులు వెచ్చించి పరిస్థితులను చక్కదిద్దుతామని, మౌలిక సదుపాయాలు మెరుగుపర్చి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ వర్తించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇది జరిగి నాలుగు మాసాలు పూర్తయినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడం, అదే సమయంలో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పెన్షన్ల రెట్టింపు, రైతుబంధు సాయం 10వేలకు పెంపు దిశగా తెరాస ప్రభుత్వం చర్యలు చేపడుతుండడాన్ని గమనించిన మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామాల రైతులు, ప్రజలు సర్పంచ్‌ల నేతృత్వంలో ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.

ఈ పరిణామం తెరాస శ్రేణుల్లో ఒకింత హర్షాతిరేకాలు వ్యక్తమయ్యేలా చేస్తుండగా, మహారాష్ట్రలోని పాలకపక్షానికి మాత్రం మింగుడుపడని వ్యవహారంలా తయారైంది.



ధర్మాబాద్ పంచాయతీ సమితి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మరాఠాలు

జూరాలలో తగ్గిన నీటిమట్టం

అయినప్పటికీ నీటి విడుదలకు పూనుకున్న అధికారులు • అడ్డుకున్న మొదటి ఆయకట్టు రైతులు • ఎడమ కాలువ వద్ద ఉద్రిక్తత

ఆంధ్రభూమి బ్యూరో

మహబూబ్‌నగర్, జనవరి 6: జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గిపోయింది. దాంతో కేవలం తాగునీటి అవసరాల కోసమే నీటిని వాడుకోవాల్సి ఉంది. కానీ అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిడితో ఏకంగా జూరాల ప్రాజెక్టు నుండి మొదటి ఆయకట్టుకు కాకుండా రామన్‌పాడు ప్రాజెక్టు ద్వారా వెళ్లే ఇతర ఆయకట్టుకు ఎడుమకాలువ ద్వారా నీటిని తరలించడానికి గత మూడు రోజులుగా చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఏకంగా అర్ధరాత్రి పూట నీటి విడుదలకు అధికారులు దిగారు. ఈ విషయం తెలిసిన జూరాల మొదటి ఆయకట్టు రైతులు శనివారం తెల్లవారుజామున జూరాల ప్రాజెక్టు దగ్గరకు వెళ్లారు. అక్కడ అధికారులను చూసి ఆవక్కాయ్యారు. ప్రాజెక్టులో కేవలం మూడు టీఎంసీల నీరు మాత్రమే ఉండడంతో నీటిని ఎలా విడుద చేస్తారని అధికారులతో రైతులు వాగ్వివాదానికి దిగారు. తాగునీటి అవసరాల కోసం నీటిని తీసుకేళ్తున్నామని చెప్పిన అధికారుల మాటను రైతులు ససేమిరా అన్నారు. వనపర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో సాగునీటి అవసరాల కోసమే నీటిని తీసుకెళ్తున్నారంటూ నందిమల్ల, మూలమల్ల రైతులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అంతతో ఆగకుండా వారు తెచ్చుకున్న పెట్రోల్ డబ్బాలు, క్రిమిసంహారక మందు డబ్బాలను తీసి అధికారులను బెదిరించే ప్రయత్నం చేశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న డీఎస్పీ సృజన, ఆర్డీఓ చంద్రారెడ్డిలు రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. కానీ రైతులు మాత్రం తమ ఆందోళనను ఉధృత్తం చేశారు. తప్పని పరిస్థితుల్లో రైతులను అరెస్టు చేయడానికి పోలీసులు దిగారు. దాంతో వారు శాంతించి నీటిని మాత్రం విడుదల చేయకూడదని అధికారులను ప్రాదేయపడ్డారు. కాగా ప్రస్తుతం విడుదల చేస్తున్న 350 కూసెక్కుల నీటికి మించి విడుదల చేస్తే తమ పరిస్థితి దారుణంగా ఉంటుందని తమ గ్రామాలకు తాగు నీరు లబిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా చివరకు అధికారులు మొదటి ఆయకట్టు రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామని ప్రస్తుతం కొనసాగుతున్న 350 క్యూసెక్కుల నీటిని మాత్రమే కొనసాగింపు చేస్తామని హామీ ఇచ్చారు. దాంతో రైతులు శాంతించి తమ ఆందోళనను విరమించారు. దాదాపు నాలుగు గంటల పాటు జూరాల ప్రాజెక్టుపై రైతుల ఆందోళనతో అధికారులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. అయితే ఇటు మక్తల్, వనపర్తి ఎమ్మెల్యేల ఒత్తిడితోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయనే చర్చ మాత్రం జరుగుతుంది.మక్తల్ ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి మాత్రం తమ నియోజకవర్గం ప్రజలకు అన్యాయం జరగకూడదని భావిస్తుండగా వనపర్తి నియోజకవర్గానికి సాగునీరు అవసరమని ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి భావిస్తుండడంతో అధికారులు మాత్రం ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.



జూరాల ఎడుమ కాలువ నీటి విడుదల నిలిపి వేయాలని ఆందోళన చేస్తున్న రైతులు

తెలంగాణ ద్రోహులతో జతకట్టిన పార్టీలకు తగిన శాస్తి జరిగింది

పంచాయతీలకు ఏకగ్రీవ ఎన్నికలు జరగాలి • రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా

మిర్యాలగూడ, జనవరి 6: శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ ద్రోహులతో జతకట్టి పోటీ చేసిన పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే భాస్కర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మహాకూటమి మాయకూటమని ప్రజలు నమ్మి టిఆర్‌ఎస్‌ను గెలిపించి మంచి తీర్పు ఇచ్చారని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పంపిన డబ్బులతోనే మహాకూటమి అభ్యర్థులు ఖర్చు చేశారని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ఏకగ్రీవంగా పంచాయతీలను ఎన్నిక చేసుకోని గ్రామాల రూపురేఖలు మార్చుకోవాలని ఆయన కోరారు. అసెంబ్లీ ఎన్నికలలో టిఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించినట్లుగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడ అత్యధిక స్థానాలలో టిఆర్‌ఎస్ అభ్యర్థులను సర్పంచ్‌లను గెలిపించుకోవాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోని గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు కావాలంటు టిఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాలకు ప్రభుత్వ ప్రోత్సహం 10లక్షలతో పాటు ఎంపి, ఎమ్మెల్యే నిధులు మరో 10లక్షలు గ్రామాల అభివృద్ధికి కేటాయిస్తామన్నారు. రాష్ట్రంలో 8వేల గ్రామపంచాయతీలు ఉంటే ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన హమీల మేరకు నూతనంగా 3వేల గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వంలో సాధ్యంకానిది కెసిఆర్ ప్రభుత్వంలో 500ల జనాభా గల తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేస్తామని చెప్పి గ్రామపంచాయతీలుగా మార్చి మాట నిలబెట్టుకున్నారన్నారు. గిరిజనులు ఏకగ్రీవంగా టిఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కెసిఆర్ పోటీచేస్తే ఈ నియోజకవర్గం దేశంలో అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్నా ఎంపీ గుత్తా

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్లా..?

ఆర్‌ఎస్‌ఎస్ సభ్యత్వం లేనిచోట్ల ప్రజలు నక్సలైట్లేనా? • విద్య, వైద్యాన్ని సామాజిక అంశాలుగా గుర్తించాలి • ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్

సిద్దిపేట అర్బన్, జనవరి 6: ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేస్తారా... దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యత్వం లేని దేశ ప్రజలంతా అర్బన్ నక్సలైట్లేనా అని ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్ ప్రశ్నించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో విలేఖరులతో మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంను అణచి వేయాలని చూస్తున్నాయని తెలపారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్డ్డి సమయంలో నక్సలైట్లతో చర్చలు జరిపినారని , కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ వరవరరావును కలిసినారని వారు కూడా అర్బన్ నక్సలైట్లేనా అని దుయ్యబట్టారు. సాయుధ పోరాటాన్ని మాత్రమే నిషేధం విధించారని, ప్రజల భావజాలన్ని, సాహిత్యంను కాదన్నారు. అంతర్జాతీయంగా, జాతీయ స్థాయిలో 50వేల పుస్తకాలను రచించారని ప్రజా సమస్యలపై ఎన్నో వ్యాసాలు వస్తుంటాయని తెలపారు. సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కే క్రమంలో అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు అందరికి ఉంటుందని, దానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడక ముందు ఉద్యమ సమయంలో కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తామనే నినాదంను విధాన నిర్ణయంగా మార్చలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో 41 అంశాలలో ఈ సమస్య ఒకటని, నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడినంక మేనిఫెస్టోలో సైతం చేర్చిందని కాని బడ్జెట్ కేటాయింపులో మాత్రం 7 శాతం నిధుల కేటాయింపులతో విద్యారంగం నుంచి ప్రభుత్వం తప్పుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని అనుకుంటే దానికి పూర్తిగా భిన్నంగా ప్రభుత్వం వ్యవరిస్తుందని విమర్శించారు. ప్రైవేట్ విద్య అనేది నాగరిక సమాజానికి ఎంతో ప్రమాదకరమైందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రైవేట్ విద్యను ప్రొత్సహించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. విద్య అనేది ఉన్నతమైన, సున్నితమైన మానవ విలువలతో కూడిన అంశమని తెలపారు. కేరళ ప్రభుత్వం 30 శాతం నిధులను కేటాయించగా , ఢిల్లీ ప్రభుత్వం 21 శాతం బడ్జెట్‌లో నిధులను కేటాయిస్తే తెలంగాణ ప్రభుత్వం మాత్రం 2017-18 సంవత్సరంలో కేవలం 7 శాతంకు పరిమితం చేసిందన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యారంగాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అమెరికా లాంటి దుర్మార్గమైన దేశాలు కూడ నేటికి విద్యను ఉచితంగా అందిస్తుండగా స్వీడన్ లాంటి దేశాల్లో ఉచితంగా వైద్యం అందిస్తున్నాయన్నారు. ఈ విషయం మన దేశ రాజకీయ నాయకులకు ఎందుకు అర్థం కావడం లేదని ప్రశ్నించారు. విద్య, వైద్యం పూర్తిగా సామాజిక అంశాలుగా ఉండాలన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రఘుశంకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య హరగోపాల్

హిందూ ధర్మాగ్రహ యాత్రకు ప్రతి ఇంటినుంచీ తరలాలి

కరీంనగర్ టౌన్, జనవరి 6: హిందూ ధర్మంపై విషం చిమ్ముతూ, శబరిమలైలో భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న కమ్యూనిస్టుల తీరును నిరసిస్తూ, సోమవారం నగరంలో నిర్వహించనున్న భారీ ధర్మాగ్రహ యాత్రకు ప్రతి ఇంటి నుంచి తరలిరావాలని బీజేపీ నగరశాఖ అధ్యక్షుడు బేతి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ యాత్రకు ముఖ్య అతిధిగా ప్రజ్ఞాభారతి ఉమెన్ సెల్ రాష్ట్ర కన్వీనర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీమతి నరహరి విజయభారతి హాజరు కాబోతున్నారని ఆయన తెలిపారు. శబరిమలలో అయ్యప్పస్వామి పవిత్రతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి విజయన్ తీరును ఎండగట్టేందుకు ప్రతి ఒక్కరు యాత్రలో పాల్గొనాలని కోరారు. స్వామి సన్నిధానంను అపవిత్రం చేసిన సంఘటన భక్తుల మనోభావాలు దెబ్బతీయటమేనన్నారు. హిందూ సంస్థల నాయకులపై హత్యాకాండను ప్రోత్సహించటం, అధికారదాహంతో హిందువులను అణగదొక్కాలనే కుతంత్రానికి నిదర్శనమన్నారు.

సాహితి

email: sahiti@andhrabhoomi.net



అంతర్గత

చీకటిలో కాలం కనిపిస్తుందా?
వెల్తురులో కూడా అంతే.
ఈ పాట కాలాన్ని
పాడుతున్నట్టు కాదా.
ఈ వేళ్లు
క్షణాలను మీటుతున్నాయేమో
గమనించాలి.
లయ తప్పినప్పుడల్లా
కాలం గాయపడుతుంది.

ప్రవాహానిదీ అదే పద్ధతి
సముద్రం దిశగా
దూరాన్ని లెక్కలు కడుతుంది.
విమానం
కిందికి దిగేటప్పుడు
ఊపిరి బిగపడుతుంది.

విడుదలయ్యే కాలం
విస్మయానికి లోనవుతుంది.

గడియారంలో నలిగే కాలం
ధ్వని శకలాలుగా వర్షిస్తుంది.
గుండె ఆగినప్పుడు మాత్రం
కాలం కాస్సేపు స్తంభిస్తుంది
పుట్టి ఇన్నేళ్లయ్యింది
కాలం అర్థం కాక
జ్ఞానం సిగ్గుపడుతుంది.

కాగితాన్ని డొప్పలా పట్టుకుని
కాలాన్ని ఆవాహన చేద్దాం
రాలిపడుతున్న అక్షరాలను
బహుశా కాలాన్ని
శాశ్వతం చేస్తాయేమో!

- డా. ఎన్. గోపి




ఎలా?!

ఏమనగలను
ముప్ఫై ఏళ్లకు పైగా వసంతాలు కళ్లజూసిన
పదాల కొలనులో విరిసిన వెన్నెల కలువను
నిత్యం లావాదేవీల వాకిట్లో నిలబడి
తనలోకి తొంగి చూసుకుంటూ
కవిత్వపు పియానో మెట్లు
ఎక్కుతూ దిగుతూ
ఆడుకునే ముద్దమందారాన్ని
ఎలా తూలనాడగలను
పొద్దున్నే
ఒక ఉషోదయపు కిరణాన్ని దోసిట్లో ఒంపి
కువకువలాడే పావురాన్ని
అసలు ఏమనగలను
అక్షర నక్షత్రాలతో
ఆకాశపు చెట్టుకు పూసే చందమామను
ఎలా నేలపై పడేయగలను
మరో పసిమొగ్గకై
ఆశగా నిరీక్షించే లేలేత పూలమొక్కపై
వాడైన ముళ్లనెలా రువ్వగలను
నేనిచ్చిన తెలుపు వర్ణాన్ని తొడుక్కుని
కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించే
వెలుగు రవ్వల కొవ్వొత్తిని
ఎలా కరిగించి ముద్ద చేయగలను
ఇవన్నీ చేయగలిగే
గడ్డకట్టిన మనసుంటే
నేనెలా కాగితంపై నదిలా ప్రవహించగలను

- పద్మావతి రాంభక్త, 9966307777

భీమన్న డైరీలు దొరికివుంటే..

ఇరవయ్యో శతాబ్ది తెలుగు సాహిత్యంలో, సామాజిక చైతన్య పరిణామాలలో బోయి భీమన్నగారిది ఒక విలక్షణ, విశిష్ట, మానవతా ప్రపూర్ణ వ్యక్తిత్వం. ఇరవైయ్యో శతాబ్ది నుంచి తెలుగు సంస్కృతి, సమాజ జీవితాలను ప్రభావితం చేసిన 20 మంది పేర్లు తలచుకున్నపుడు భీమన్నగారి పేరు ఆ పట్టికలో అనివార్యంగా చోటుచేసుకుంటుంది. ఆయన పద్యాన్ని, నాటకాన్ని, వచనా గీతాన్ని, సమాజ విశ్లేషణను, పురా భారతీయ హైందవ సాంఘిక జీవన విధానంలోని తప్పొప్పులను నిర్మమంగా, మేధోపరంగా, కళాత్మకంగా ఆవిష్కరించిన అతి కొద్దిమంది తెలుగు రచయితలలో ఒకరు. వీరిది కరుణవాదమే కానీ, కత్తివాదం కాదు.



భీమన్నగారు డైరీలు రాసేవారనీ, అజాగ్రత్తవల్ల, అనాసక్తివల్ల అవి ఖిలమైపోయినవని తెలుస్తున్నది. ఆ డైరీలు మనకు లభించి ఉంటే మనకు స్వాతంత్ర్యం రావటానికి మూడు దశాబ్దాలముందు, వచ్చిన తరువాత నాలుగు దశాబ్దాల తరువాత తెలుగునాట సమాజ చైతన్యం ఎట్లా ఆవిష్కృతమైనదో తెలుసుకొనే విలువైన సమాచారం ఆధారాలు అవి అందించి ఉండేవి.

భీమన్న గారి తనయ శ్రీమతి డా౹ బి (బొజ్జా) విజయభారతి, రమాపతిరావుకు రాసిన లేఖ ఇట్లా ఉంది.

శ్రీ రమాపతిరావుగారికి,

నమస్కారాలు. భీమన్నగారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా మీరు చేసిన ప్రసంగం చాలా చాలా ఆత్మీయంగా ఉన్నది. నాన్నగారు ఆయా విషయాలు ప్రస్తావించేవారు. తన డైరీలో రాసుకున్నారు కూడా. మిమ్మల్ని ఆయన 'మంజుశ్రీ'గానే గుర్తుపెట్టుకున్నారు. మీరు కలిసిన ప్రతిసారీ 'డైరీ'లో ఆ విషయం రాసుకున్నారు. అన్నీ చక్కని ఆత్మీయతతో కూడిన జ్ఞాపకాలు. వాటిని జిరాక్స్ తీసి మీకు పంపే సౌలభ్యం లేకపోయినందుకు విచారంగా ఉంది. మా తమ్ముడు డా. వి.నాగవర్మ న్యూసైన్స్ కాలేజీలో మీ స్టూడెంటు. అప్పుడప్పుడు ఆ విషయాలు మాట్లాడుకుంటూ ఉంటాము. తెలుగు అకాడమీ (సాహిత్య అకాడమీ కాబోలు?) నిర్వహించిన బోయి భీమన్న శతజయంతి ఉత్సవాలలో మీ ప్రసంగం విన్న తర్వాత ఈ లేఖ రాయాలనిపించింది.

- నమస్కారాలతో విజయభారతి

డా.బి.విజయభారతిగారి ఈ లేఖవల్ల స్వర్గీయ భీమన్నగారికి నా పట్ల ఎంత ఆదరాభిమానం ప్రేమ పూర్వక వాత్సల్యం ఉండేదో తెలుస్తుంది. భీమన్నగారిది చాలా ఉన్నత, ఉదార, ఆత్మీయమైన వ్యక్తిత్వం.

నిజం చెప్పవలసి వస్తే ఈ నా జీవితంలో వారు నాకు చేసినంత సహాయం, చూపిన అవ్యాజ ప్రేమాంతఃకరణము నాకు ఇతరులవల్ల ఎవ్వరివల్లనూ లభించలేదు. నేను 5 సం.లు సాహిత్య అకాడమీ తెలుగు భాషా సమన్వయకర్తగా ఉన్నపుడు డా.విజయభారతి గారిని తెలుగు సలహా సంఘ సభ్యురాలిగా నియమింపచేయగలిగాను. అంతటితో తృప్తిపడకుండా భీమన్నగారి సంక్షిప్త సాహిత్య జీవిత చరిత్ర (మోనోగ్రాఫ్) నేనే రాసి ఉంటే భీమన్న గారిపట్ల నా ఋణం కొంతవరకైనా తీర్చుకోగలిగి ఉండేవాణ్ణి. దీనిని వేరే వారికి అప్పగించంవల్ల ఈసాహిత్య జీవిత చరిత్ర ఇంతవరకు వెలువడినట్లు లేదు. నేనే అయితే ఆరు నెలల్లో సమగ్ర సంగ్రహ సుందరంగా నిర్వహించి ఉండేవాణ్ణి. గత జల సేతుబంధన విచారంతో ఏం ప్రయోజనం!

భీమన్నగారిని నేను ఒక యాభైసార్లన్నా కలుసుకొని ఉంటాను. చాలా హృద్యమైన, ఉపకార పూరితమైన, ఏ మేనల్లుడో, అన్నగారి కుమారుడో కూడా పొందలేని మేళ్లు వారివల్ల నేను పొందాను. కాని ఒక సాహిత్య సభ జరిపి వారిని విశిష్టంగా సమ్మానించుకోలేకపోయినాను. బహుశా నా అపరిపక్వ, అతిరాంభిక, అవివేక మనఃప్రవృత్తి ఇందుకు కారణం కావచ్చు. ఇపుడేమి అనుకుంటే ఏమి లాభం! హైదరాబాద్‌లో నాకు అండ, ప్రాపు, ఉద్యోగం, తరువాత సాహిత్య వ్యక్తిత్వం లభించటానికి భీమన్న గారే మూలాధారం. స్వీయ చరిత్రలో నేను ఈ విషయాలు కొంతవరకు ప్రస్తావించాను.

ఈ మధ్యనే నా సహస్ర చంద్ర దర్శనోత్సవ అభినందన సంపుటిలో భీమన్నగారు నాకు రాసిన లేఖ చేర్చాను. ఈ అభినందన సంపుటి (వేయి పున్నముల వేడుక) వదాన్యులైన శ్రీ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి గారు నాకు బహూకరించారు. (గుంటూరులో గొప్ప సభ జరిపారు).

భీమన్నగారితో నాకుగల హృద్య ఆత్మీయత పూర్తిగా తెలుపాలంటే వంద పుటల గ్రంథమవుతుంది. నాకు హైదరాబాదులో కలిగిన సమస్త శ్రేయములకు వారే కారకులు అని ఇదివరకే ప్రస్తావించాను కదా! ఆ తరువాత రెండు మూడు సన్నివేశాలు సంగ్రహంగా పుస్తకం చేస్తాను. సమైక్యాంధ్రప్రదేశ్ ఆవిర్భావం తరువాత వారు ప్రభుత్వ అనువాద సంస్థలో తెలుగు అనువాద ఉన్నతాధికారిగా ఉద్యోగం చేశారు. హైదరాబాద్ ఆబిడ్స్ మైసూర్ కేఫ్ వెనుక సందులో వారి కార్యాలయం ఉండేది. అప్పుడే నేను ఎం.ఏ పూర్తిచేశాను. ఉద్యోగాన్వేషణలో ఉన్నాను. 'ఏదైనా ఉద్యోగం వారు ఇవ్వగలరో, లేదా అందుకు సహాయపడగలరో అనే కాంక్షతో మొదటిసారి వారిని నేను చూసినట్లున్నది. అప్పట్లో హైదరాబాదు నారాయణగూడ న్యూసైన్స్ కాలేజీవారు తెలుగు శాఖలో పార్ట్ టైం అధ్యాపకుడి కోసం పత్రికా ప్రకటన చేశారు. ఆ విషయం వారి సహాయం అర్థించాను. న్యూసైన్స్ కళాశాల పాలక మండలి ఉస్మానియా విశ్వవిద్యాలయం అధికార ప్రతినిధి ఎన్.వి.సుబ్బారావు గారు భీమన్నగారు చిన్ననాటి పాఠశాల తరగతులలో భీమన్నగారి సహాధ్యాయి అని నాకు తెలియదు. పాలక మండలిలో జె.వి.నరసింగరావు గారు ప్రముఖ అధికారిక సభ్యులు. తూ.గో.జిల్లా మామిడికుదురు పరిచయంతో సుబ్బారావుగారి దగ్గరకు భీమన్నగారు మూడు నాలుగు సార్లు వెళ్లారు రిక్షాలో నాకోసం. అట్లానే తమ ఆఫీసులో సహోద్యోగి అయిన లింగారావు గారు (ఉర్దూ అనువాద అధికారి) బి.రామరాజుగారు నిడుదవోలు వేంకటరావుగారి కుమారుడి కోసం ఈ ఉద్యోగ నిమిత్తం ప్రయత్నం చేశారు. కానీ భీమన్నగారి పూనికవల్ల నాకు లభించింది. హైదరాబాద్ రేడియో కేంద్రం నుంచి నా 200 ప్రసంగాలకు, నగరంలో సాహిత్య గౌరవాలకు భీమన్నగారివల్ల నాకు ఆస్కారం కలిగింది.

ఇంకొక రెండు మూడు విషయాలు మాత్రమే ప్రస్తావిస్తాను. ఒకటి- సద్గురు శివానందమూర్తిగారి సత్కారం తరువాత భీమన్నగారిని వారి ఇంటి దగ్గర దించే బాధ్యత నేను తీసుకున్నాను. ఇల్లు చేరిన తరువాత వారి దగ్గర శెలవు తీసుకుంటూ భావోద్వేగం అణచుకోలేక భీమన్నగారికి పాద నమస్కారం చేశాను. వారు తెల్లబోయినారు. కలవరపాటు కూడా పొందారేమో ఎందుకిలా చేశారు అని జిజ్ఞాసించారు. అయ్యా! నేను శివాద్వైతిని-మీ పేరే శివుడి పేరు కదా! నేను మధునాపంతులవారినో, నిడుదవోలువారినో, వెంపరాలవారినో దర్శిస్తే వారికి పాదాభివందనం చేస్తాను కదా! అన్నారు.

మరొకసారి అయ్యా భీమన్నగారూ- మీ అమ్మాయి డా౹ విజయభారతి సర్వవిధాలా వైస్ ఛాన్సలర్ పదవికి అర్హురాలు కదా! మీరు ఎందుకు ఆ పూర్వరంగం నిర్వహించరు? అని అడిగాను. (బహుశా నాకు సుప్త లేదా గుప్తచేతనలో ఆమె వైస్ ఛాన్సలరయితే నాకు పురస్కారాలతో, కమిటీ సభ్యత్వాలో అధిక గుర్తింపులో లభిస్తాయని ఆశించి ఉండచచ్చు)

ఆయనన్నారు కదా! ఆ చొరవ, ఆ చైతన్యం, ఆ పూనిక ఆమెలో వుండాలి? పోయి ముఖ్యమంత్రిని కలవాలి? తన అర్హత చెప్పుకోవాలి, కాని నేనామె కోసం తాపత్రయం చూపుతానా? అన్నారు. అంతటి నిర్మమయుడు ఆయన. (నా కోసం పెద్ద పూనిక చూపి సాధించారు, అది వేరే విషయం!)

ఒకసారి మహీధర రామమోహనరావుగారు నాకొక విషయం చెప్పారు. అవి 1950 సం.లు కావచ్చు. కమ్యూనిస్టు పార్టీ నిషేధం అనుభవిస్తున్న రోజులవి. వారు అజ్ఞాతవాసం (అండర్ గ్రౌండ్)లో ఉండాల్సిన రోజులు. భీమన్నగారింటిలో తమకు ఆశ్రయం లభించేది. వారి ఇల్లాలి వంకాయ కూర మేమెప్పుడూ మరచిపోలేము అన్నారు. భీమన్నగారు ఆ రోజులలో చాలా పత్రికలలో పనిచేశారు. ఆయన స్వయంభువు.

విశ్వనాథ సత్యనారాయణగారిని భీమన్నగారు ఎప్పుడూ తప్పుపట్టలేదు. జాషువా కవిని ఏనాడూ తక్కువ చేయలేదు. సమత్వం యోగ ముచ్యతే- సమస్త విశ్వవిద్యాలయ తెలుగు శాఖలన్నింటా భీమన్నగారి గ్రంథాలు ఎందుకు అధ్యయనం చేయదు? హిందూ మత కళంకాన్ని ఎందుకు తుడిచి వేయదు!? హిందూ సంస్కృతి, మతం, ధర్మం రసాల వృక్షం కావాలంటే భీమన్నగారిని ఆధ్యయనం చేయాలి. భీమన్నగారు హైదరాబాద్‌లో కట్టుకున్న సొంత ఇంటి పేరు రసాలిని. బహుశా తమ పల్లె మామిడికుదురు కావచ్చు.

- అక్కిరాజు రమాపతిరావు

బాగుండు



చేతివృత్తులు
అంపశయ్యను దాటి
గ్రామాల్లో
పరిఢవిల్లితే బాగుండు

మంగలి కత్తెర
వంకర బుద్ధులను కత్తిరించి
'క్రాపు' చేస్తే బాగుండు!



కమ్మరి కొలిమి
స్వార్థపు మలినాలను
కరిగించేస్తే బాగుండు!


కుమ్మరి
మట్టిలో
కుళ్లు నిండిన మెదళ్లను
కలిపి తొక్కేస్తే బాగుండు!

చాకలి రేవు
ఆకతాయి 'మరకలను'
ఉతికి ఆరేస్తే బాగుండు!

నేత మగ్గం
కీచకుల నరాలను
పడుగు పేకలు పేర్చి
తివాచీ నేస్తే బాగుండు!




వడ్డెర సుత్తి
మనిషికున్న 'అహం' రాళ్లను
తునకలు చేస్తే బాగుండు!



ఎరుకలి తట్ట
అవినీతి అన్యాయాల పెంటను
ఎత్తి పడేస్తే బాగుండు!

వడ్రంగి
పెద్ద బాడిశ
మృగాళ్ల కీచక బుద్ధిని
కసిగా చెక్కేస్తే బాగుండు!



గంగపుత్రుల వల
లంచావతారపు కలుపులను
కట్టి పడేస్తే బాగుండు!

మేదరి తడకలు
మానవత్వాన్ని అల్లుకుని
జగతికి నీడనిస్తే బాగుండు!



గొల్ల కురుమల గొంగడి
అర్థించే దీనులకు
వెచ్చని రక్షణైతే బాగుండు!

కంసాలి కుంపటి
విలువలను మూసపోసి
మనిషికి మెరుగులద్దితే
బాగుండు!

జాతికొక్క నీతి
నీతి తప్పిన మానవ జాతికి
వైద్యం చేస్తే బాగుండు!

- పుచ్చ కుమారస్వామి



సంబురం

మనిషికి సంబురం కావాలి
ఏదో ఒకటి ఎప్పుడూ ఒకటి
అందరూ కలవాలని
అందరితో కూడాలని

రంగురంగుల కలల్ని
సాకారం చేసుకోవాలని
సప్తవర్ణాల ఇంద్రధనుస్సు
ఆకాశమంత పరుచుకున్నట్టు
తన జీవితం నిండా
జీవం ఉట్టిపడాలని
లోలోన మనిషి కోరిక

పురివిప్పిన నెమలి అందానికి
ఎన్ని ఈకలు ఒకటిగా ఉంటాయో
మనిషికి మనిషి ఊతమిస్తే
సంబరం అంబరాన్నంటుతుంది
మేఘం ఆకాశాన్ని చుంబించినట్టు

పండుగైనా కొత్త ఏడాదైనా
పెళ్లైనా పేరంటమైనా
ఒక్కడూ ఏమి చేసుకోగలడు
తన సహచరులు లేని
సంతోషం నిరర్థకం నిస్సారం

అందుకే తన ఆలోచన వివేచన
అందరితో కలవమంటుంది
తనమీద తనకెంత నమ్మకమున్నా
మనిషికి సంఘమే బలం
అది ప్రకృతి తనకిచ్చిన వరం
నూతన సంవత్సరమూ అంతే
పదిమందితో పంచుకుంటేనే
ఆనందం

- జంధ్యాల రఘుబాబు, 9849753298

ఆధునిక తెలుగు సాహిత్యంలో 'మత సామరస్యం'

ఆధునిక తెలుగు సాహిత్యంలో మతసామరస్యాన్ని' ప్రతిబింబించే రచనలు కోకొల్లలు. విభిన్న సాహితీ ప్రక్రియలు ఈ సృజనాత్మక భావాలను చైతన్య స్వరాలుగా వెదజల్లడానికి తెలుగునాట కంకణం కట్టుకున్నాయి. వీటిలో కథ, గేయం, గీతం, పద్యం, వచనకవిత, మినీ కవిత వంటి రచనా ప్రక్రియలు తమ వంతు పాత్రను చాలా సమర్థవంతంగా పోషిస్తూ వస్తున్నాయి. ఈ ప్రవాస పరంపరలో ఆధునిక వచన సాహిత్యం గురజాడ అప్పారావు రచనలతో ఊపిరిపోసుకుంది. వ్యవహారికభాషకు పట్టం కట్టి, గిడుగు పిడుగు రామమూర్తి పంతులుగారితో కలిసి విప్లవాత్మమైన మార్పులను తీసుకొచ్చాడు గురజాడ. బరంపురంలో జరిగిన సర్వమత సహపంక్తి భోజనాల ప్రభావంతో 'ముత్యాల సరాలు' అనే మాత్రా చందస్సును ప్రవేశపెట్టి కవితా రచనకు శ్రీకారం చుట్టాడు. ఆధునిక వచన సాహిత్యానికి వేగుచుక్కై, మత సామరస్యాన్ని ప్రతిఫలింపజేయడంలో సంఘ సంస్కరణోద్యమానికి మూలపురుషుడయ్యాడు గురజాడ.

"మీ పేరేమిటి?" కథలో భిన్న మతస్థుల సంఘర్షణతో తలెత్తిన వివాదం, గుండం తొక్కే మిషతో జరిగిన రచ్చ మధ్యలో... అప్రయత్నంగా ఊడిపడిన నాంచారమ్మ తెగువ గొప్ప చైతన్యానికి ప్రతీక. పలు తెగలమధ్య జరుగుతున్న మత వివాదానికి చరమగీతం పాడేలా చేసిందామె. రామనామం జపించే పీరు సాహెబు అగ్ని గుండంలోంచి 'అల్లా-రామ్' అంటూ నడిచిపోతాడు. గురజాడ మాటల్లో చెప్పాలంటే.. "రాముడే కాదు.. ఏ దేవుడిమీదైనా నిజమైన నమ్మకమన్నది ఏడిస్తే.. ఒక గుండమే కాదు-అన్ని కష్టాలు తరించవచ్చు.." అంటాడు. ఈ కథలో గురజాడ ప్రబోధించినట్టుగా.. ఏ మతాన్ని అవలంబించినా, ఏ దేవుణ్ణి ఆరాధించినా.. మానవుడికి ఆత్మ సంకల్పం, వ్యక్తిగత విశ్వాసం అవసరమని బలంగా నొక్కి చెబుతాడు.

"శివుడూ, విష్ణూ.. పేర్లే ఐనపుడు, బుద్ధుడు శివుడు కారాదా?" అన్న శాయన్న భుక్త పలుకులు సర్వమత సామరస్యానికి అద్దం పడతాయి. "సంస్కర్త హృదయం" కథలో కూడా.. "ఎంతటి విరుద్ధ మతమైనా.. శాస్త్ర సమ్మతమేనని సమర్థించగల పండితుడు" అంటూ విశ్వనాధశాస్త్రిని దృష్టిలో పెట్టుకొని... ఈ మాటలు పలికిస్తాడు గురజాడ. 'భిన్న మతాల కలయిక సారం ఒక్కటే' అన్న అంతర్లీన ధ్వని వినిపిస్తుంది ఇందులో. కాబట్టే.. గురజాడ విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని మత విశ్వాసంతో సగర్వంగా ఎలుగెత్తి చాటగలిగాడు.

మరొక విశిష్టమైన కథా రచయిత సలీం రాసిన "రాణీగారి కథలు" హిందూ- ముస్లిం సమైక్యతకి, మతసామరస్యానికి సజీవ దర్పణంగా నిలుస్తాయి. వీటిలో.. 'ఆరడుగుల నేల' కథ గొప్ప మానవతా విలువలకి పట్టం కట్టి, మతాతీతమైన అనుబంధానికి నిలువుటద్దంగా కనిపిస్తుంది. నిఖా జరిగే సమయానికి పెళ్లికూతురు వేరే హిందూ అబ్బాయిని ప్రేమించి, రక్షణ కోసం పోలీసు శాఖను ఆశ్రయించి, వివాహం జరపవలసిందిగా కోరుతుంది. దీనికి ససేమిరా అంగీకరించని ఇరువైపుల మత పెద్దలు.. గొడవకి దిగి, రక్తపాతాన్ని సృష్టిస్తారు. నజీర్ రెహ్మాన్ అనే ముస్లిం సంఘ సంస్కర్త హిందూ యువతిని పెళ్లాడి.. మతంకన్నా మానవత్వం గొప్పదని విశ్వసించి ఆదర్శనీయమైన జీవితాన్ని గడుపుతాడు. అలాంటివ్యక్తి కాలం చేశాక-స్మశానంలో అతనికి 'ఆరడుగుల నేల' చోటుని దక్కనీయకుండా.. తమ మతాచారాలను కించపరిచాడనే ఉద్దేశంతో వెలివేస్తారు. గత్యంతరంలేని పరిస్థితుల్లో బెస్తవాళ్లు తమ పూరి గుడిసెల మధ్య అతనికి సమాధి కట్టించి, ఖనన సంస్కారాలు పూర్తిచెయ్యడంతో కథ ముగుస్తుంది. ఈ కథతోపాటు గేయ కవిత్వం కూడా ఒక ప్రత్యేకమైన గుర్తింపును కలిగివుంది. ఈ ఒడుపును గురజాడ చాలా సమర్థవంతంగా అందిపుచ్చుకున్నాడు. 'దేశభక్తి' గేయంలో ఓచోట గురజాడ ఇలా చెబుతాడు. "మతం వేరైతేను ఏమోయి / మనసులొకటై మనుషులుంటే" అని అనడంలో.. మతాలు వేరైనా మనసులు కలిసిన మనుషులే ముఖ్యం అని చాటిచెబుతాడు. మతానికన్నా మనసుకే అధిక ప్రాధాన్యతను ఇవ్వడం ఇక్కడ గమనార్హం.

"మతములన్నియు మాసిపోవును / జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును" అంటాడు. ఇక్కడ మతంకంటే జ్ఞానానికే పెద్ద పీట వేస్తాడు గురజాడ. అన్ని మతాలకు మూలం జ్ఞానం అనే ఇంగితజ్ఞానాన్ని లోకానికి సందేశ రూపంలో అందిస్తాడు.

ఇలాంటి కోవకి చెందిన జాతీయ సమైక్యతా గీతమొకటి బోయి భీమన్న కలం నుంచి జాలువారింది.

"ఏది హిందూ ఏది ముస్లిం ఏది క్రైస్తవము? / ఎల్ల మతముల సారమొక్కటే / హృదయమే మతము" అనే సందేశాత్మక గీతం మతసామరస్యం యొక్క ఆవశ్యకతను సాహితీ లోకానికి చాటిచెబుతుంది. పద్యం హృద్యమైన భావ సందేశాన్ని అందిస్తుంది. ఈ అనుభవాన్ని చాలా దూరదృష్టితో కవి రాయప్రోలు సుబ్బారావుగారు ఒకచోట గాఢాభివ్యక్తితో వ్యక్తీకరిస్తాడు.

"అర్చకులెల్ల మందిరమునందు సమాహితమైన వేళ ప్రేమార్చి రగిల్చి యీ మత మతాంతర వైరము లెల్ల కాల్చి చల్లార్చితివేని శంఖరవ మందె నమాజుల పిల్పు మేళమై పేర్చి వినంబడున్ పిదప ప్రేమనే నిర్గుణమందు రందరున్"

- అంటూ మత వైరములను లేకుండా చేసి, ప్రేమను అందరిలోనూ వ్యాపించేట్లు చేయాలని కవి రాయప్రోలు సుబ్బారావు గారి ఉవాచ. దీనికి కారణం ఆధునిక కవులు ఈ మత కల్లోలాలను ప్రత్యక్షంగా చూసినవాళ్లున్నారు. అనుభవించినవాళ్ళూ ఉన్నారు. ఈ వేదనను మత సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆరాటపడుతున్నాడు కవి.

సుమన్ అనే ఆధునిక కవి పలుకుల్లో చెప్పాలంటే..

"హిందూ ముస్లిం సోదర / బాంధవ్యము మంటగలిపి బలిమిన్ కలిమిన్ / కొందరు ముష్కరులెప్పుడూ / సంధింతురు పగల సెగలు సత్యము సుమనా" అంటూ వాపోతాడు కవి. మతపరమైన విధ్వంసానికి కొందరు ముష్కరులు ఏ విధంగా కారుణభూతులవుతున్నారో నిరూపించే పద్యం ఇది.

వచన కవిత్వం విషయానికొస్తే సర్వజన సమ్మతమైనదిగా కనిపిస్తుంది. అందుకే బాలసాహిత్యాన్ని సృజిస్తూ దేవులపల్లి కృష్ణశాస్త్రి ఒకచోట తన అంతరంగాన్ని ఇలా బయటపెడతారు. - "మతమన్నది నా కంటికి మసకైతే / మతమన్నది నీ మనసుకు మచ్చైతే / మతం వద్దు గితం వద్దు / మాయామర్మం వద్దు / ద్వేషాలు, రోషాలు తెచ్చేదే మతమైతే / కలహాలు కక్షలు కలిగించేదే మతమైతే / మతం వద్దు గతం వద్దు / మారణహోమం వద్దు" అంటూ కష్టాలు కొనితెచ్చే మతాన్ని నిలువెల్లా ఈసడిస్తూ నిర్మొహమాటంగా తన అభిప్రాయ ప్రకటనను వెలిబుచ్చుతారు కవి.

ఎల్లోరా అనే మరొక కవి వర్తమాన సామాజిక ప్రపంచాన్ని కళ్ళకు కట్టించే ప్రయత్నం చేస్తాడు. "ఈ నా ధరిత్రీ వదనాన్ని వికృతం చేసే / భరతజాతి మనుగడను కకావిలు చేసే / అవివేకులు స్వార్థపరులు అసంతృప్తి మతపిచ్చితో / తమని తాము బంధించుకొన్న సూత్రాలలోంచి / మూఢ నమ్మకాల లోంచి / బయటపడలేని నిస్సహాయ జీవులు" - అని మతమౌఢ్యులను చూసి జాలిపడుతూ.. "అన్ని మతాల సారాన్ని ప్రవహించడం తప్ప / స్వార్థం ఎరుగని జీవనదుల్లా ఉప్పొంగుతాను" అంటూ సర్వమత సామరస్యాన్ని బోధిస్తాడు ఎల్లోరా.

మతాన్ని గురించి, సర్వమత సామరస్యాన్ని గురించి మహాకవి శ్రీశ్రీ ఇలా ఉపదేశిస్తాడు. "మతము ఎన్నియు దైవ సమ్మతములగును / మతములన దైవపూజకు మార్గములగు / అన్నిమతముల యందున ననుసరించు / దగిన నీతులు గలవు వందల కొలది" అంటూ సర్వమతాల నీతి అంతస్సారాన్ని గ్రహించి నిజాన్ని తెలుసుకోవాలంటాడు. నీతిని బోధించే మతాన్ని ఆచరించాలిన జ్ఞానబోధ చేస్తాడు.

మినీ కవితల ప్రస్థానంలోనూ అనేక హృదయావిష్కరణలు కనిపిస్తాయి. ఇలా 'ఆధునిక తెలుగు సాహిత్యంలో మత సామరస్యం'పై పలు రచనలు వెలుగు చూసి, మానవాళి అభ్యున్నతికి, పురోగతికి, మానసిక వికాసానికి దారితీశాయి. ఈ ముందుచూపు భావితరాలకు మత ప్రమేయం లేని రాజ్య వ్యవస్థను పటిష్టపరిచి విశ్వమానవ దృష్టిని ఏకత్వంతో ప్రసాదిస్తుందని ఆశిద్దాం!

- మానాపురం రాజా చంద్రశేఖర్, 9440593910

రాహుల్, నిర్మల ట్వీట్ల యుద్ధం

హెఏఎల్‌కు ఇచ్చిన ఆర్డర్లను చూపాలన్న కాంగ్రెస్ చీఫ్ ❋ ఆర్డర్లు కాదు.. ఆదేశాలే ఇచ్చానన్న సీతారామన్
❋ ప్రజలను తప్పుదోవ పట్టించేది మీరంటే మీరు అంటూ విమర్శలు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 6: హెచ్ఏఎల్‌ను పటిష్టం చేసేందుకు ఆ సంస్థకు యుద్ధ విమానాలు, హెలికాప్టర్ల తయారీకి సంబంధించిన లక్ష కోట్ల రూపాయల విలువ చేసే ఆర్డర్లు ఇస్తున్నామంటూ రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో చేసిన ప్రకటన వివాదాస్పమైంది. నిర్మలా సీతారామన్ అబద్ధం చెప్పారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపిస్తే, రాహుల్ గాంధీ పూర్తి వివరాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేస్తున్నారని రక్షణ శాఖ మంత్రి దుయ్యబట్టారు. హెచ్ఏఎల్‌కు లక్ష కోట్ల విలువ చేసే ఆర్డర్లు ఇచ్చామనటం ద్వారా నిర్మలా సీతారామన్ లోక్‌సభను తప్పుదోవ పట్టించారు.. ఆమె అబద్ధాలు చెప్పారంటూ రాహుల్ ఆదివారం ట్వీట్ చేశారు. లోక్‌సభను తప్పుదోవ పట్టించిన నిర్మలా సీతారామన్ మంత్రి పదవికి రాజీనామా చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఒక అబద్ధం చెబితే దానిని కప్పిపుచ్చుకునేందుకు మరిన్ని అబద్ధాలు చెప్పక తప్పదు.. నిర్మలా సీతారామన్ హెచ్ఏఎల్ విషయంలో అబద్ధాల మీద అబద్ధాలు చెబుతున్నారని ట్వీట్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందాన్ని సమర్థించే తొందరలో నిర్మలా సీతారామన్ పార్లమెంటును తప్పుదోవ పట్టించారని రాహుల్ ఆరోపించారు. రక్షణ శాఖ మంత్రి పార్లమెంటులో హెచ్ఏఎల్‌కు ఇచ్చిన లక్ష కోట్ల విలువైన ఆర్డర్లకు సంబంధించిన వివరాలను వెల్లడించాలని రాహుల్ డిమాండ్ చేశారు. హెచ్ఏఎల్‌కు యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు తయారీ చేసే ఆదేశాలు ఇవ్వనున్నట్లు చెప్పాను తప్ప.. ఆర్డర్లు ఇచ్చినట్లు తాను పార్లమెంటులో చెప్పలేదని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన ట్వీట్‌కు ప్రతి ట్వీట్ ఇస్తూ.. తాను పార్లమెంటులో ఏం చెప్పాననేది ఆయన పూర్తిగా చదివితే బాగుంటుందని హితవు చెప్పారు. హెచ్ఏఎల్‌కు ఆదేశాలు ఇవ్వనున్నట్లు చెప్పాను తప్ప ఆదేశాలపై సంతకం చేశానని ఎక్కడా చెప్పలేదని ఆమె స్పష్టం చేశారు. రాహుల్ వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారని ఆమె ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేశాన్ని తప్పుదోవ పట్టించటం సిగ్గుచేటని ఆమె విమర్శించారు. 2014-18 మధ్య హెచ్ఏఎల్ రూ.26,570 కోట్ల ఒప్పందాలపై సంతకాలు చేసింది.. మరో రూ.73వేల కోట్ల విలువైన కాంట్రాక్టులు తయారవుతున్నాయని మాత్రమే తాను లోక్‌సభలో చెప్పానని ఆమె వివరణ ఇచ్చారు. రాహుల్ పార్లమెంటు వేదికగా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని నిర్మలా సీతారామన్ డిమాండ్ చేశారు.





భారతదేశం గణతంత్ర వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం ఓ పక్క మంచు, మరో పక్క వర్షం ముంచెత్తుతున్నా న్యూఢిల్లీలో రిహార్సల్స్ చేస్తున్న జవానులు

సత్తా చూపాల్సిందే!

❋ యూపీలో ఒంటరిపోరుకే కాంగ్రెస్ మొగ్గు
❋ రాష్ట్రం నాయకత్వం నుంచీ అదే నివేదిక
❋ జనం మనవైపే అంటున్న సీనియర్ నేతలు
❋ పొత్తులతో నష్టం తప్ప లాభం లేదని వాదనలు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 6: లోక్‌సభ ఎన్నికలు మరో నాలుగు నెలల్లో జరగనుండగా దేశంలోని అతి పెద్దరాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ (ఎస్పీ), బహుజన సమాజ్‌వాదీ (బీఎస్పీ) కలిసి పోటీచేసే బదులు సంకుల సమరానికి సిద్ధమవుతున్నాయి. యువనాయకుడు అఖిలేష్ యాదవ్ నాయకత్వంలోని ఎస్పీ, ప్రధాన మంత్రి పదవిపై కన్నేసిన బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి కలిసి పోటీ చేయాలనుకోవటంతోపాటు కాంగ్రెస్‌ను దూరంగా ఉంచాలనే వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నాయి. దీంతో స్వతంత్రంగా రంగంలోకి దిగాలని కాంగ్రెస్ అధినాయకత్వం ఆలోచిస్తోంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ మాదిరిగా 80 లోక్‌సభ సీట్లున్న దేశంలోని అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో స్వతంత్రంగా పోటీ చేయటం ద్వారా తమ సత్తాను నిరూపించుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వంతోపాటు కేంద్ర నాయకత్వం కూడా భావిస్తున్నట్లు చెబుతున్నారు. అఖిలేష్ యాదవ్, మాయావతి, ఆర్ఎల్‌డీ అధ్యక్షుడు అజిత్ సింగ్ లక్నోలో సమావేశమై 80 లోక్‌సభ సీట్ల నుండి ఎవరెన్ని సీట్లలో పోటీ చేయాలనే అంశంపై ఒక అవగాహనకు వచ్చారు. ఎస్పీ 37, బీఎస్పీ 38 సీట్లలో పోటీ చేసి ఆర్ఎల్‌డికి మూడు సీట్లు ఇవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయించుకున్నారు. రాష్ట్రంలోని ఒకటి, రెండు చిన్న పార్టీలను కూడా తమ కూటమిలో చేర్చుకుని వారికి ఒక్కొక్క సీటు కేటాయించటం ద్వారా బీజేపీని ఎదుర్కొనేందుకు పటిష్టమైన కూటమిని తయారు చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకున్నా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, మాజీ అధ్యక్షురాలు, యుపీఏ చైర్పర్సన్ సోనియా గాంధీ పోటీచేసే అమేథీ, రాయబరేలీ లోక్‌సభ సీట్లలో తమ అభ్యర్థులను పోటీకి దించకూడదనే వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్‌తో సీట్ల పంపకం గురించి ఎలాంటి చర్చలు జరపకూడదనే నిర్ణయం కూడా తీసుకున్నట్లు తెలిసింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో తమతో పొత్తు పెట్టుకునేందుకు నిరాకరించిన కాంగ్రెస్‌తో లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు పెట్టుకోకూడదని మాయావతి గట్టి పట్టుదలతో ఉన్నట్లు తెలిసింది. దీనికితోడు మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌తో ఉత్తరప్రదేశ్‌లో పొత్తు పెట్టుకుంటే తమ ఉనికికే ప్రమాదమని అఖిలేష్ యాదవ్, మాయావతి భావిస్తున్నట్లు తెలిసింది. ఈ అభిప్రాయంతో అజీత్‌సింగ్ కూడా ఏకీభవిస్తున్నట్లు చెబుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ ఏమాత్రం పుంజుకున్నా తమ పార్టీలకు రాజకీయంగా తీరని నష్టం వాటిల్లుతుందని ఈ మూడు ప్రాంతీయ పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. ఇదిలాఉంటే కాంగ్రెస్ కూడా ఈసారి ఉత్తరప్రదేశ్‌లో అటో ఇటో తేల్చుకోవడం మంచిదని ఆలోచిస్తున్నట్లు ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ శాసన సభ ఎన్నికల్లో విజయం సాధించిన తమకు ఉత్తర ప్రదేశ్‌లోనూ బాగానే సీట్లు వస్తాయి.. రాష్ట్ర ప్రజలు మనవైపు చూస్తున్నారు అని యూపీ కాంగ్రెస్ నాయకులు జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి నివేదిక పంపినట్లు తెలిసింది. బీజేపీ విధానాలతో విసిగిపోయిన రాష్ట్రంలోని ఉన్నత వర్గాలు, ముస్లిం మైనారిటీలు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్ బబ్బర్ భావిస్తున్నారు. ఎస్పీ, బీఎస్పీ ఒక కూటమిగా ఏర్పడుతున్నందున మనం ఎలాంటి వ్యూహాన్ని అనుసరించాలని రాహుల్ గాంధీ ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్ నాయకులను అడిగారు. దీనికి రాష్ట్ర నాయకత్వంతో పాటు జిల్లా నాయకులు కూడా స్వతంత్రంగా ఎన్నికల బరిలోకి దిగితేనే బాగుంటుందంటూ నివేదకలు పంపించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ మాదిరిగానే యుపీలోనూ కాంగ్రెస్ పరిస్థితి బాగా మెరుగవుతోంది.. జిల్లా స్థాయిలో కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి రావటంతోపాటు ఉత్సాహంగా పని చేస్తున్నారు.. మూడు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు యుపీలో కూడా ప్రజల నుండి మంచి మద్దతు లభిస్తోంది.. ఈ తరుణంలో మనం పొత్తులు పెట్టుకుని కొన్ని సీట్లలో మాత్రమే పోటీ చేయటం వలన నష్టం తప్ప లాభం ఉండదని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంతోపాటు ఏఐసీసీకి చెందిన కొందరు సీనియర్ నాయకులు భావిస్తున్నారు. అతిపెద్ద రాష్ట్రంలో ప్రతిపక్షం విడివిడిగా పోటీచేస్తే బీజేపీకి కలిసి వస్తుందనే ఆందోళన కూడా కాంగ్రెస్‌లో వ్యక్తమవుతున్నా పార్టీ ప్రయోజనాల గురించి ఆలోచించక తప్పదని నాయకులు స్పష్టం చేస్తున్నారు. బీజేపీని ఓడించే ఆలోచనతో కాంగ్రెస్ మనుగడను దెబ్బతీసుకోవటం ఎంతమాత్రం అభిలషణీయం కాదన్నది వారి వాదన.

పౌరసత్వం బిల్లుపై భిన్నస్వరాలు

❋ అసమ్మతి గళం విప్పనున్న కాంగ్రెస్, టీఎంసీ, సీపీఎం, ఎస్పీ

న్యూఢిల్లీ, జనవరి 6: అస్సాంలో వివిధ వర్గాల ప్రజలకు సంబంధించి పౌరసత్వం సవరణ బిల్లుపై పార్లమెంటరీ కమిటీ సంయుక్త కమిటీ రూపొందించిన తుది నివేదికపై అసమ్మతి గళం విప్పేందుకు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, సీపీఎం, సమాజవాది పార్టీలు సన్నద్ధమవ్వుతున్నాయి. సోమవారం ఈ సవరణ బిల్లు లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కనీసం నాలుగు ప్రధాన పార్టీల మద్దతు ఉండాలి. బిల్లుపై రూపొందించిన సంయుక్త పార్లమెంటరీ పార్టీలోని సభ్యులైన నాలుగు ప్రతిపక్ష పార్టీలు నిరశన తెలిపేందుకు సిద్ధమవుతున్నాయని ఆయా పార్టీల వర్గాలు తెలిపాయి. 'పౌరసత్వంపై రూపొందించిన 2016 సవరణ తుది బిల్లుపై ఏకాభిప్రాయం కుదరలేదు. దీనిని వ్యతిరేకిస్తూ లోక్‌సభలో గళమెత్తనున్నాయి' అని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈమేరకు లెఫ్ట్ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన పార్లమెంటు సభ్యులతో కూడిన కమిటీ ఇటీవల గుజరాత్, రాజస్తాన్, అస్సాం రాష్ట్రాల్లో పర్యటించిన సందర్భంగా పౌరసత్వంపై సవరణ బిల్లుపై ఆయా ప్రాంతాల్లో వ్యతిరేకత కనిపించిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యంగా అస్సాంలో ఈ సవరణ బిల్లుపై మరింత తీవ్ర వ్యతిరేకతను చవిచూశామని, దీంతో సున్నితమైన ఈ అంశంపై తుది నివేదిక వచ్చేలోగా మరోసారి రాష్ట్రంలో పర్యటిస్తామని ఆయా పార్టీల నాయకులు తెలిపారు. ప్రస్తుతం పౌరసత్వం సవరణపై తుది నివేదిక తయారు కావడం చాలా ఇబ్బందికరంగా ఉందని లెఫ్ట్ పార్టీకి చెందిన ఒక సభ్యుడు విచారం వ్యక్తం చేశారు. మతానికి అనుసంధానం చేస్తూ రూపొందించిన పౌరసత్వం బిల్లుపై ప్రతిపక్ష పార్టీలన్నీ అభ్యంతరంతో కూడిన ప్రతిపాదనలను కేంద్రం ముందుకు దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. 'మతంలో లింకు పెట్టి పౌరసత్వంపై బిల్లు రూపొందించడం ఆమోద యోగ్యం కాదు. వెంటనే దానిని తొలగించాలి. ఇది దేశ నాగరికత, సంస్కృతితోపాటు రాజ్యాంగ వ్యతిరేకం. కులం, మతాన్ని లింకుపెట్టి పౌరసత్వ బిల్లును రూపొందించడం సమంజసం కాదు. ఇది సార్వత్రికంగా ఉండాలి' అని ఈ బిల్లుపై అసమ్మతి గళం విప్పిన మరో సభ్యుడు పేర్కొన్నారు. ఆరు మైనారిటీ మతాలను ప్రస్తావిస్తూ ఉన్న అంశాన్ని తొలగించాలని కోరుతూ క్లాజ్-2కు సవరణలు ప్రతిపాదించామని, ఈ బిల్లును లౌకికవాద దృష్టితో చూడాలని తాము ఆకాంక్షించినట్టు తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యుడు ఒకరు తెలిపారు.



'జౌళి రంగం విజయాలు తదుపరి కార్యాచరణ' అన్న అంశంపై ఆదివారం ఢిల్లీలో జరిగిన జాతీయ సదస్సు సందర్భంగా నివేదికను విడుదల చేస్తున్న కేంద్ర జౌళి మంత్రి స్మృతీ ఇరానీ, సహాయ మంత్రి అజయ్ తమ్తాలు

బీజేపీ మునుగుతున్న నావ

❋ మోదీ పెత్తనంతో ఎన్డీఏ కుదేలు
❋ వచ్చే ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదు
❋ సీనియర్ కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్



న్యూఢిల్లీ, జనవరి 6: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ పెత్తనం పెరగడంతో సంకీర్ణ ప్రభుత్వంలోని పార్టీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయని సీనియర్ కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ధ్వజమెత్తారు. ఎన్డీఏ కూటమిలోని కొన్ని పార్టీలు బీజేపీతో తెగతెంపులు చేసుకుని బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. చివరకు బీజేపీతో మొదటి నుంచి స్నేహంగా ఉన్న పార్టీలు కూడా అసంతృప్తిగా ఉన్నాయంటే ,మోదీ పని తీరు ఎంత అధ్వాన్నంగా ఉందో తెలుస్తుందన్నారు. ఎన్డీఏ కూటమిలోని పార్టీల నేతలు మోదీ ఏకపక్ష వైఖరి, నియంతృత్వ ధోరణి పట్ల అసహనంతో ఉన్నారన్నారు. బీజేపీ మునిగిపోతున్న నావ అన్నారు. ఎన్డీఏ కూటమిలో లుకలుకలు బయలుదేరుతాయన్నారు. యుపీఏ కూటమిలో ఈ పరిస్థితి ఎప్పుడూ తలెత్తలేదన్నారు. ఒకే గొంతు, ఒకే నాయకత్వం కింద ప్రజలకు యూపీఏ మంచి పాలన అందించిందన్నారు. కేంద్రంలో ఒన్ మ్యాన్ షో నడుస్తోందన్నారు. బీజేపీ వైఖరికి విసుగుచెంది టీడీపీ, ఆర్ఎల్ఎస్పీ పార్టీలు బయటకు వచ్చాయన్నారు. ఇంకా అప్నాదళ్, ఎస్‌బీఎస్‌పీ పార్టీలు దూరంకావడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ చిత్తుగా ఓడిపోతుందన్నారు. చివరకు శివసేన కూడా బీజేపీపై ధ్వజమెత్తుతోందన్నారు. బీజేపీ పనితీరుపై మిత్ర పక్షాల్లో నమ్మకం పోయిందన్నారు. ఆ పార్టీకి విశ్వసనీయత పోవడంతో పార్టీలు, ప్రజలు దూరమవుతున్నారన్నారు. ఒక ప్రశ్నకు బదులిస్తూ రుణమాఫీ వ్యవసాయరంగానికి పరిష్కారం కాదని, కాని ఇది కచ్చితంగా ఉపశమనం కలిగించే చర్య అన్నారు.

అఫ్గాన్‌లో కూలిన గని

❋ 30 మంది దుర్మరణం

కుందుజ్, జనవరి 6: అఫ్గానిస్తాన్‌లో ఒక బంగారు గని కూలిపోవడంతో దాదాపు 30 మంది మరణించగా, ఏడుగురు గాయపడ్డారు. ఉగ్రవాదుల దాడులతో అతలాకుతలం అవుతున్న అఫ్గాన్‌లో ఇది మరో విషాదకర సంఘటనగా అధికారులు అభివర్ణించారు. ఈశాన్య అఫ్గాన్ కోహిస్తాన్ జిల్లా బదక్షాన్ ప్రావిన్స్ గవర్నర్ మొహమ్మద్ రుస్తాం రాగి వివరాల మేరకు- స్థానిక నదీ పరీవాహక ప్రాంతంలో బంగారంకోసం గాలించేందుకు 200 అడుగుల గోతిని తవ్వి అందులోకి గ్రామస్థులు దిగారు. అకస్మాత్తుగా గోయి పూడుకుపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. ఈ ప్రమాదంలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన వివరించారు. అయితే మరణించినవారిలో పిల్లలు ఎవరూ లేరని గవర్నర్ ప్రతినిధి నిక్ మొహమ్మద్ నజారి తెలిపారు. తరతరాలుగా ఇక్కడి ప్రజలకు ఇదే వృత్తి. ఇక్కడ బంగారం కోసం అన్వేషిస్తుంటారని ఆయన వివరించారు. పర్వతాలతో నిండి ఈ ప్రాంతం చాలా వెనుకబడి వుంటుంది. తజకిస్తాన్, చైనా, పాకిస్తాన్ సరిహద్దులో ఉన్న ఈ ప్రాంతంలో శీతాకాలంలో విపరీతమైన మంచు కూడా కురుస్తుంటుంది. అక్రమ తవ్వకాలు ఇక్కడ మామూలేనని ఆయన చెప్పారు.

కోటి ఉద్యోగాలు హుళక్కే

నీరుగారిన మోదీ ఉపాధి హామీ ❋ కాంగ్రెస్ పార్టీ ధ్వజం


న్యూఢిల్లీ, జనవరి 6: భారతదేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందని ఓ మేథోమధన నివేదికను ఉటంకిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆదివారం స్పష్టం చేసింది. ఈ పరిస్థితికి కేంద్రంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వ విధానాలని తప్పుపట్టింది. గత ఏడాది కోటి మంది ఉద్యోగాలు కోల్పోయారంటూ ఈ నివేదికలోని వివరాలను కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ తివారీ వెల్లడించారు. ప్రతి యేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మోదీ సారథ్యంలోని బీజేపీ సర్కారు నిలబెట్టుకోలేకపోయిందని ధ్వజమెత్తారు. రెండు కోట్ల ఉద్యోగాల మాట ఎలావున్నా కోటి ఉద్యోగాలే కోల్పోయే పరిస్థితి తలెత్తిందని, దీనివల్ల నిరుద్యోగ సమస్య మరింత తీవ్రంగా పెరిగిపోయిందని అన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో యేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించడంతోపాటు మంచి రోజులను కూడా తీసుకువస్తామని, 2014లో మోదీ ఇచ్చిన హామీ ఆవిరైపోయిందని ఆయన అన్నారు. అంటే ప్రధాని ఇచ్చిన హామీ ప్రకారం ఈ ఐదేళ్ల కాలంలో పది కోట్ల ఉద్యోగాలను ఎన్డీఏ ప్రభుత్వం కల్పించాల్సి ఉంటుందని, కానీ పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉందన్న విషయాన్ని భారత ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షణకు చెందిన నివేదిక స్పష్టం చేసిందని అన్నారు. 2018లోనే కోటి మంది ఉద్యోగాలను కోల్పోయారని ఈ నివేదిక తేటతెల్లం చేసిందని అన్నారు. 2017 డిసెంబర్‌లో 40 కోట్ల 79 లక్షల మంది ఉద్యోగులుంటే 2018 నాటికి 39.07 కోట్లకు తగ్గిపోయిందని అన్నారు. దీనిబట్టి చూస్తే కోటి మంది ఉద్యోగాలు కోల్పోయినట్టు స్పష్టమవుతుందని స్పష్టం చేశారు. ఇలా ఉద్యోగాలు కోల్పోయిన నిరుద్యోగుల్లో 80 శాతం మంది మహిళలే ఉండడం ఆందోళన కలిగిస్తోందని, అలాగే 90 శాతానికి పైగా ఈ నష్టం గ్రామీణ ప్రాంతాలకు వాటిల్లిందని ఆయన తెలిపారు. 2018 డిసెంబర్‌లో భారత్‌లో నిరుద్యోగుల సంఖ్య 7.4 శాతానికి పెరిగిందని పేర్కొన్న ఆయన దశాబ్ద కాలంలోనే ఇది అత్యధికమని ఆయన తెలిపారు. ఇది కాకుండా పెద్ద నోట్ల రద్దు వల్ల కూడా ఆర్థిక వ్యవస్థకు, ఉపాధి కల్పనకు తీవ్ర విఘాతం కలిగిందని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సమాజ సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించడంలో విఫలమైందని తెలిపారు.

హెచ్ఏఎల్‌కు పైసా కూడా విదల్చని కేంద్రం
❋ మోదీ సర్కారుపై మండిపడిన కాంగ్రెస్

ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న హిందూస్తాన్ ఏరోనాటిక్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు కేంద్ర ప్రభుత్వం పైసా కూడా విదల్చలేదని కాంగ్రెస్ పార్టీ ఆదివారం తీవ్రంగా మండిపడింది. హెచ్ఏఎల్ పునరుద్ధరణకు లక్ష కోట్ల రూపాయల సేకరణకు కృషి చేసినట్టు కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. హెచ్ఏఎల్ పునరుద్ధరణకు ఇంతవరకు ఒక్క పైసా కూడా విదల్చలేదని కేంద్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించింది. అంతకుముందు రోజు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ హెచ్ఏఎల్ ఉద్యోగులకు చెల్లించాల్సిన వెయికోట్ల రూపాయల జీతాలు ఇంతవరకు ఇవ్వకపోవడం ఇదే తొలిసారి అని ఎద్దేవా చేశారు. కాగా, హెచ్ఏఎల్ పునరుద్ధరణకు ఇంతవరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇంతవరకు పైసా కూడా విదల్చలేదని, కనీసం ఒక్క ఆర్డర్ కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జీవాలా ఆదివారం ట్వీట్ ద్వారా ధ్వజమెత్తారు.

ఆధార్‌తో అంతా ఆదాయే

❋ ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పు ❋ ఆయుష్మాన్ భారత్ లాంటి మూడు పథకాలకు నిధులు సమకూర్చొచ్చు
❋ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ, జనవరి 6: ఆధార్ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయడం వల్ల మన దేశ ఆర్థిక రంగంపై పెనుమార్పును చూపిందని, ఈ పథకం ద్వారా ఆదా చేసిన డబ్బుతో ఇప్పుడు దేశంలో అమలవుతున్న ఆయుష్మాన్‌భారత్ లాంటి మూడు పెద్ద సంక్షేమ పథకాలకు నిధులను సమకూర్చుకోవచ్చునని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. ఈ పథకం యూపీఏ హయాంలో ప్రవేశపెట్టినా సొంత వారి నుంచి ఎదురైన అడ్డంకులు, నిలకడలేని వైఖరి కారణంగా దానిని పూర్తి చిత్తశుద్ధితో అమలు చేయలేకపోయిందని, కాని ప్రధాని నరేంద్రమోదీ దృఢ చిత్తంతో నిర్ణయాత్మకంగా దానిని అమలు చేయడంతో దేశంలో పూర్తిగా అమలవుతూ విజయవంతం అయిందని ఆయన ఫేస్‌బుక్‌లో వ్యాఖ్యానించారు. 'ఆధార్‌తో లాభాలు-నేడు ఎలా అమలవుతోంది' పేరుతో రాసిన పోస్టులో మనదేశంలో ఆధార్‌ను అమలు చేయడం వల్ల గత ఏడాది మార్చి 31వరకు 90 వేల కోట్లను ఆదా జేయగలిగామని అన్నారు. పలు సంక్షేమ పథకాల్లో నకిలీ లబ్ధిదారులను అరికట్టడం, రెండుసార్లు అంతకన్నా ఎక్కువసార్లు లబ్ధి పొందడం తదితరమైనవి తొలగించడం వల్ల భారత్‌కు ప్రతిఏటా 77 వేల కోట్ల రూపాయలు ఆదా అవుతున్నాయని వరల్డ్ బ్యాంక్ తన నివేదికలో పేర్కొందని ఆయన చెప్పారు. ఈ ఆదా చేసిన మొత్తంతో భారత్‌లో ఇప్పుడు అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ లాంటి పథకాలు మూడు అమలు చేయవచ్చునని అన్నారు. ఇప్పటికే తాము ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భవ పథకం పేదలకు ఎంతో లబ్ధి చేకూర్చుతోందని ఆయన చెప్పారు. పేదలకు ఖరీదైన వైద్యం కూడా అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో తాము ప్రవేశపెట్టిన ఈ పథకంలో 10.74 కోట్ల మందికి ఆరోగ్య బీమా లభిస్తుందని ఆయన తెలిపారు. దీని ద్వారా పేదలకు ఐదు లక్షల రూపాయల వరకు ఆరోగ్య సేవలు కార్పొరేట్ సహా అన్ని ఆసుపత్రులలో అందుతుందన్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు సుమారు ఏడు లక్షల మంది పేద రోగులు ఉచితంగా ఆసుపత్రులలో చికిత్స పొందారని ఆయన వివరించారు.

వాస్తవానికి ఆధార్‌ను ప్రవేశపెట్టిన యూపీఏ ప్రభుత్వం ఆ వ్యవస్థను పూర్తి చిత్తశుద్ధితో అమలు చేయలేకపోవడం వల్ల దానికి సంబంధించిన క్రెడిట్‌ను పొందలేకపోయిందని జైట్లీ వ్యాఖ్యానించారు. ఆధార్ సాంకేతిక పరిజ్ఞానంలో లోపాలున్నాయని, దాని అమలుతో అనేక ఇబ్బందులు వస్తాయని కాంగ్రెస్ పార్టీకి చెందిన న్యాయవాదులే దీనిపై పలు కేసులు వేశారని ఆయన ఈ సందర్భగా గుర్తు చేశారు. కాని మోదీ చిత్తశుద్ధితో, కృతనిశ్చయంతో దీనిని అమలు చేయడం వల్ల పూర్తిగా విజయవంతమైందని, సుప్రీం కోర్టు తీర్పు కూడా తమకు అనుకూలంగా వచ్చిందని ఆయన చెప్పారు. ఆధార్ విధానం ద్వారా ఇప్పుడు బదిలీ అవుతున్న సబ్సిడీ మొత్తాల విలువ 1,69,868 కోట్ల రూపాయలని, ఎలాంటి దళారులు లేకుండా పలు పథకాలకు సంబంధించిన సబ్సిడీ మొత్తం లబ్ధిదారుల ఖాతాలోకి నేరుగా జమ అవుతోందని మంత్రి జైట్లీ తెలిపారు. ఇలాంటి విధానం ప్రపంచంలోని కేవలం భారత్‌దేశంలో మాత్రమే ఉందని ఆయన అన్నారు. 2016లో ప్రవేశపెట్టిన ఆధార్ వ్యవస్థలో ఇప్పటివరకు 122 కోట్ల మంది నమోదయ్యారన్నారు. 18 ఏళ్లుదాటిన వారిలో 99 శాతం మందికి పైగా దీనిలో నమోదై ఉన్నారని చెప్పారు. 22.80 కోట్ల పహల్, ఉజ్వల లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ నేరుగా వారి ఖాతాల్లోకే జమవుతోందని అన్నారు. అలాగే 58.24 కోట్ల రేషన్‌కార్డుదారులను ఆధార్‌తో లింక్ అయ్యాయని, 10.33 ఎంజిఎన్ఆర్ఇజిఏ కార్డుదారులను, 63.52 కోట్ల బ్యాంక్ ఖాతాలను కూడా ఆధార్‌తో అనుసంధానం చేశామన్నారు. ఆదాయపు పన్ను శాఖ వారు ఇప్పటికే 21 కోట్ల పాన్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేశారన్నారు. ఆధార్ ప్రాధికార సంస్థ యుఐడిఏఐ రోజుకు పది కోట్ల లావాదేవీలు జరిపే సామర్థ్యం కలిగి ఉన్నా, దానిద్వారా ప్రస్తుతం రోజుకు 2.7 కోట్లు మాత్రమే జరుగుతున్నాయని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు.

బీజేపీ కదన కుతూహలం!

• కమిటీలను సమాయత్తం చేసిన అధ్యక్షుడు అమిత్ షా

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 6: భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్ షా పార్టీపరంగా లోక్‌సభ ఎన్నికల నగారా మోగించారు. ఆదివారం పార్టీ మ్యానిఫెస్టో కమిటీ, ఎన్నికల ప్రచార కమిటీ, వివిధ సామాజిక సంస్థలతో మాట్లాడే కమిటీ, ప్రచార సామాగ్రి కమిటీ, ప్రవాస కమిటీ, మీడియా కమిటీ, సోషల్ మీడియా కమిటీ, లాభార్థీ సంపర్క్ కమిటీ, కార్యాలయ కమిటీ, మేధావుల కమిటీ, ప్రచార సామాగ్రి పంపిణీ కమిటీ, నా కుటుంబం-బీజేపీ కుటుంబం కమిటీ, ఎన్నికల కమిషన్ కమిటీ, కమల్‌జ్యోతి కమిటీ, మనసులోని మాట కమిటీ, సైకిల్ ర్యాలీ కమిటీలను ఏర్పాటు చేశారు. హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మ్యానిఫెస్టో కమిటీలో మంత్రులు అరుణ్ జైట్లీ, నిర్మలా సీతారామన్, తావర్‌చంద్ గెహ్లోట్, రవిశంకర్ ప్రసాద్, పియూష్ గోయల్, ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, కేజే ఆల్ఫోన్స్, మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, ప్రధాన కార్యదర్శి రాంమాధవ్, లోక్‌సభ సభ్యుడు హరిబాబుతోపాటు మొత్తం ఇరవై మంది సభ్యులను నియమించారు. అరుణ్ జైట్లీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార కమిటీలో మంత్రులు పీయూష్ గోయల్, రాజవర్ధన్ రాథోడ్, మహేష్ శర్మ, మరో నలుగురితో ఎనిమిది మందిని సభ్యులుగా నియమించారు. సంపర్క కమిటీకి మంత్రి నితిన్ గడ్కరీని అధ్యక్షుడిగా నియమించారు. ఈ కమిటీలో లోక్‌సభ సభ్యుడు బండారు దత్తాత్రేయతోపాటు మరో పదిమంది సభ్యులను నియమించారు. ప్రచార సామాగ్రి తయారీ కమిటీకి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ నాయకత్వం వహిస్తారు. ఇందులో పదకొండు మందిని సభ్యులుగా నియమించారు. ప్రవాస కమిటీకి అవినాశ్‌రాయ్ ఖన్నా అధ్యక్షుడుగా వ్యవహరిస్తే సోషల్ మీడియా కమిటీకి శ్యాం జాజు అధ్యక్షత వహిస్తారు. న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మీడియా కమిటీకి నాయకత్వం వహిస్తారు. ఈ కమిటీలో 13 మందికి స్థానం కల్పించారు. లాభార్థీ సంపర్క్ కమిటీకి సరోజ్ పాండేని అధ్యక్షుడిగా నియమించి ఆయనకు సహాయం చేసేందుకు పన్నెండు మందిని సభ్యులుగా నియమించారు. కార్యాలయ కమిటీకి అరుణ్‌సింహ్ నాయకత్వం సహిస్తే ప్రయాణ కమిటీకి కూడా ఆయనే అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. ఎన్నికల కమిషన్ కమిటీకి రాజ్యసభ సభ్యుడు భుపేంద్ర యాదవ్ నాయకత్వం వహిస్తారు. ఈ కమిటీలు వెంటనే తమ పని ప్రారంభిస్తాయని బీజేపీ వర్గాలు చెప్పాయి.

చంద్రబాబుపై పోలీసులకు ఫిర్యాదు

• 4న నన్ను బెదిరించారు

• కాకినాడ నగరపాలక సంస్థ కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న

కాకినాడ రూరల్, జనవరి 6: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై తూర్పు గోదావరి జిల్లా కాకినాడ నగరపాలక సంస్థ 36వ డివిజన్ కార్పొరేటర్, బీజేపీ ఫ్లోర్ లీడర్ సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి పార్టీ నాయకులతో కలిసి పోలీసు స్టేషనుకు వచ్చిన ఆమె పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. చంద్రబాబునాయుడు ద్వారా కాకినాడలో టీడీపీ నాయకులతో తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 4న జిల్లా పర్యటనలో భాగంగా కాకినాడ వచ్చిన ముఖ్యమంత్రి తనను ఫినిష్ అయిపోతావు అని బెదిరించారని, దీంతో భయపడిన ఈ ఫిర్యాదు చేసినట్టు లక్ష్మీప్రసన్న తెలిపారు. ఆమె వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాలకొండయ్య, కాకినాడడ రూరల్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాసు, వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు అప్పాజీ, శ్రీపతి సుబ్బారావు నాయకులున్నారు.

నగరాలకు దీటుగా గ్రామసీమలు

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

• జన్మభూమి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



కృష్ణా జిల్లా పునాదిపాడులో జన్మభూమి గ్రామసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 6: రాష్ట్రంలో గ్రామసీమలను నగరాలకు దీటుగా అభివృద్ధి చేయనున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. గ్రామీణ వాసులకు అన్ని మౌలిక వసతులు కల్పించటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఘన చరిత్ర కలిగిన గ్రామం పునాదిపాడు అని, కేఎల్ రావు వంటి ఇంజనీర్లు, మరెందరో ప్రముఖులకు ఇది జన్మభూమి అని గుర్తు చేశారు. ఈతరం నాయకులు కూడా ఆ గ్రామ ప్రతిష్ట పెరిగేలా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. కృష్ణా జిల్లా పునాదిపాడు గ్రామంలో ఆదివారం జరిగిన 6వ విడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. సంక్రాంతి పండుగ రావడానికి ఇంకా సమయం ఉన్నా పునాదిపాడు గ్రామానికి జన్మభూమి కార్యక్రమంతో ముందుగానే సంక్రాంతి వచ్చినట్లు ఉందన్నారు. ఐదు రోజులు జన్మభూమి కార్యక్రమాల్లో ఐదు జిల్లాల్లో తిరిగానని, ఈరోజు జన్మభూమికి వచ్చిన స్పందన చాలా బాగుందన్నారు. గతంలో ఈ గ్రామంలో జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనప్పుడు రూ. 28 లక్షలతో జన్మభూమి భవనం నిర్మించామని గుర్తుచేశారు. ఈ భవనం నిర్మించడానికి కృష్ణమూర్తి, రామకోటేశ్వరరావు, భద్రాచలం, శకుంతల, సుబ్బారావు లాంటివారు ముందుకొచ్చి రూ. 14 లక్షలు ఇవ్వగా మిగతా రూ. 14 లక్షలు ప్రభుత్వం సమకూర్చి భవనం నిర్మించామన్నారు. పునాదిపాడు గ్రామానికి ఒక వైపు గోదావరి, మరోవైపు కృష్ణానది ప్రవహిస్తున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఒకవైపు పంటలను ప్రోత్సహిస్తూ గొర్రెలు, మేకల పెంపకాన్ని, ఆక్వారంగం అభివృద్ధి ప్రభుత్వం దన్నుగా నిలుస్తోందని చెప్పారు. దీనివల్ల రైతులు నష్టాలపాలు కాకుండా నిలదొక్కుకునే అవకాశం ఉందని చెప్పారు. సోమవారం పోలవరం ప్రాజెక్టులో గిన్నిస్ రికార్డు స్థాయిలో కాంక్రీట్ వేస్తున్నామని ఈసందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తీరును గుర్తించి కేంద్ర ప్రభుత్వం అవార్డు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో 63 ప్రాజెక్టుల పనులు చేపట్టామని, ఇందులో 17 ప్రాజెక్టులు పూర్తికాగా, ఆరు ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. 23 ప్రాజెక్టుల పనులు చేయాల్సి ఉందని, మిగిలిన ప్రాజెక్టుల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. జన్మభూమి కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన సందర్శించారు. సంక్రాంతి సంబరాల కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొన్నారు. గర్భిణులకు సీమంతం చేసి ఆశీర్వదించారు. పునాదిపాడు గ్రామ అభివృద్ధిపై ప్రదర్శించిన వీడియోను ముఖ్యమంత్రి తిలకించి అధికారులను ప్రశంసించారు. కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, పార్లమెంట్ సభ్యులు కొనకళ్ల నారాయణ, శాసనమండలి సభ్యులు బచ్చుల అర్జునుడు, బాబూ రాజేంద్రప్రసాద్, ఆప్కాబ్ చైర్మన్ పిన్నమనేని వెంకటేశ్వరరావు, కలెక్టర్ బీ లక్ష్మీకాంతం, ముడా చైర్మన్ బూరగడ్డ వేదవ్యాస్, రాష్ట్ర ఎసెక్స్ కమిటీ సభ్యులు ఆళ్ల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




సీమంతం కార్యక్రమంలో గర్భిణులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

హాస్య నటుడు అలీ దారెటు?

• తొలుత వైసీపీ వైపు • తాజాగా పవన్, బాబుతో మంతనాలు

• రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం

ఆంధ్రభూమి బ్యూరో



అమరావతి, జనవరి 6: సినీ హాస్య నటుడు అలీ రాజకీయ ఆరంగేట్రం సర్వత్రా చర్చనీయాంశమైంది. కొద్దిరోజుల క్రితం ప్రతిపక్ష వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డితో భేటీ కావటంతో ఈ నెల 9న ఆయన వైసీపీలో చేరుతున్నారనే ప్రచారం జరిగింది. ఈనేపథ్యంలో హఠాత్తుగా ఆదివారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌తో అలీ భేటీ కావటం కలకలం రేపుతోంది. తొలుత టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఉండవల్లి నివాసంలో అలీ భేటీ అయి సంచలనం రేకెత్తించారు. సుమారు అర గంట సేపు ఇద్దరు చర్చించారు. టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం సీటును అలీకి ఆఫర్ చేసిందనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం టీడీపీ ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న మోదుగుల వేణుగోపాలరెడ్డికి ప్రత్యామ్నాయంగా నరసరావుపేట పార్లమెంట్ స్థానాన్ని అప్పగించి ఆ సీటు అలీతో భర్తీ చేస్తారనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఈ వాదనను టీడీపీ వర్గాలు కొట్టిపారేస్తున్నాయి. ఇక మరోవైపు జిల్లాలవారీ సమీక్షలో నిమగ్నమైన పవన్‌కల్యాణ్‌తో విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో అలీ రెండు గంటల సేపు ఏకాంతంగా చర్చలు జరిపారు. జనసేనలో చేరాల్సిందిగా పవన్ ఆయనను ఆహ్వానించినట్లు తెలిసింది. దీంతో వైసీపీలో చేరికకు బ్రేక్ పడిందనే ప్రచారం జరుగుతోంది. ఈ నెల 9న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో వైసీపీ తీర్థం పుచ్చుకుంటున్నట్లు ప్రకటించిన ఆయన పవన్‌తో ఏకాంత చర్చలు జరపటం హాట్‌టాపిక్‌గా మారింది. జనసేనలో చేరితే రాజకీయంగా అండగా ఉంటానని పవన్ అలీకి హామీ ఇచ్చినట్లు తెలిసింది. కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న మార్పులు, మారుతున్న రాజకీయ సమీకరణలు వీరిద్దరి మధ్య ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. పవన్, అలీకి ఫిల్మ్ ఇండస్ట్రీలో మూడు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉంది. పవన్‌ను ఆయన కలుసుకున్న సందర్భాలనేకం ఉన్నాయి. ఇదికూడా అలాంటి కలయికే అని పైకి చెప్తున్నా, జనసేనలో చేరే అంశంపై కూడా ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. ఒకేరోజు కొద్ది గంటల వ్యవధిలో రెండు పార్టీల అధినేతలతో చర్చలు జరిపిన అలీ దారెటనేది సస్పెన్స్‌గా మారింది. వరుస భేటీలపై మీడియా ప్రశ్నించగా.. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకే తాను ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌ను కలిసినట్లు అలీ ముక్తసరిగా సమాధానమిచ్చారు.

మహిళలు నిబద్ధతతో సాహిత్యం సృష్టించాలి

• కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఓల్గా

విజయవాడ (ఎడ్యుకేషన్), జనవరి 6: మహిళలు నిబద్ధతతో సాహిత్య రచన చేయాలని స్త్రీవాద రచయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఓల్గా అన్నారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల మహాసభలను సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఓల్గా మాట్లాడుతూ గత దశాబ్దకాలంగా సాహిత్యంలో విప్లవాత్మకమైన మార్పులు సంభవిస్తున్నాయన్నారు. స్త్రీలు పురుషాధిక్యతను ఎదుర్కొంటూ తమ వాదనను బలంగా వినిపిస్తున్నారని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ ప్రారంభమైన నాటి నుండి అకాడమీకి అధ్యక్షులుగా పురుషులే ఉంటున్నారని, ఎన్నిక లేకుండా స్త్రీలను కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షులుగా నియమించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా రచయిత్రుల మహాసభలను నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆమె అభినందించారు. కేంద్రీయ హిందీ సమితి అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ మహిళలు ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలని, పరిశోధనాత్మక సాహిత్యం రావాలన్నారు. తెలుగు సాహిత్యంలో మరుగున పడిన స్త్రీలపై రచనలు రావాలన్నారు. ప్రభుత్వం మాతృభాష వినియోగంలో వివక్ష చూపుతోందని విమర్శించారు. ఏపీ సృజనాత్మక సమితి సీఈఓ డా. దీర్ఘాసి విజయభాస్కర్ మాట్లాడుతూ మహిళలు రచించిన పుస్తకాలను భాషా సాంస్కృతిక శాఖ ద్వారా ప్రచురిస్తామన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సాహితీవేత్తలు 'తెలుగు సాహిత్యంలో మహిళలు' అంశంపై జరిగిన సదస్సులో ప్రసంగించారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డా. జీవీ పూర్ణచంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి ప్రసంగించారు. సుమారు 500 మంది ఈ మహాసభల్లో పాల్గొన్నారు. అనంతరం మహిళలకు సాహిత్య పురస్కారాలు అందజేశారు.



ఓల్గాను సత్కరిస్తున్న యార్లగడ్డ

1వ పేజీ తరువాయి

11మంది అయ్యప్పలు దుర్మరణం

చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

శోకసంద్రమైన నర్సాపూర్

నర్సాపూర్: తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రాంతానికి చెందిన 11మంది అయ్యప్ప భక్తులు దుర్మరణం చెందడంతో విషాదఛాయలు నెలకొన్నాయి. నర్సాపూర్ మండలంలోని ఖాజీపేట గ్రామానికి చెందిన నాగరాజుగౌడ్ (35) గురుస్వామి ఆధ్వర్యంలో శబరిమలైకి 14మంది భక్తులు బయల్దేరారు. కాగా అయ్యప్ప దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో వస్తున్న భక్తులకు చెందిన వ్యాన్ (ట్రావెలర్) ఒక కంటైనర్‌ను ఢీ కొట్టింది. దాంతో అందులో ప్రయాణిస్తున్న ఖాజీపేట గ్రామానికి చెందిన బోయిని కుమార్ (22), జుర్రు మహేశ్ (24) నాగరాజుగౌడ్ (35) భూమాగౌడ్ (32), చిన్నచింతకుంట గ్రామానికి చెందిన ప్రవీణ్‌గౌడ్ (21), సురేష్ (22), రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నక్క ఆంజనేయులు(40), క్రిష్ణాగౌడ్ (33), మంతూర్ గ్రామానికి చెందిన శీరాల శివప్రసాద్ (23), శ్రీశైలం (25), అయ్యన్నగారి శ్యాంగౌడ్ (22)లు మృతి చెందగా, ఖాజీపేటకు చెందిన రాజు, వెంకటేశ్, రమేశ్‌లు తీవ్రంగా గాయమడి చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

గ్రామాల్లో విషాదఛాయలు

నర్సాపూర్ మండలంలోని ఖాజీపేట, మంతూర్, రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు దుర్మరణం వార్త తెలిసిన వెంటనే మృతుల కుటుంబాలకు చెందిన వారితో పాటు ప్రజలు నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి సమాచారం తెలుసుకున్నారు. అక్కడే మృతుల కుటుంబాలకు చెందిన వారు బోరున విలపిస్తుండటం పలువురిని కంటతడి పెట్టించింది. అనేక గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలతో నర్సాపూర్ పట్టణం మార్కెట్ రోడ్డు రద్దీగా తయారైంది.

నర్సాపూర్ ప్రాంతానికి చెందిన అయ్యప్ప భక్తులు దుర్మరణం చెందిన వార్త వినగానే వెంటనే ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాలను త్వరితగతిన స్వస్థలాలకు తరలించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంఘటన కలచివేసిందని ఆవేదన చెందారు. వెనువెంటనే సీఐ, తహశీల్దార్‌లను తమిళనాడుకు పంపి మృతదేహాలను తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్ తరలివచ్చి సమాచారం సేకరించారు.

కేసీఆర్, కేటీఆర్, హరీష్ సంతాపం

హైదరాబాద్: తమిళనాడులోని పుదుకొట్టై వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లాకు చెందిన 10 మంది అయ్యప్ప భక్తులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదం బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి వెంటనే చర్యలు చేపట్టాల్సిందిగా ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు, మాజీ మంత్రి టీ. హరీష్‌రావు మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పంచాయతీ ఎన్నికలకు నేడు 'నోటీసు'

అధికారులు వెల్లడిస్తారు. తొలిదశ ఎన్నికలకు సంబంధించి జనవరి 7 న నోటీస్ జారీ అయిన వెంటనే నామినేషన్ల పర్వం మొదలవుతుంది. ఏడో తేదీననే అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితాలను ప్రకటిస్తారు. ఏడో తేదీ నుండి తొమ్మిదో తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సర్పంచ్ స్థానాలకు, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లను స్వీకరిస్తారు. తొమ్మిదో తేదీ నామినేషన్ల స్వీకరణకు చివరిరోజు. జనవరి 10 న సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్క్రూటినీ చేస్తారు. ఆ వెంటనే అర్హులైన అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తారు. నామినేషన్లపై ఎవరికైనా, ఏవైనా అభ్యంతరాలు ఉంటే 11 న సాయంత్రం 5 గంటల వరకు అప్పీల్ చేయవచ్చు. సంబంధిత అధికారులు ఈ అప్పీళ్లను పరిశీలించి, 12న సాయంత్రం 5 వరకు తమ నిర్ణయాన్ని ప్రకటిస్తారు. 13 వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహారణకు గడువుగా ఇచ్చారు. ఆ వెంటనే పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లను రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తారు. జనవరి 21 న ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం రెండుగంటల తర్వాత ఓట్ల లెక్కింపు చేస్తారు. ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే సర్పంచ్‌గా, వార్డు సభ్యులుగా విజయం సాధించిన వారి పేర్లను ప్రకటిస్తారు. సర్పంచ్, వార్డు సభ్యుల పేర్లను ప్రకటించిన వెంటనే ఉపసర్పంచ్ కోసం ఎన్నిక నిర్వహిస్తారు. వార్డు సభ్యులంతా సమావేశమై చేతులెత్తడం విధానంలో ఉపసర్పంచ్‌ను ఎన్నుకుంటారు. ఒక వేళ ఏదైనా కారణం చేత జనవరి 21 న ఉపసర్పంచ్‌కు ఎన్నిక నిర్వహించకపోతే 22 న నిర్వహిస్తారు.

సర్వేపై సస్పెన్షన్ వేటు

విసిరేసి సమావేశం నుంచి వాకౌట్ చేశారు. తమ సమక్షంలోనే సర్వే సత్యనారాయణ మరో నాయకుడిపై దాడికి యత్నించడంతో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కంగుతిన్నారు. జరిగిన సంఘటనపై అప్పటికప్పుడు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి ఏఐసీసీ నేతలకు ఫోన్ చేసి వివరించారు. సమావేశం నుంచి బయటికి వచ్చిన సర్వే గాంధీభవన్‌లోనే మీడియాతో మాట్లాడుతూ, పార్టీ బాధ్యులు కొందరు రౌడీ మూకలను ప్రోత్సహిస్తూ తనపై దాడికి ఉసిగొల్పారని ఆరోపించారు. పార్టీ ఓటమికి కారణమైన వారే సమీక్షలు నిర్వహించడం వల్ల ఫలితమేమిటని ప్రశ్నించారు. ఓటమికిగల కారణాలను తెలుసుకోవడానికి మరో కమిటీకి అప్పగించాలని సర్వే డిమాండ్ చేశారు. అసలు సమీక్షా సమావేశాలు నిర్వహించమని అధిష్టానం వీరికి అప్పగించలేదన్నారు. పార్టీ ఓటమికిగల కారణాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పార్టీ ముఖ్య నేతలు కొందరు టీఆర్‌ఎస్‌తో కుమ్మక్కయ్యారని సర్వే ఆరోపించారు. వీరి భాగోతాలను త్వరలోనే బయటపెడుతానని హెచ్చరించారు. పార్టీ బాధ్యుల నిర్వాకానికి నిరసనగా సోమవారం గాంధీభవన్‌లో గాంధీ విగ్రహం ఎదుట దీక్ష చేపట్టనున్నట్టు సర్వే ప్రకటించారు. గాంధీభవన్ నుంచి సర్వే సత్యనారాయణ వెళ్లిపోయిన కొద్దిసేపటికే అధిష్టానం ఆదేశాల మేరకు సర్వేపై సస్పెన్షన్ వేటు వేసినట్టు క్రమశిక్షణా కమిటీ ప్రకటించింది.

సస్పెండ్ చేసే అధికారం పీసీసీకి లేదు: సర్వే

తనను సస్పెండ్ చేసే అధికారం పీసీసీకి లేదని సర్వే సత్యనారాయణ ఘాటుగా స్పందించారు. తనపై సస్పెన్షన్ వేటు వేసారన్న సమాచారంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కేంద్ర మంత్రిగా పని చేశానని, ఏఐసీసీ సభ్యుడినని, సోనియాగాంధీకి విధేయుడినని అన్నారు. అలాంటి తనపై చర్య తీసుకునే అధికారం పీసీసీకి ఎక్కడిదని ప్రశ్నించారు. కుంతియా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వల్లనే ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిందని ఆరోపించారు. సమీక్షా సమావేశాలు నిర్వహించే బాధ్యతను అధిష్టానం వీరికి అప్పగించలేదన్నారు. ఎన్నికల్లో పోటీ చెయ్యని వాళ్లను సమావేశంలోకి ఎలా అనుమతించారని సర్వే ఆగ్రహం వ్యక్తం చేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తుపై సందిగ్ధం

రోజులుగా గాంధీభవన్‌లో పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ కుంతియా, ఏఐసీసీ పరిశీలకులు బోసురాజు, శ్రీనివాసన్, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షా సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశానికి శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. టీడీపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల పోరాడి సాధించుకున్న తెలంగాణపై పొరుగు రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు పెత్తనం చేస్తారన్న తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి వెళ్లడం వల్లనే కాంగ్రెస్ ఓడిపోయిందని సీనియర్ నేత, నల్లగొండ నుంచి ఓటమిపాలైన మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్షా సమావేశంలో విశ్లేషించారు. టీడీపీతో పొత్తు వద్దని తాను ఎన్నికలకు ముందు చెప్పినా పార్టీ పట్టించుకోలేదని కూడా ఆయన వాపోయారు. అలాగే మరో మాజీ మంత్రి, గద్వాల నుంచి ఓటమిపాలైన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు డికె అరుణ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే పొత్తుల వల్ల లాభ,నష్టాలు అన్ని జిల్లాల్లో ఒకే విధంగా లేవన్నారు. కొన్ని జిల్లాల్లో పొత్తుల వల్ల లాభం జరిగితే, కొన్ని జిల్లాల్లో నష్టం జరిగిందని ఆమె విశ్లేషించారు. అయితే వీరి వాదనతో పార్టీ సీనియర్ నేతలు దామోదర రాజనరసింహ, భట్టి విక్రమార్క, జగ్గారెడ్డి విభేదించారు. పొత్తుల వల్లనే కాంగ్రెస్ ఓడిపోలేదని, ఓటమికి అనేక కారణాలు ఉంటే అందులో ఇదికూడా ఒకటి కావచ్చని దామోదర రాజనరసింహ అభిప్రాయపడ్డారు. టీఆర్‌ఎస్ అధికార దుర్వినియోగం, అధికార పార్టీకి ఎన్నికల కమిషన్ అనుకూలంగా వ్యవహరించడం, డబ్బు, మద్యం ప్రభావం తదితర కారణాలు ఉన్నాయని రాజనర్సింహ విశ్లేషించారు. టీడీపీతో పొత్తు వల్ల నష్టం జరగలేదని సంగారెడ్డి నుంచి గెలుపొందిన జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. టీడీపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల వైసీపీకి అనుకూల వర్గాలు టీఆర్‌ఎస్‌కు ఓటు వేసారన్నారు. టీడీపీతో పొత్తు వల్ల హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు నష్టం జరిగినా, ఇతర ప్రాంతాల్లో లాభమే జరిగిందని ఆయన విశ్లేషించారు. మూడు రోజుల పాటు జరిగిన సమీక్షా సమావేశాల్లో కూడా పార్టీ అభ్యర్థుల నుంచి భిన్నాభిప్రాయాలే వ్యక్తం కావడంతో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసేదీ, లేనిదీ టీపీసీసీ అధిష్టానం నిర్ణయానికి వదిలేస్తూ సమీక్షలను ముగించింది. ఇలా ఉండగా అభ్యర్థుల ప్రకటనలో జరిగిన జాప్యం వల్ల శాసనసభ ఎన్నికల్లో పార్టీకి నష్టం జరగడంతో పార్లమెంట్ ఎన్నికలకు అభ్యర్థులను రెండు నెలల ముందే ప్రకటించాలన్న అభిప్రాయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని టీపీసీసీ నిర్ణయించింది.

రాయలసీమపై ఏమిటీ నిర్లక్ష్యం?!

గతంలో పాదయాత్ర చేపట్టిన సమయంలో తనకు సహకరించిన ముఖ్య నేతల్ని కలుసుకోవడానికి శ్రీకారం చుడుతున్నారు. కొత్త సంవత్సరం పలకరింపులతో పాటు ప్రస్తుతం రాయలసీమ ఉద్యమం ఎందుకు చేపట్టాల్సి వచ్చిందో అనుచరులకు వివరిస్తున్నారు. ముందస్తుగా పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల్లో తటస్థంగా ఉన్న నేతలతో చర్చలు జరుపుతున్నారు. సాగునీటి ప్రాజెక్టులపై విశ్రాంత ఇంజనీర్లతో కమిటీని ఏర్పాటు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలు విభజన తర్వాత సాగునీటిపై అధికార, ప్రతిపక్ష పార్టీలు వ్యవహరించిన తీరుపట్ల ప్రజల్లో అవగాహన పెంచాలన్న యోచనలో ఆయన ఉన్నారు.

వద్దే వద్దు

వ్యక్తం చేశారు. శాసనసభ ఎన్నికల్లో పార్టీ ఓటమిపై పార్టీ ముఖ్య నేతలు, గెలిచిన ఎమ్మెల్యేలు, ఓడిపోయిన అభ్యర్థులతో ఆదివారం హైదరాబాద్ నగర పొలిమేరలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు డికె అరుణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఓడిపోయిన నేతలు పొన్నాల లక్ష్మయ్య, కె జానారెడ్డి, దామోదర రాజనరసింహ, రేవంత్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి భార్య పద్మావతి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, అద్దంకి దయాకర్‌తో పాటు ఏఐసీసీ కార్యదర్శి మధుయాష్కీ, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, హరిప్రియా నాయక్, భీరం హర్షవర్ధన్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి తదితరులు హాజరయ్యారు.

అమెరికాలో తెలంగాణ యువకుడిపై కాల్పులు

చేస్తున్నాడు. 3వ తేదీ రాత్రి 11.40గంటల సమయంలో ఫుడ్‌కోర్టుకు వెళ్తున్న సమయంలో సాయికృష్ణపై గుర్తుతెలియని దుండగులు దాడిచేశారు. బంగారం, సెల్‌ఫోన్, ఐడికార్డు, క్రెడిట్, డేబిట్‌కార్డులు లాక్కొని తుపాకితో రెండు రౌండ్‌లు కాల్పులు జరిపి పరారయ్యారు. కుడి చేతిపైన, మెడపైన బుల్లెట్ గాయాలు కావడంతో విషమ పరిస్థితిలో ఉన్న సాయికృష్ణను ప్రవాసాంధ్రులు చికిత్స చేయిస్తున్నారు. 4వ తేదీన సాయికృష్ణకు కారు ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రుల ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో వారికి తెలియకుండా ఉండేందుకు సాయికృష్ణ మిత్రులు కూడా ప్రయత్నించినట్లు తెలుస్తుంది. కాని పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఈరోజు ఉదయం జరిగిన అసలు విషయాన్ని సాయికృష్ణ సమీప బంధువులకు తెలిపారు. ప్రస్తుతానికి ప్రాణాపాయం ఏమి లేదని వైద్యులు చెపుతున్నప్పటికీ మరో రెండు శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉందని తెలుస్తోంది. కాగా, సాయికృష్ణ తల్లిదండ్రులు ఎవరితోనూ మాట్లాడడానికి అంగీకరించడంలేదు.

నిలకడగానే సాయికృష్ణ ఆరోగ్యం..

ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న వైద్యులతో ఫోన్ ద్వారా మాట్లాడినట్లు సాయికృష్ణ బంధువులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వారు చెప్పారని అయినప్పటికీ తాము వెళ్లి చూస్తే తప్ప పూర్తి వివరాలు తెలియవని అంటున్నారు.

క్రీడాభూమి

30 ఏళ్ల తర్వాత ఆసీస్ తొలి 'సారి'!

• 1988లో సిడ్నీ మైదానంలో ఇంగ్లాండ్‌తో ఫాలో ఆన్ ఆడిన ఆస్ట్రేలియా • మళ్లీ కోహ్లీ సేనతోనే..

సిడ్నీ, జనవరి 6: ఒకప్పుడు వరుస టెస్టు విజయాలతో ప్రపంచ క్రికెట్‌ను శాసించిన ఆస్ట్రేలియా ఇటీవలి కాలంలో ఓటముల నుంచి బయటపడేందుకు నానాతంటాలు పడుతోంది! ప్రస్తుతం టీమిండియాతో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో రెండో టెస్టును అతి కష్టంగానే గెలిచింది! నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే రెండు టెస్టులు ఓడి, మరో టెస్టు పరాజయం ముంగిట నిలిచింది! సిడ్నీ వేదికగా జరుగుతున్న చివరి టెస్టులో సొంత గడ్డపై 30 ఏళ్ల తర్వాత ఫాలో ఆన్ ఆడింది! 1988లో ఇదే మైదానంలో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఫాలో ఆన్ ఆడిన ఆస్ట్రేలియా డ్రాతో గట్టెక్కింది! ప్రస్తుతం ఈ మ్యాచ్‌కు వరుణుడు అడ్డుపడడంతో నాలుగో రోజు ఆట కేవలం 25.2 ఓవర్లే సాగింది! ఫలితానికి మరో రోజు మిగిలి ఉండడం, బ్యాటింగ్‌లో టాప్ ఆర్డర్ విఫలమవడం ఆసీస్‌ను కంగారెత్తిస్తోంది! ఇదిలా ఉంటే కోహ్లీ సేన చివరి టెస్టు గెలిచి, ఆస్ట్రేలియాను సొంత గడ్డపై ఓడించిన మొదటి భారత జట్టుగా చరిత్ర సృష్టించేందుకు ఉవ్విళ్లూరుతోంది! వరుణుడు అడ్డుపడకపోతే తమ విజయాన్ని ఎవరూ ఆపలేరనే ధీమాగా ఉంది! మరోవైపు ఆతిథ్య జట్టు పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంది! గెలుపు సంగతి పక్కనబెడితే, మ్యాచ్‌ను డ్రా చేసుకునే పరిస్థితి కనిపించలేదు! ఇటీవల దక్షిణాఫ్రికా, పాకిస్థాన్‌లతో జరిగిన టెస్టు సిరీస్‌లను చూస్తే ఆస్ట్రేలియా టెస్టు క్రికెట్ పరిస్థితి చెప్పకనే అర్థమవుతోంది! జట్టులో సీనియర్ ఆటగాళ్లంతా ఒకరి తర్వాత ఒకరు రిటైర్మెంట్ ప్రకటించడం, తాత్కాలిక సారథిగా బాధ్యతలు చేపట్టిన స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్ బాల్ ట్యాంపరింగ్ వివాదంలో చిక్కుకోవడం జట్టును మానసికంగా దెబ్బతీసిందనే చెప్పుకోవాలి.



ఐదు వికెట్లు తీసిన కుల్దీప్‌యాదవ్‌ను అభినందిస్తున్న టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, సహచరులు


కోహ్లీ సామ్రాజ్యంలో విలువైన సంపద పుజారా

• ఆసీస్ మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ వ్యాఖ్య

సిడ్నీ, జనవరి 6: ఆతిథ్య ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్టుల్లో పరుగుల వరద పారించిన చటేశ్వర పుజారా టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ సామ్రాజ్యంలో అత్యంత విలువైన సంపద వంటివాడని ఆసిస్ మాజీ కెప్టెన్, దిగ్గజ ఆటగాడు ఇయాన్ చాపెల్ వ్యాఖ్యానించాడు. ఆసిస్‌తో జరుగుతున్న టెస్టుల్లో ఆడిన పుజారా ఇప్పటికే మూడు సెంచరీలు నమోదు చేశాడని అన్నాడు. టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులతో ఆధిపత్యం చెలాయించడమే కాకుండా భారత్ విజయపథాన నిలిచేందుకు పుజారా కీలక భూమిక పోషించాడని అభిప్రాయపడ్డాడు. ఒంటి చేత్తో ప్రత్యర్థి బౌలర్ల ధాటిగా ఎదుర్కోవడంతోపాటు తమ జట్టులోని మిగిలిన ఆటగాళ్లలో మరింత స్ఫూర్తిని నింపాడని చాపెల్ ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్‌ఫోకు రాసిన ఒక కాలమ్‌లో పేర్కొన్నాడు. భారత క్రికెట్ ప్రపంచంలో విరాట్ కోహ్లీ కింగ్ అయితే, ఆతని సామ్రాజ్యంలో వచ్చిన అపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలో చటేశ్వర్ పుజారా తానేంటో రుజువుచేసుకున్నాడు అని చాపెల్ ప్రశంసించాడు.

ఆస్ట్రేలియా గడ్డపై మూడు సెంచరీలు సాధించడంతో భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ 1977-78లో ఘనత పుజారా సాధించాడని అన్నాడు. పుజారా ఆడిన ఏడు ఇన్నింగ్స్‌లో 1867 నిమిషాల్లో 1258 బంతులను ఎదుర్కొని అత్యధికంగా 521 పరుగులు సాధించాడని పేర్కొన్నాడు. ఆస్ట్రేలియా మైదానంలో ప్రత్యర్థిగా బరిలోకి దిగిన టీమిండియా తొలిసారిగా టెస్టు సిరీస్‌ను గెలవడం గొప్పవిషయమని అభివర్ణించాడు.

వరుణుడు అడ్డుకున్నా..!



వర్షం రావడంతో పిచ్‌పై కవర్లు కప్పుతున్న మైదాన సిబ్బంది

చివరి రోజు చరిత్ర సృష్టించనున్న కోహ్లీ సేన

- ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్ 300 ఆలౌట్
- టీమిండియాకు భారీ ఆధిక్యం
- ఆసీస్‌కు తప్పని 'ఫాలో ఆన్'
- మళ్లీ అడ్డుపడిన వర్షం
- రెండో ఇన్నింగ్స్ 0/6

సిడ్నీ, జనవరి 6: ఏం జరగొద్దని ఆటగాళ్లు సహా, అభిమానులు కోరుకున్నారో అదే జరిగింది. భారత్ ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న చివరి టెస్టు నాలుగో రోజు ఆదివారం ఉదయం నుంచి వరుణుడు అడ్డుకున్నాడు. కేవలం 25.2 ఓవర్ల పాటు సాగిన ఆటలో ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్‌లో 300 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఫాలో ఆన్‌లో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది. మధ్యలో భారత్ విజయానికి వరుణుడు అడ్డుపడడంతో ఆట మరుసటి రోజుకు వాయిదా పడింది. చివరి రోజు వరుణుడు అడ్డుకున్నా కోహ్లీ సేన చరిత్ర సృష్టించనుంది. నాలుగో రోజు మూడు గంటలు ఆలస్యంగా మ్యాచ్ ప్రారంభమైనా , మొదటి మూడు నిమిషాలకే వికెట్ పడడంతో భారత శిబిరంలో ఆశలు రెకెత్తాయి. ఓవర్ నైట్ స్కోర్ 6/236తో బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌ను మొదటి మూడు నిమిషాలకే షమీ దెబ్బ కొట్టాడు. అప్పటివరకు నిలకడగా ఆడుతున్న పాట్ కమ్మిన్స్ (25)ను షమీ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన మిచెల్ స్టార్క్‌తో కలిసి స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లే క్రమంలో పీటర్ హాండ్స్‌కాబ్ (37) కూడా వెనువెంటనే బూమ్రా బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. నాథన్ లియాన్‌తో జత కట్టిన మిచెల్ స్టార్క్ 29 (నాటౌట్) అచితూచి ఆడాడు. ఈ క్రమంలో మూడో రోజు మూడు వికెట్లు తీసి జోరుమీదున్న కుల్దీప్ యాదవ్ నాథన్ లియాన్ (0) ను ఎల్‌బీగా పెవిలియన్ పంపాడు. కొద్దిసేపటికే క్రీజులోకి వచ్చి నిలకడగా ఆడుతున్న జోష్ హజెల్‌వుడ్‌ను సైతం ఎల్‌బీగా అవుట్ చేయడంతో 300 పరుగులకే ఆసీస్ ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ ఐదు వికెట్లు తీసి రెండోసారి ఈ ఘనత సాధించగా, షమీ, రవీంద్ర జడేజా రెండేసి, బూమ్రా ఒక వికెట్ తీశాడు.



కుల్దీప్ యాదవ్ (5/99)

322 పరుగుల భారీ ఆధిక్యం..

ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్‌లో 300 పరుగులకే కుప్పకూలడంతో భారత్‌కు 322 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. గతంలో విదేశాల్లో వెస్టిండీస్, ఇంగ్లాండ్‌పై (373, 355, 323) మాత్రమే భారత్ మొదటి ఇన్నింగ్స్‌ల్లో భారీ ఆధిక్యం సంపాదించింది.

స్కోర్ బోర్డు..

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్డ్

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: మార్కస్ హారిస్ (బీ) రవీంద్ర జడేజా 79; ఉస్మాన్ ఖాజా (సీ) పుజారా (బీ) కుల్దీప్ యాదవ్ 27; మామస్ లాబుస్చాన్ (సీ) రహానె (బీ) షమీ 38; షాన్ మార్ష్ (సీ) రహానె (బీ) రవీంద్ర జడేజా 8; ట్రావిస్ హెడ్ (సీ), (బీ) కుల్దీప్ యాదవ్ 20; పీటర్ హాండ్స్‌కాబ్ (బీ) బూమ్రా 28; టిమ్ పైన్ (బీ) కుల్దీప్ యాదవ్ 5; పాట్ కమ్మిన్స్ (బీ) షమీ 25; మిచెల్ స్టార్క్ 29 (నాటౌట్); నాథన్ లియాన్ ఎల్‌బీ (బీ) కుల్దీప్ యాదవ్ 0; జోష్ హజెల్‌వుడ్ ఎల్‌బీ (బీ) కుల్దీప్ యాదవ్ 21.

ఎక్‌స్ట్రాలు: 11; **మొత్తం:** 300 (104.5ఓవర్లలో ఆలౌట్)

వికెట్ల పతనం: 1-72, 2-128, 3- 144, 4- 152, 5- 192, 6-198, 7- 236, 8- 257, 9- 258, 10- 300.

బౌలింగ్ : మహమ్మద్ షమీ 19-2-58-2, జస్ప్రీత్ బూమ్రా 21-5-62-1, రవీంద్ర జడేజా 32-11-73-2, కుల్దీప్ యాదవ్ 31.5-6-99-5.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఉస్మాన్ ఖాజా (బ్యాటింగ్) 4; మార్కస్ హారిస్ (బ్యాటింగ్) 2.

బౌలింగ్ : మహమ్మద్ షమీ 2-1-4-0, జస్ప్రీత్ బూమ్రా 2-1-2-0. **ఎక్‌స్ట్రాలు:** 0; **మొత్తం:** 6 (4ఓవర్లలో)

మార్కెట్ పయనం ఎటు?

అనిశ్చితి కొనసాగే అవకాశం!




ముంబయి, జనవరి 6: స్టాక్ మార్కెట్ పయనం ఎటు? ఈ ఏడాది మొదటి వారం అనిశ్చితిలో కొనసాగిన బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) లావాదేవీలు రాబోయే వారంలోనైనా కోలుకుంటాయా? అమెరికా, చైనా దేశాలకు చెందిన ప్రతినిధులు ద్వైపాక్షిక వాణిజ్య అంశాలపై జరపబోయే చర్చలు ఎంత వరకు ఫలిస్తాయి? వాటి ప్రభావం భారత స్టాక్ మార్కెట్‌పై ఏ స్థాయిలో ఉంటుంది? విదేశీ పెట్టుబడిదారులు వెనుకంజ వేస్తే, దేశీయ మదుపరులు ఆదుకునే అవకాశం ఉందా? ఇలాంటి సవాలక్ష ప్రశ్నలతో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సోమవారం నుంచి మొదలుకానుంది. అంతర్జాతీయ సూచీలు సానుకూలంగా వ్యవహరిస్తాయని, ఫలితంగా బీఎస్ఈలోనూ ట్రేడింగ్ లాభసాటిగా మారుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, ఇది ఎంత వరకూ వాస్తవ రూపం దాలుస్తుందనేది అనుమానమే. నిజానికి, అంతర్జాతీయ మార్కెట్ క్రమంగా కోలుకుంటున్నది. అమెరికా, చైనా దేశాల మధ్య చర్చలు సఫలమైతే, ఆ రెండు దేశాల మధ్య వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న ఈ రెండు దేశాల జరిగే చర్చలు, తీసుకునే చర్చలపైనే భారత్‌సహా మిగతా దేశాల వ్యాపార, వాణిజ్యాలు ఆధారపడతాయన్నది వాస్తవం. అయితే, గతంలో విదేవీ సూచీలు ప్రతికూలంగా వ్యవహరించినప్పటికీ, దేశీయంగా మదుపరులు వాటాల కొనుగోళ్ల పట్ల ఆసక్తిని ప్రదర్శించడంతో, సెనెక్స్ భారీ నష్టాల నుంచి బయటపడింది. కొన్ని సందర్భాల్లో స్వల్పంగా నష్టపోతే, మరికొన్ని సమయాల్లో లాభాలను కూడా నమోదు చేసింది. బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారత్‌లో దేశీయ పెట్టుబడిదారుల పాత్ర తక్కువేమీ కాదు. స్టాక్ మార్కెట్ పతనాన్ని అడ్డుకునే బాధ్యతను ఎన్నో సందర్భాల్లో వారు తీసుకున్నారు. వచ్చే వారం స్టాక్స్ లావాదేవీల్లో వీరు ఏ విధంగా స్పందిస్తారన్నది ఆసక్తిని కలిగిస్తున్నది.

నష్టాల నుంచి బయటపడేనా?

గత వారం భారీగా నష్టపోయిన కంపెనీలకు ఊరట లభిస్తుందా? అవి నష్టాల బాటను వీడి మళ్లీ లాభాలను పండిస్తాయా? అనే ప్రశ్నలకు సమాధానాలను వెతుక్కోవాల్సిన అవసరం ఏర్పడింది. గత వారం గణాంకాలను పరిశీలిస్తే, దేశంలోని పది పది ప్రముఖ కంపెనీల్లో ఆరు కంపెనీలు నష్టాలను ఎదుర్కొన్నాయి. ఈ ఆరు కంపెనీల షేర్స్ పతనం 38,152.86 కోట్ల రూపాయలుగా నమోదైంది. స్టాక్స్ భారీగా పతనమైన కంపెనీల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రిల్) మొదటి స్థానంలో ఉండడం గమనార్హం. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హిందుస్థాన్ యూనీ లెవర్ (హెచ్‌యూఎల్), ఇండియన్ టొబాగో కంపెనీ (ఐటీసీ), హెచ్‌డీఎఫ్‌సీ మార్కెట్ క్యాపిటైలేజేషన్ నష్టాలను ఎదుర్కొన్నాయి. కాగా, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, కోటక్ మహీంద్ర, ఐసీఐసీఐ బ్యాంక్ లాభాలను సంపాదించాయి. ఈ కంపెనీల లాభాలను నామమాత్రంగా ఉండగా, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్న కంపెనీల నష్టం మాత్రం భారీగా ఉంది. రిల్ 16,955.65 కోట్ల రూపాయలు నష్టపోవడంతో, దాని మార్కెట్ విలువ 6,96,639.64 కోట్ల రూపాయలకు పడిపోయింది. హెచ్‌యూఎల్ మార్కెట్ విలువ 8,626.12 కోట్ల రూపాయలు తగ్గి, 3,85,361.62 కోట్ల రూపాయలకు చేరింది. టీసీఎస్ నష్టం 8,198.96 కోట్ల రూపాయలుగా నమోదైంది. ఫలితంగా ఈ కంపెనీ మార్కెట్ విలువ 7,03,178.13 కోట్ల రూపాయలకు పతనమైంది. 1,501.96 కోట్ల రూపాయలు నష్టపోయిన హెచ్‌డీఎఫ్‌సీ విలువ గత వారాంతానికి 3,38,933.58 కోట్ల రూపాయలుగా ముగిసింది. ఐటీసీ 1,469.63 కోట్ల రూపాయల నష్టంతో, 5,75,922.87 కోట్ల రూపాయలకు పడిపోయింది. ఈ కంపెనీలు వచ్చే వారం ఎలాంటి ఫలితాలను నమోదు చేస్తాయన్నదే ఇప్పుడు మార్కెట్‌లో అందరినీ వేధిస్తున్న ప్రశ్న. అదే విధంగా గత వారం ఐసీసీఐ బ్యాంక్ 2,906.87 కోట్లు, ఇన్ఫోసిస్ 1,376.12 కోట్లు, కోటక్ మహీంద్ర 391 కోట్ల రూపాయలు చొప్పున లాభాలను సంపాదించాయి. ఈ కంపెనీల షేర్లు వచ్చే వారం కూడా అదే దూకుడును కొనసాగిస్తాయా లేక ప్రతికూల పవనాలను ఎదుర్కొంటాయా అన్నది కూడా చూడాలి. మొత్తం మీద గత వారం నష్టాలు, అనిశ్చితుల మధ్య కొనసాగిన స్టాక్ మార్కెట్ ఈ వారం గాడిలో పడుతుందా అన్నది ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్నే.

రూ.83వేల కోట్ల ఉపసంహరణ

న్యూఢిల్లీ, జనవరి 6: ప్రధాన మార్కెట్ల నుంచి గడచిన యేడాది 83 వేల కోట్ల రూపాయలు మదుపర్లు వెనక్కు తీసుకున్నారు. అదే క్రమంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రెండు లక్షల కోట్ల రూపాయలు మదుపు చేశారు. అమెరికాలో ధరల పెరుగుదలతోబాటు, అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరల పెరుగుదల, రూపాయి విలువలో తగ్గుదల పెట్టుబడులపై ప్రభావం చూపాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. 2019లో సైతం ఈ పెట్టుబడుల పరంపర కొనసాగుతుందని, అయితే ఈ విషయంలో మదుపర్లు జాగరూకతతో వ్యవహరిస్తారని, దేశంలో ఆర్థిక స్థితిగతులు స్థిరంగా బలోపేతం అయ్యే వరకు కొంత వేచిచూసే ధోరణిని అవలంభిస్తారని అంటున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల తర్వాత ఏర్పడే స్థిరమైన ప్రభుత్వంపై సైతం ఈ పడుబడుల రాక ఆధారపడి ఉంటుందని మార్నింగ్ స్టార్ ఇన్వెస్‌మెంట్స్ సలహాదారు, సీనియర్ విశ్లేషకుడు హిమాంన్షు శ్రీవాత్సవ అభిప్రాయపడ్డారు. 2018లో భారత మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు మొత్తం 83,146 కోట్ల రూపాయలు పెట్టుబడులు వెనక్కు తీసుకున్నారు. ఇందులో



రూ.33,553 కోట్లు ఈక్విటీల నుంచి రూ.49,593 కోట్ల రూపాయలు రుణ మార్కెట్ల నుంచి వెనక్క తీసుకున్నారని డిపాజిటర్ల వద్ద ఉన్న గణాంకాలు తెలుపుతున్నాయి. 2002 నుంచి ఇప్పటి వరకు విదేశీ పెట్టుబడుల విషయంలో ఇదే అతి తక్కువ సంవత్సరంగా నిలిచింది. విదేశీ నిధులను చిన్న మార్కెట్లలోగాక, ఇతర మార్కెట్లకు మంజూరు చేయడం సైతం పెట్టుబడులపై ప్రభావం చూపిందన్నారు. గడచిన ఆరేళ్ల కాలంలో విదేశీ మదుపర్లు వరుసగా అధిక మొత్తంలో భారత మార్కెట్ల నుంచి పెట్టుబడులు వెనక్కు తీసుకున్నారు. 2017లో 51 వేల కోట్లు, 2016లో 20.500 కోట్లు, 2015లో 17,800 కోట్లు, 2014లో 97 వేల కోట్లు, 2013లో 1.13 లక్షల కోట్లు 2012లో 1.28 లక్షల కోట్లు వంతున పెట్టుబడులు వెనక్కు తీసుకోవడం జరిగింది. కాగా 2016లో 43,600 కోట్ల రూపాయలు వెనక్కు తీసుకున్న విదేశీ మదుపర్లు 2017లో పెద్దయెత్తున ముందుకు వచ్చి 1.5 లక్షల కోట్ల భారత మార్కెట్లలోకి పెట్టుబడులు పెట్టారు. 2018లో సైతం బాగానే ముందుకు వచ్చినప్పటికీ అంతర్జాతీయ స్థితిగతులు, ధరల ప్రభావతో పెట్టుబడుల్లో తిరోగమనం ఆరంభమైంది. మార్చిలో కొంత తేరుకున్నా వాటాల అమ్మకాలు కొనసాగుతూనే వుందని బజాజ్ కేపిటల్ సీఈవో రాహుల్ పరీక్ తెలిపారు.2008 నుంచి ఇప్పటి వరకు తొలిసారిగా సెంట్రల్ బ్యాంకులు ఒక ట్రిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన ద్రవ్యాన్ని వెనక్కు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అమెరికా చైనా వాణిజ్య యుద్ధం ఇలా మరో ప్రత్యామ్నాయం కోసం వెతుక్కోవాల్సిన అవసరం ఏర్పడిందని నిపుణులు చెబుతున్నారు.

వాణిజ్యభూమి



దేశ ఆర్థిక స్థిరత్వానికి విఘాతంగా ముడిచమురు ధరల పెరుగుదల

• ద్రవ్యోల్బణం, ఆర్థిక లోటు మరింత పెరిగే అవకాశం

• రిజర్వు బ్యాంకు నివేదిక వెల్లడి

ముంబయి, జనవరి 6: గడచిన యేడాది అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు అమాంతం పెరగడం దేశ స్థూల వార్షికావృద్ధి పరుగుకు పగ్గాలు వేసేదిగా మారిందని, ప్రస్తుత వార్షిక నష్టాల పద్దు (సీఎడీ)ని ఇది మరింతగా పెంచుతుందని రిజర్వు బ్యాంకుకు చెందిన ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ద్రవ్యోల్బణం, వార్షిక ఆదాయ పరిస్థితులు పరికిస్తే దేశ ఆర్థికాభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారే అవకాశం ఉందని ఆ నిపుణుల అధ్యయన నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. దేశీయంగా అవసమైన ముడిచమురును 80 శాతం విదేశాల నుంచి కొనుగోలు చేస్తుండటం వల్ల ఈ పరిస్థితులు తలెత్తాయని పేర్కొంది. ప్రత్యేకించి సీఏడీతోబాటు, ముడి చమురు ధరలు పెరగడం ద్రవ్యోల్బణాన్ని, ఆర్థిక లోటును మరింతగా పెంచే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయ మార్కెట్లో గత యేడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మాసాల మధ్య ముడిచమురు ధరలు 12 శాతం పెరిగాయి. అప్పట్లో దేశ అవసరాలు సైతం పెరగడంతోబాటు, అంతర్జాతీయ రాజకీయ విభేదాలు వల్ల మరింత సమస్యాత్మకమైంది. అయితే గత నవంబర్ నెల ద్వితీయార్థం నుంచి ముడి చమురు ధరల్లో తగ్గుదల ప్రారంభమైంది. కానీ తగ్గుదలలో స్థిరత్వం కరవైంది. 'మొత్తానికి ముడి చమురు ధరల పెరుగుదల కరెంట్ అకౌంట్ డెఫిషియన్సీ (సీఏడీ)ని ప్రభావితం చేయడంతోబాటు దేశ సమగ్రాభివృద్ధిని కొనసాగించే అంశాలను బలోపేతం చేయలేకపోయింది. అందువల్ల ప్రస్తుతం ఇటు ద్రవ్యోల్బణంతోబాటు, స్థూల వృద్ధిరేటుపై తీవ్ర ప్రభావం పడుతోందని సెంట్రల్ బ్యాంకుకు చెందిన ఆర్థిక నిపుణులు రూపొందించిన 'సీఏడిపై ముడిచమురు ధరల పెరగుదల ప్రభావం, ద్రవ్యోల్బణం, వార్షిక ఆర్థిక లోటు' అనే అధ్యయన నివేదిక తెలుపుతోంది. చమురు ధరల్లో క్లిష్టతరమైన పరిస్థితుల్లో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 85 అమెరికన్ డాలర్లు పలికినపుడు మనదేశ కొనుగోళ్లపై మొత్తం 106.4 బిలియన్ డాలర్ల వరకు పద్దుల రూపేణా నష్టాలు వచ్చాయని, ఇది దేశ స్థూల వృద్ధిరేటుకు 3.61 శాతం తగ్గుదల అని నివేదిక వివరించింది. అలాగే ప్రతి పది బ్యారళ్ల కొనుగోలుపై అదనంగా పెరిగిన ధరలతో 12.5 బిలియన్ డాలర్ల నష్టం నమోదైందని నివేదిక వెల్లడించింది. ఇది సుమారు 43 బేసిక్ పాయింట్ల (బీపీఎస్) వంతున దేశ స్థూల ఆర్థికాభివృద్ధికి విఘాతం కలిగించిందని వివరించింది. అదే క్రమంలో 10 బ్యారెళ్ల నుంచి 65 బ్యారళ్ల కొనుగోలుకు వచ్చేసరికి నష్టం 49 బేసిస్ పాయింట్ల వరకు ఉంటుందని పేర్కొంది. కాగా పెరిగిన ధరలు వినియోగదారుడిని ప్రభావితం చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే స్థూలాదాయంపై మరింత నష్టానికి దారితీసే అవకాశం ఉందని, అయితే తదుపరి స్థానిక మార్కెట్లలోప్రభుత్వం విధించే చార్జీలు, పన్నులు తదితరాలను అనుసరించి ద్రవ్యోల్బణం, వార్షిక ఆర్థికలోటు ఉంటుందని నివేదిక పేర్కొంది.

5వేల కేజీలతో కిచిడీ

ప్రపంచ రికార్డు దిశగా బీజేపీ ప్రయత్నం



మూడు లక్షల దళిత కుటుంబాల నుంచి సేకరించిన బియ్యం ఇతర పదార్థాలతో ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో గిన్నిస్ రికార్డే లక్ష్యంగా 5 వేల కిలోల కిచిడీ తయారీ దృశ్యం. కేంద్రమంత్రి హర్షవర్ధన్, ఇతర బీజేపీ నేతలు పాల్గొన్నారు

న్యూఢిల్లీ, జనవరి 6: ఢిల్లీలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) విభాగం ఆధ్వర్యంలో 5వేల కేజీలతో భారీ కిచిడీ తయారు చేసేందుకు ఆదివారం శ్రీకారం చుట్టింది. ఇందుకు ఇక్కడి రామ్‌లీలా మైదానం వేదికైంది. భారీ ఎత్తున ఏర్పాటు చేసే కిచిడీ ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించాలని బీజేపీ యోచిస్తోంది. 'భీమ్ మహాసంగమ్' పేరిట తయారు చేస్తున్న ఈ కిచిడీకి 'సమ్రాస్త కిచిడీ'గా నామకరణం చేసింది. వెనుకబడిన తరగతుల ప్రజలకు ఈ కిచిడీని అందజేయాలని నిర్ణయించింది. ఈ భారీ కిచిడీ తయారీకి 400 కేజీల బియ్యం, 100 కేజీల తృణధాన్యాలు, 350 కేజీల కాయగూరలు, 100 కేజీల నెయ్యి, 100 లీటర్ల నూనె, 2500 లీటర్ల నీళ్లు, 250 కేజీల సుగంధ ద్రవ్యాలు వినియోగిస్తున్నట్టు సంబంధిత వంటమనిషి తెలిపారు. ఈ కిచిడీ తయారీ కోసం ఢిల్లీలోని మూడు లక్షల మంది దళితుల ఇళ్ల నుంచి బియ్యం, తృణ ధాన్యాలు సేకరించారు. కాగా, నాగ్‌పూర్ చెఫ్ విష్ణు మనోహర్ ఆధ్వర్యంలో తయారు చేసిన 3వేల కేజీల కిచిడీ ఇంతవరకు ప్రపంచ రికార్డులో నమోదైంది.

నేడు 'పోలవరం'లో అరుదైన ఘట్టం

గిన్నిస్ బుక్‌లో ప్రాజెక్టుకు చోటు ❖ పారంభమైన 'మహా కాంక్రీటు' ఫీటు





స్పిల్ ఛానల్‌లోని బ్లాకులో కాంక్రీటు వేస్తున్న దృశ్యం, నిర్మాణ ప్రాంతంలో గిన్నిస్ బుక్ లండన్ ప్రతినిధి రిషీ

పోలవరం, జనవరి 6: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సోమవారం మరో అరుదైన ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఇప్పటికే పలు అవార్డులను అందుకుంటున్న ప్రాజెక్టు తాజాగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో స్థానం సంపాదించనుంది. ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భాగంగా 'మహా కాంక్రీటు ఫీటు'ను నిర్మాణ సంస్థ 'నవయుగ' చేపట్టింది. ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన మహా కాంక్రీటు ఫీటు సోమవారం ఉదయం 8 గంటలకు ముగియనుంది. 24 గంటల్లో 28వేల నుండి 30 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు వేయడానికి అన్ని ఏర్పాట్లుచేశారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లండన్ ప్రతినిధి రిషీనాథ్‌తోపాటు భారత్‌లోని ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాలల నుండి 24మంది ప్రొఫెసర్లు ఈ ఫీటును పరిశీలించడానికి వచ్చారు.

సైరన్ మోగించి...

ఆదివారం ఉదయం సరిగ్గా 8 గంటలకు స్పిల్ ఛానల్‌లోని బ్లాకు వద్ద సైరన్ మోగించి, కాంక్రీటు పనులను ప్రారంభించారు. ప్రతి బ్లాకులో కాంక్రీడు వేసే సమయంలో తొమ్మిది క్వాలిటీ శాంపిల్స్ తీస్తున్నారు. కాంక్రీటు వేసే ప్రతి 15 నిముషాలకు తీసిన వీడియోను లండన్‌లోని గిన్నిస్ బుక్ కార్యాలయానికి పంపించడానికి కూడా ఏర్పాట్లుచేశారు. స్పిల్ ఛానల్‌లోని 240 నుండి 300కు పైగా బ్లాకుల్లో కాంక్రీటు వేయడానికి అన్నీ సిద్ధంచేశారు. ఒక్కో బ్లాకు 10 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల పొడవు ఉంటుంది.

సామాగ్రి.. నిపుణులు..

28వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు వేయడానికి ఏడు వేల టన్నుల సిమెంటు, 36వేల టన్నుల కంకర, 22వేల టన్నుల ఇసుక ఉపయోగిస్తారు. అలాగే 28వేల క్యూబిక్ మీటర్లు మించితే అదనంగా వేయడానికి సిమెంటు, ఇసుక, కంకర సిద్ధంచేశారు. 24 గంటలు పనిచేయడానికి 3600 మంది కార్మికులు, 720మంది సాంకేతికేతర సిబ్బంది, 500 మంది సాంకేతిక సిబ్బందితోపాటు 21మంది ఇంజినీరింగ్ అధికార్లు ఈ మహా క్రతువులో పాల్గొంటున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు 10,996 క్యూబిక్ మీటర్ల కాంక్రీటును వేశారు. అనుకున్న సమయానికి లక్ష్యాన్ని పూర్తిచేసి, గిన్నిస్ బుక్‌లో నమోదైతే, సంబరాలు చేయడానికి కూడా కాంట్రాక్టు సంస్థ సర్వం సిద్ధంచేసింది. కాంక్రీటు పనుల ప్రారంభ సమయంలో రిషీనాథ్‌తో పాటు నవయుగ సంస్థ ఎండీ సిహెచ్ శ్రీధర్, సీఈ వి శ్రీధర్, ప్రాజెక్టు సలహాదారు విఎస్ రమేష్‌బాబు తదితరులున్నారు. ఈసందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ నవయుగ సంస్థ కాంక్రీటులో ప్రపంచ రికార్డు బ్రేకు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలకు అధికారులు అన్ని విధాలా సహకరిస్తున్నారన్నారు. నవయుగ సంస్థ ఎండీ శ్రీధర్ మాట్లాడుతూ 28వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటును అధిగమించి, 30వేల వరకు వేస్తామన్నారు. అది చేస్తే వచ్చే పదేళ్ల వరకు రికార్డు పోలవరం ప్రాజెక్టుకే ఉంటుందన్నారు.

తాము నిర్దేశించుకున్న లక్ష్యం సాధించగలమనే నమ్మకంతోనే గిన్నీస్ బుక్ వారిని ఆహ్వానించామన్నారు. రికార్డు కాంక్రీటు కాకుండా ఏకకాలంలో 34 గంటలు కాంక్రీటు వేసి, అదికూడా ప్రపంచ రికార్డు స్థాపించడానికి కాంక్రీటు సంస్థ నవయుగ సంసిద్ధమయ్యింది.

కల్వకుర్తి కాల్వలకు జలకళ

❖ శ్రీశైలం బ్యాక్ వాటర్ ఎత్తిపోత
❖ నడుస్తున్న మోటార్లు.. పారుతున్న కృష్ణాజలాలు
❖ నిండుతున్న చెరువులు, పంటల సాగుకు మంచి అదును
❖ ఆయకట్టు రైతుల్లో చిగురిస్తున్న రబీ ఆశలు

ఆంధ్రభూమి బ్యూరో


మహబూబ్‌నగర్, జనవరి 6: పాలమూరు జిల్లాలో నెలకొన్న కరువు చాయల నుండి ఇప్పుడిప్పుడే రైతాంగం భయటపడుతుంది. గత రెండు సంవత్సరాల నుండి కల్వకుర్తి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తూనే కాల్వల ద్వారా నీటిని పారిస్తుండడంతో దాంతో ఒక్కసారిగా చెరువులు, కుంటల్లో కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. కల్వకుర్తి ఆయకట్టు పూర్తిగా వర్షాధారంపైనే ఉండేదీ. కానీ కల్వకుర్తి ప్రాజెక్టు నిర్మాణంతో ప్రస్తుతం జిల్లాలో చరిత్రలో ఈ ఆయకట్టు రైతులు ఎన్నడు లేని విధంగా రబీ పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చెరువుల కింద, బోరు భావుల కింద నారుమళ్లు వేసుకుని నాట్లకు సిద్ధమయ్యారు. అయితే కల్వకుర్తి ఆయకట్టుకు శ్రీశైలం ప్రాజెక్టు నుండి ప్రతి రోజు దాదాపు 700 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించిన ఈ ప్రాజెక్టులోని రెండు మోటార్లు నడుస్తున్నాయి. దాంతో ఎల్లూరు రిజర్వాయర్‌లోకి శ్రీశైలం ప్రాజెక్టు నుండి కృష్ణాజలాలను ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుండి జొన్నలబొగుడ రిజర్వాయన్‌కు, అక్కడి నుండి గుడిపల్లి గట్టు ద్వారా కల్వకుర్తి ప్రాజెక్టు కాల్వలకు కృష్ణాజలాలు కృష్ణాజలాలు పారిస్తున్నారు. దాంతో చెరువులు ఈ కాలంలో జిల్లా చరిత్రలో ఎన్నడూ కూడా నీటితో కలకళలాడిన ధాఖలాలు లేవు. కానీ ఈ ఏడాది ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల కల్వకుర్తి ఆయకట్టు రైతుల్లో రబీ పంటల సాగుపై ఆశలు చిగురించాయని చెప్పవచ్చు.ప్రస్తుతం ఈ సీజన్‌లో దాదాపు చెరువులు, బోరుభావుల కింద కల్వకుర్తి ఆయకట్టులో దాదాపు రెండు లక్షల ఎకరాల పంటలు సాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వేరుశనగ, వరి, పంటలను రైతులు సాగు చేసుకునే అవకాశాలు ఉన్నందునా రైతులకు విత్తనాలు ఇవ్వడానికి సైతం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా ప్రస్తుతం దుంధుభీ వాగు దాటి కృష్ణాజలాలు రావడంతో ఈ ప్రాంత రైతుల్లో వ్యవసాయంపై మరింత ఆశలు చిగురింప జేశాయని రైతులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుండి మరికొన్ని రోజుల పాటు ఒకమోటారు ద్వారా నీటిని ఎత్తిపోసే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో రైతుల ఆశలు మరింత బలపడుతున్నాయని చెప్పవచ్చు. చెరువులు కుంటలు నిండుతుండడంతో కల్వకుర్తి ఆయకట్టు రైతులు తమకు కృష్ణా జలాల పుణ్యమా అంటూ ఇక వ్యవసాయం చేయక భీడుబారిన పొలాలు పచ్చపడుతాయని ఎంతో ఆశతో పంటల సాగుపై దృష్టి పెట్టారు.



మిడ్జిల్ మండల కేంద్రం దగ్గర కల్వకుర్తి ప్రాజెక్టు కాల్వల్లో పారుతున్న కృష్ణాజలాలు









అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ సందర్భంగా ఆదివారం అహ్మదాబాద్‌లో ఔత్సాహికులు ఎగురవేసిన వివిధ రకాల పతంగులు. వింతగొలిపే ఎన్నో గాలిపటాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి.

Printed and Published by **T. Venkateswarlu** on behalf of Deccan Chronicle Holdings Ltd. Printed at Deccan Chronicle Press situated at Plot No. 9, Alwal Village, Vallabh Nagar Taluk, Medchal Malkajgiri Dist., Telangana and Published at 36, S.D. Road, Secunderabad-3, Chief Editor **T.V.Ravi Reddy,**
PBX 27803930 (6Lines), Editorial: 27805056, **Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60**

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

సోమవారం, 7 జనవరి 2019

బరువును తగ్గించే తోటకూర



అవును.. తోటకూరను తింటే బరువు ఇట్టే తగ్గిపోతారని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గాలనుకునేవారు రోజూ ఓ కప్పు తోటకూర వండుకుని తింటే మంచి ఫలితం ఉంటుంది. ఇందులోని పీచుపదార్థం జీర్ణశక్తిని పెంచుతుంది. దీనికి తోడు కొవ్వును తగ్గిస్తుంది. తోటకూర తక్షణశక్తిని ఇస్తుంది. అయితే తోటకూరను వేపుడు కన్నా కూరలా చేసుకుని తింటే బాగుంటుంది. అప్పుడే అధిక ప్రొటీన్లు శరీరానికి అందుతాయి. తోటకూర అధిక రక్తపోటును కూడా నియంత్రిస్తుంది. తోటకూరలోని విటమిన్ సి రోగనిరోధకశక్తిని పెంచుతుంది. కాల్షియం, ఇనుము, మెగ్నీషియం, పాస్ఫరస్, జింక్, కాపర్, మాంగనీస్, సెలీనియం వంటి ఖనిజాలన్నీ తోటకూరలో లభిస్తాయి. తోటకూర రక్తనాళాల్ని చురుగ్గా ఉంచి, గుండెకు మేలుచేసే సోడియం, పొటాషియం వంటివి సమకూరుస్తుంది. కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వులు, పీచు వంటివన్నీ తోటకూర తీసుకోవడం ద్వారా పొందవచ్చునని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.

ఆదర్శ ఉపాధ్యాయిని



తరగతి గది ఒక ప్రసూతి గది, జ్ఞానానికి జన్మనిచ్చేందుకు..
తరగతి గది ఒక స్మశానవాటిక, అజ్ఞానాన్ని ఖననం చేసేందుకు..
తరగతి గది ఒక కర్మాగారం, జాతి భవితను నిర్మించేందుకు..
తరగతి గది ఒక న్యాయ స్థానం, సరైన నిర్ణయాలు తీసుకునేందుకు..

- సర్వేపల్లి రాధాకృష్ణ

నిరంతరం నేర్చుకునే ఉపాధ్యాయుడే..
మంచి విద్యావంతుల్ని తయారు చేయగలడు..

- రవీంద్రనాథ్ ఠాగూర్

నైతిక విలువలను కాపాడే బాధ్యత ఉపాధ్యాయులదే..
ఉపాధ్యాయుడు ఉద్యోగి మాత్రమే కాదు నవ సమాజ నిర్మాత..
మంచి ఉపాధ్యాయుడు ఒక సామాజిక వైద్యుడు..

- ఐఐటీ రామయ్య

"ఆప్యాయతను పంచి ఆడించు అమ్మ.. పాఠాలు నేర్పేటి తొలి పంతులమ్మ.. అటువంటి అమ్మ ఒడిలో ఆడుతూ పాడుతూ పెరిగిన బిడ్డ ఒక్కసారిగా పాఠశాల వాతావరణంలో ఇమడాలంటే అమ్మను మించిన ప్రేమ, ఆప్యాయత ఆ బిడ్డకు ఉపాధ్యాయులు అందించాలి. చిన్న పిల్లలలాగే ఉపాధ్యాయుల ప్రపంచం ఎంతో చిన్నది. వాళ్ళ ఆనందం, ఆసక్తి, ఆకాంక్షలు కూడా చిన్నవే.. ఎంత చిన్నదైతేనేమీ ఆ ప్రపంచం వాళ్ళకి అద్భుతమైనది.. ఆ అనుభూతులు మరువలేనివి.. పెద్దలు తమ పిల్లలను బాగా చదివించాలన్న ఆలోచనతో వాళ్ళను ఆ ప్రపంచం నుంచి దూరం చేస్తుంటారు. ప్రపంచ భవిష్యత్తు ఆ చిన్నారుల మీదనే ఆధారపడి ఉందని మరిచిపోతుంటాం. ఉపాధ్యాయుడు చిన్నారుల ప్రపంచంలోకి అడుగుపెట్టి వారితో కలిసిపోయి సహానుభూతి పొందడంలోనే అసలైన ఆనందం వుంటుంది. అందుకే గురుశిష్యుల సంబంధం గురించి రవీంద్రనాథ్ ఠాగూర్ మాటల్లో..గురుశిష్యుల మధ్య కావలసింది సాన్నిహిత్యమేనా? కాదు.. ఆంతరంగిక అభేదం. అది లేకుండా గురువు ఇచ్చేది లేదు.. శిష్యుడు తీసుకునేదీ లేదు. ఉపాధ్యాయులు అత్యంత సున్నితమైన, సుకుమారమైన పిల్లల మనసుతోటి వ్యవహరిస్తున్నామనే విషయం సర్వదా గుర్తుంచుకోవాలి. పిల్లల మనసు గురించి అనుకునేటప్పుడు మంచు ముత్యాలు తొణికిసలాడే మృదువైన గులాబీ పువ్వును గురించి ఊహించుకోవాలి. మంచు బిందువులు చెదిరిపోకుండా ఆ పువ్వును చేరాలంటే ఎంతో జాగ్రత్త అవసరం. అలాగే విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు కూడానూ.." ఆహా.. ఎంతమంచి మాటలు అనుకుంటున్నారు కదూ..



ఈ మాటలు ఎవరో గొప్ప వ్యక్తులు చెప్పినవి కావు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన అవార్డును పొందిన ఉపాధ్యాయురాలు అరుణకుమారి.

నిజమే...తల్లి ఒడి నుంచి ఒక్కసారిగా బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టి.. పాఠశాలలో అక్షరాలు నేర్చుకునే చంటి పిల్లలకు చదువు చెప్పాల్సిన తీరు అదే.. ప్రాథమిక విద్యా స్థాయి విద్యార్థులు భవిష్యత్తులో రాణించేందుకు ఓ పునాది వంటిది. ప్రభుత్వ విద్యావిధానం అట్టడుగుకు చేరుతోందని ప్రస్తుతం వస్తున్న ఆరోపణలు చాలానే వున్నాయి. ఈ నేపథ్యంలో నైతిక విలువలను కాపాడుకుంటూ, ఉపాధ్యాయుల వ్యవహార శైలిపై ఎందరో మహానుభావులు చెప్పి విధంగా నడుచుకుంటూ, విధి నిర్వహణలో రాజీపడకుండా బాధ్యతగా పాఠాలు బోధించే పంతుళ్ళు, పంతులమ్మలు ఇంకా కొద్దిమందైనా మిగిలి వున్నారని అరుణకుమారి లాంటి ఉపాధ్యాయనిని చూసినప్పుడనిపిస్తుంది. ప్రభుత్వం ప్రతి నెలా జీతమిస్తుంది. నిర్దేశించిన సమయంలో విధులకు హాజరై తిరిగి వెళ్ళిపోవడమే వారి పని.. అని అనుకునే ఉపాధ్యాయులున్న ఈ రోజుల్లో భావిభారత పౌర నిర్మాణం ప్రాథమిక విద్యా దశ నుంచే తయారు చేయాలన్న సంకల్పం వుండాలంటారు అరుణకుమారి. ఆ ఆలోచనతోనే కేవలం పాఠ్యాంశాల బోధన మాత్రమే కాదు.. సామాజిక, ఆర్థిక, రాజకీయ తదితర అంశాలపై కూడా ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో అవగాహన పెంచడంలో ముందుంటున్నారు. విద్యాశాఖలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు కార్యక్రమాలను విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే పద్ధతిలో బోధన చేస్తున్నారు. ఆటలు, పాటలు, చిత్రాలు.. పిల్లల బలహీనతలు. వాటినే బలంగా మార్చుకుని పాఠ్య పుస్తకాల్లోని బొమ్మలు గీయించడం, గేయాలు రాయించడం, చదవడం, రాయడం అనే ప్రక్రియలతో పాటు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసే వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వాటితోపాటు మనిషి జీవన విధానానికి అవసరమయ్యే విషయాలను కథల రూపంలో విద్యార్థులకు చెప్తూ పలు అంశాలపై అవగాహన కల్పించడం కూడా తన పనేనంటూ విధులు నిర్వహిస్తూ ఆదర్శ ఉపాధ్యాయినిగా పేరు తెచ్చుకున్నారు.

'ఉపాధ్యాయుడంటే ఒక ఉద్యోగి మాత్రమే కాదు.. నవ సమాజ నిర్మాత, ఒక సామాజిక వైద్యుడు' అని ఐఐటీటి రామయ్య చెప్పిన మాటలను నిజం చేస్తూ, రచయిత్రిగా రాణిస్తూ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెస్తున్న ఉపాధ్యాయిని అప్పిరెడ్డి అరుణకుమారికి మన తొలి మహిళా ఉపాధ్యాయిని 'సావిత్రీబాయి పూలే' స్మారకంగా అందజేస్తున్న అవార్డు అభించింది.



సావిత్రీబాయిపూలే స్మారక అవార్డు తీసుకుంటున్న ఉపాధ్యాయిని అరుణకుమారి


పిల్లలు గీసిన బొమ్మలు, రాసిన రచనలను తీసుకుని వాటిని సంకలనం చేసి తాను బోధించే విద్యార్థులో దాగివున్న ప్రతిభను పదిమందికీ తెలియజేసి ఇతర పాఠశాలల్లోని విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలన్న సదుద్దేశ్యంతో బాలసాహితి పేరుతో పాఠశాల విద్యావికాస సంచికను తయారుచేసి సుమారు 600ల ప్రతులను ఉచితంగా ఇతర పాఠశాలలకు అందజేశారు. దాంతో చాలా పాఠశాలల్లో విద్యాబోధన విధానంలో అరుణకుమారి అనుసరిస్తున్న విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఇతర కొన్ని పాఠశాలల్లో కూడా అమలుపరచడం గమనార్హం. కేవలం ఒక ఉపాధ్యాయినిగా మాత్రమే కాకుండా ఆమె విధులు నిర్వహించే గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, మహిళల వ్యక్తిగత శుభ్రత, మహిళలు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన పౌష్టికాహారం, చిన్నారులకు వేసే పల్స్‌పోలియో కార్యక్రమాలు, మహిళా విద్య-ఆవశ్యకత, ఇలాంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను బాధ్యతగా నిర్వహిస్తూ ఆమె విధులు నిర్వహించే గ్రామాల్లోని మహిళలకు తలలో నాలుకలా నిలుస్తున్నారు.

'ఉపాధ్యాయుడంటే ఒక ఉద్యోగి మాత్రమే కాదు.. నవ సమాజ నిర్మాత, ఒక సామాజిక వైద్యుడు' అని ఐఐటీటి రామయ్య చెప్పిన మాటలను నిజం చేస్తూ, రచయిత్రిగా రాణిస్తూ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెస్తున్న ఉపాధ్యాయిని అప్పిరెడ్డి అరుణకుమారికి మన తొలి మహిళా ఉపాధ్యాయిని 'సావిత్రీబాయి పూలే' స్మారకంగా అందజేస్తున్న అవార్డు అభించింది. ఎం.ఏ., బి.ఈడీ వరకు చదివిన అరుణకుమారి ప్రస్తుతం అనంతపురం జిల్లా నల్లమాడ మండలంలోని బొగ్గిటివారిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. 16జనవరి 1999లో ఉపాధ్యాయినిగా విధుల్లో చేరిన ఈమె తన 19 సంవత్సరాల సర్వీసులో వృత్తి ధర్మాన్ని బాధ్యతగా కొనసాగిస్తూనే రచయితగా, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆమె వృత్తి పరంగా, సామాజికంగా చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి 2017లో నేషనల్ బిల్డర్ అవార్డు, 2005-06వ సంవత్సరంలో ప్రాథమిక స్థాయి పిల్లల భాషాభివృద్ధికి కృషి చేయడంతో ప్రశంసాపత్రాన్ని కూడా అందుకున్నారు. ఇలాంటి సేవలు అందజేస్తున్న ఉపాధ్యాయిని అప్పిరెడ్డి అరుణకుమారికి ఉత్తమ ఉపాధ్యాయినిగా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం సావిత్రీ బాయి పూలే స్మారక అవార్డు అందజేయడం అభినందనీయం.. ఆనందదాయకం..

- నల్లమాడ బాబ్‌జాన్
85000 83799



సహోపాధ్యాయుల సన్మానంలో అరుణకుమారి



పాఠశాల విద్యావికాస సంచిక
2010-2011
బాలసాహితి
సంకలనం : ఎ. అరుణ కుమారి

అరుణకుమారి సంకలనం చేసి రచించిన బాలసాహితీ పుస్తకం

ఆలివ్ ఆయిల్‌తో అందం





ఆలివ్ ఆయిల్‌తో చాలా ప్రయోజనాలున్నాయి. ఆరోగ్యంతో పాటు అందాన్నిచ్చే ఆలివ్ ఆయిల్‌ని తరచూ ఉపయోగిస్తే చాలా మంచిది. దీనివల్ల చర్మం నిగారింపు మరింత పెరుగుతుంది. అలాగే గుండెకు సంబంధించిన జబ్బులు రావు. ఆలివ్ ఆయిల్‌తో బరువు కూడా అదుపులో ఉంటుంది. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ మొత్తం పోతుంది. అయితే ఆలివ్ ఆయిల్‌ను స్నానం చేసే ముందు శరీరానికి పూసుకుంటే చర్మానికి చాలా మంచిది.

⁙ చలికాలంలో చర్మం పగిలిపోతూ ఉంటుంది. ఇలాంటి సమయంలో ఆలివ్ ఆయిల్ పూసుకుంటే పగుళ్లు ఏర్పడవు. ప్రతిరోజూ స్నానానికి ముందు ఆలివ్ ఆయిల్‌ను శరీరానికి పట్టించి మసాజ్ చేసుకోవాలి. ఓ అరగంట తర్వాత గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలి. ఇలా తరచుగా చేస్తే చర్మం అస్సలు పగలదు.

⁙ కొంతమందికి చర్మం గరుకుగా ఉంటుంది. అలాంటివారు ఆలివ్ ఆయిన్‌ను కాస్త వెచ్చజేయాలి. ఇందులో కొద్దిగా పంచదార వేసి కరిగిపోయిన తరువాత ఈ నూనెతో శరీరాన్ని మసాజ్ చేసుకుంటే చర్మం మృదువుగా మారుతుంది.

⁙ ఆలివ్ ఆయిల్‌ను చాలామంది జుట్టుకు కూడా ఉపయోగిస్తుంటారు. వెంట్రుకలు నిగనిగలాడాలంటే ఆలివ్ ఆయిల్లో కాస్త కోడిగుడ్డు సొన వేసి బాగా కలిపి వెంట్రుకలకు పట్టించాలి. ఇలా తరచూ చేస్తుంటే జుట్టు మెత్తగా, పట్టుకుచ్చులా మారుతుంది.

⁙ చాలామంది తలస్నానానికి షాంపూలను వాడుతుంటారు. అలాంటివారు కాస్త ఆలివ్ ఆయిల్‌ను ఒక పాత్రలో పోసుకుని అందులో షాంపూ కలుపుకుని దాంతో తలస్నానం చేస్తే జుట్టు రాలడం తగ్గిపోతుంది. షాంపూ ప్రభావం కూడా నేరుగా వెంట్రుకలపై పడదు. అలాగే చుండ్రు కూడా తగ్గిపోతుంది.

⁙ నిమ్మరసంలో కాస్త ఆలివ్ ఆయిల్‌ను కలుపుకుని జుట్టుకు పూసుకోవాలి. తరువాత తలస్నానం చేయాలి. ఇలా తరచుగా చేస్తుంటే జుట్టు నిగనిగలాడుతుంది.

⁙ చిన్నపిల్లలకు రోజూ ఆలివ్ ఆయిల్‌తో మసాజ్ చేస్తే చాలామంచిది. ఇలా చేయడం వల్ల వారు ఆరోగ్యంగా, చలాకీగా ఉంటారు.

⁙ ఆలివ్ ఆయిల్లో కాస్త తేనె కలుపుకుని ముఖానికి రాసుకుంటే చాలా మంచిది. ఇలా తరచుగా చేస్తే ముఖం మృదువుగా మారుతుంది.

⁙ ఆలివ్ ఆయిల్‌ను గోళ్లకు పూసుకుంటే వాటి అందం పెరుగుతుంది. గోళ్లు పెలుసుబారకుండా ఉంటాయి. గట్టిగా మారతాయి.

⁙ ఆలివ్ నూనెను పెదవులకు పూసుకుంటే నలుపురంగు పోయి గులాబీ రంగులోకి మారతాయి.

⁙ కొందరికి కాళ్ల వేలి మధ్యలో పగుళ్లు ఏర్పడుతుంటాయి. ఆలివ్ నూనెలో పసుపును కలుపుకుని దాన్ని పూసుకుంటూ ఉంటే పగుళ్లు తగ్గిపోతాయి.

⁙ వెల్లుల్లి పొట్టును కాల్చి దాన్ని పొడిలా చేయాలి. దీన్ని ఆలివ్ నూనెలో కలిపి జుట్టుకు పట్టిస్తే జుట్టు నల్లగా మారుతుంది. ★

రంగవల్లి



14 చుక్కలు, 14 వరుసలు, సరిచుక్కలు

సి. రాజ్యలక్ష్మి, ఎ.ఎస్.రావ్‌నగర్



ముగ్గులకు ఆహ్వానం

నింగిలోని హరివిల్లులను నేలపైన పేర్చి.. కనులకింపైన రంగుల్ని అందంగా అద్దితే అది రంగుల మాలికవుతుంది. ముంగిట్లో రంగవల్లిక అవుతుంది. ధనుర్మాసం సందర్భంగా తెలుగు ముంగిళ్లలో రంగవల్లులను తీర్చిదిద్దడం ఆనవాయితీ.. ఆ సందర్భంగా ముగ్గులకు ఆహ్వానం పలుకుతోంది మాతృభూమి. ఆసక్తి కలవారు కింది చిరునామాకు ముగ్గులను పంపగలరు.

సూచనలు

★ ముగ్గులను పంపేవారు ఎ4 సైజు తెల్లకాగితంపై వేయాలి.

★ ముందుగా నల్లని ఇంక్‌తో ఔట్ లైన్ గీసిన తరువాత అందులో రంగుల్ని నింపాలి.

★ ఎన్ని చుక్కలను పెట్టి ముగ్గులు వేశారో.. అంటే సరిచుక్కలా, బేసి చుక్కలా, సందు చుక్కలా.. అనే విషయం స్పష్టంగా రాయాలి.

★ ముగ్గుతో పాటు, మీ పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫొటోని, చిరునామాని జతచేయాలి.

★ డౌన్‌లోడ్ చేసిన ముగ్గులు కాక, స్వయంగా చేతితో వేసిన ముగ్గులనే పంపాలి. అదీ చుక్కల ముగ్గులకే ఆహ్వానం.

ముగ్గులు పంపాల్సిన చిరునామా:
ఎడిటర్,
ఆంధ్రభూమి దినపత్రిక, సరోజినీదేవి రోడ్,
సికింద్రాబాద్- 500 003.

కర్మభూమి

రచనే, చిత్రమో నాట్యమో
రుచి పెంచెడి కర్మమొకటి ఋతమై నిలుచున్
సుచియో ప్రేరణ నొసగుచు
కామమ్మ క్రోమము మనుజుల కాంక్షలు తీర్చున్

ఆంధ్రభూమి సోమవారం, 7 జనవరి 2019 10

శ్రీనరసింహ శతకము

సీ॥ పాంచభౌతికము దుర్భరమైన కాయం బి
దెప్పుడో విడుచుట -యెఱుకలేదు
శతవర్షముల దాక -మితముఁ జెప్పిరి గాని
నమ్మరాదామాట -నెమ్మనమున
బాల్యమందో మంచి -ప్రాయమందో, లేక
ముదిమియందో లేక -ముసలియందొ
యూరనో, యడవినో- యుదక మధ్యముననో
యెప్పుడో విడుచుట యే క్షణం బొ
తే॥ మరణమే నిశ్చయము; బుద్ధి - మంతుఁడైన
దేహమున్నంతలో మిమ్ముఁ- దెలియ వలయు
భూషణ వికాస! శ్రీ ధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

భావం:ఓ తండ్రీ! పంచభూతాలతో నేర్పడ్డ ఈ శరీరం ఎప్పుడు రాలిపోతుందో తెలీదు. బ్రతుకు దెరువు నూఱేండ్లు అంటారు కాని ఆ మాట నమ్మదగ్గది కాదు. బాల్యంలోనో, యౌవనంలోనో, ముసలితనంలోనో, ఊరిలోనో, అడవిలోనో, నీటిలోనో ఎప్పుడో ఎక్కడో ఒకచోట ఈ శరీరాన్ని వదలటం ఖాయం. చావు తప్పనిసరి. బుద్ధిమంతుడు శరీరాన్ని పరిత్యజించకముందే మీ స్వరూపాన్ని తెలిసికోవాలి.



అనంతం

29 -గోపరాజు నాగేశ్వరరావు

"తొందరేమొచ్చింది"

"వచ్చింది" అన్నాడు ఎమ్మెల్లే.

"రాగ్యా ఇక నాతోనే వుంటాడు. అడవికి కలిసి వెళ్తాం. కోడి జాడలకోసం అన్వేషించి, సమగ్రమైన రిపోర్టు తయారుచేస్తాను."

"ఏ ఏ బౌండరీల్లో రక్షిత ప్రాంతం నిర్మించాలో బాగా ఆలోచించి నిర్ణయించండి"అని, అదోలా నవ్వాడు ఎమ్మెల్లే.

అతని భావం గరుడాచలానికి అర్థమైంది!

"స్వామి కార్యం స్వకార్యం రెండూ అవుతాయి! నాకెటూ కలివికోడి మీద పరిశోధన చెయ్యాల్సిన అవసరం వుంది. దాని పేరుతో అడివిని ఆక్రమించే అవసరం మీకుంది."

"ముఖ్యమంత్రిగారు ఫోన్‌చేసారు" చెప్పాడు ఎమ్మెల్లే.

"ఏమిటట?"

"త్వరగా అడవి భూములు కావాలని బహుళజాతి కంపెనీలవాళ్ళు వత్తిడి తెస్తున్నారుట."

"మరో విషయం" అన్నాడు గరుడాచలం.

"ఏమిటది?" ఎమ్మెల్లే అడిగాడు.

"చాంద్‌నీ విషయం ఏం చేద్దాం? ఎప్పుడు చేద్దాం?"

"పథకం తయారైంది" అన్నాడు ఎమ్మెల్లే.

"కొద్దిరోజుల్లో కొండదేవర జాతర జరగబోతున్నది."

"తెలుసు."

"ఈలోగా దాన్ని జోగిన్నిచేస్తే?"

"కుదరదు! జాతరప్పుడే అవకాశం వుంటుంది. తొందరపడితే బెడిసి కొడుతుంది."

"పథకం ఏమిటి" గరుడాచలం అడిగాడు.

"ముందుగా మన ఒప్పందం గుర్తుందా చెప్పు."

"చాలా జరిగాయి... ఏ ఒప్పందం."

"జోగిన్ని చేసే బాధ్యత నాది- రాగ్యాని ఒప్పించే బాధ్యత నీది అన్నాను కదా."

"గుర్తుంది."

"రాగ్యాతో మాట్లాడావా."

"మాట్లాడను! చెప్పింది చేసే మరబొమ్మలా వాడ్ని మారుస్తాను."


"ఇక, పథకం ఏమిటోచెప్తావిను"అన్నాడు ఎమ్మెల్లే. గరుడాచలం చెవిలో ఏదో చెప్పాడు.

ఐదు నిమిషాల్లో చెప్పటం పూర్తయ్యింది. గరుడాచలం మొహం సంతోషంతో విప్పారింది.

"ఇక నువ్వు వెళ్ళి. ప్రాజెక్టు విషయం చూడు"అని చెప్పి గరుడాచలాన్ని పంపించివేశాడు ఎమ్మెల్లే.

గరుడాచలం చాలా హుషారుగా గుడారం లోకి వెళ్ళాడు.

రాగ్యాని దగ్గర కూర్చోపెట్టుకొని-



"శిష్యా! జ్ఞానానికీ, అజ్ఞానానికీ తేడా ఏమిటి"అని అడిగాడు.

"తెలవదు" అన్నాడు రాగ్యా.

"నెమలి వాహనంమ్మీద ముల్లోకాలు చుట్టొచ్చిన కుమారస్వామి కుదేలైపోయి- అమ్మా, నాన్నలచుట్టూ తిరిగి దణ్ణంపెట్టిన వినాయకుడు నాయకుడయ్యాడెందుచేత."

"తెలవదు."

"ఎంత పెద్ద సమస్యకైనా పరిష్కారానికి శూక్ష్మంగా ఓ సూత్రముంటుంది! దాన్ని పట్టుకోగలగాలి. అప్పుడు పరిష్కారమౌతుంది.

ఆ శూక్ష్మాన్ని గ్రహించినవాడు జ్ఞాని... గ్రహించనివాడు అజ్ఞాని! జ్ఞానికీ అజ్ఞానికీ తేడాకూడా శూక్ష్మంగానే ఉంటుంది!

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే నువ్వు నా శిష్యరికంలో గొప్ప జ్ఞానివి కావాలంతే" అన్నాడు గరుడాచలం.

"గేనిగా మారాల్నంటే ఏంసెయ్యాలి?"అని, చాలా వినయంగా రాగ్యా అడిగాడు.

"జ్ఞానబోధ చెయ్యనా."

"తఁవరిట్టఁవ్"అన్నాడు రాగ్యా.

"చాంద్‌నీదే నీకు పెద్ద సమస్య, అవునా?"

"అవున్సారూ... అదే!"

"పెళ్ళి అనే శూక్ష్మసూత్రంతో నీ పెద్ద సమస్య పరిష్కారమౌతుంది- అవునా?"

"అవున్సారూ."

"పెళ్ళి చేసుకొని ఏం చేస్తావ్."

రాగ్యా మౌనంగా తలదించుకున్నాడు.

"ఇల్లు అనే పంజరంలో బంధిస్తావు- అవునా"

"అవున్సారూ."

"దాని శరీరంతో సుఖిస్తావు- అవునా"

"అవున్సారూ"

"పిల్లల్ని కంటావు. వాళ్ళ బరువు బాధ్యతలు మోస్తావు..."

"అవున్సారూ."

"పెళ్ళిచేసుకోకుండా శరీరాన్ని వాడుకోమని చాందినీ అంటే ఏమంటావు? వొద్దంటావా?"

"అనను."

"బాధ్యతలు లేకుండా- అంటే, పెళ్ళిచేసుకోకుండా దాన్తోనే సుఖించటం అనేదే శూక్ష్మసూత్రం! పెళ్ళి, సంసారం, పిల్లలు, వాళ్ళ బరువు బాధ్యతలతో బ్రతికినంతకాలం బాధలు పడకుండా నీకో మార్గం చెప్తాను..."

"శాందినీ నాకు దక్కుద్దాసారూ?"

"అవును.".

"తఁవరిట్టఁవే నా ఇట్టవ్ సారూ" అన్నాడు రాగ్యా.

గరుడాచలం కొంతసేపు మౌనంగా కూర్చున్నాడు!

"ముందుగా చెయ్యాల్సిన పని వుంది! దాని తర్వాతనే చాంద్‌నీ విషయం పరిష్కారమౌతుంది" అన్నాడు రాగ్యావైపు చూస్తూ.

"ఏంటిదది సారూ?" రాగ్యా అడిగాడు.

"నల్లకొండ దగ్గర్లో వుంది మీ తండా ఒక్కటే కదూ."

"అవును."

"అంటే- ఈ ప్రాంతంలో జన సంచారం తక్కువ..."

"అవును"

"నల్లకొండ నిండా గుహలున్నాయి కదూ."

"ఉండయ్యి"

"కొండ సమీపంలో నీటి కొలనుంది...."

"ఉంది."

"ఈ ప్రాంతాల్లోనే కలివి కోళ్ళు ఉండి తీరాలి."

"ఎట్టాగంటున్నారూ?" రాగ్యా అడిగాడు.

(ఇంకా ఉంది)




రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

- **మేషం (అశ్వని, భరణి, కృత్తిక 1పా.)**మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్న కార్యాలు ఆలస్యంగా సఫలమవుతాయి. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి వుంటుంది. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో జాగ్రత్త అవసరం.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**విదేశయాన ప్రయత్నం సులభమవుతుంది. కుటుంబ కలహాలకు తావీయరాదు. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంది. పిల్లలతో జాగ్రత్త వహించుట మంచిది. వృత్తి, ఉద్యోగ రంగంలోనివారికి ఆటంకాలెదురవుతాయి. ఆరోగ్యం గూర్చి ప్రత్యేక శ్రద్ధ అవసరం.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)** కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనం వహించుట అన్ని విధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. అనవసర ధనవ్యయంతో ఋణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది. అనారోగ్య బాధలకు ఔషధసేవ అవసరం.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)** ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభరణాలు ఖరీదు చేస్తారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. అన్ని రంగాల్లో అద్భుత విజయాలను సాధిస్తారు. నూతన కార్యాలను ప్రారంభిస్తారు. ఋణవిముక్తి లభిస్తుంది. మానసికానందం పొందుతారు.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)** అనుకూల స్థానచలనం కలిగే అవకాశాలున్నాయి. గృహంలో మార్పును కోరుకుంటారు. ఇతరుల విమర్శలకు లోనవుతారు. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు. ఆకస్మిక ధనవ్యయం అయ్యే అవకాశం. బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. ఋణప్రయత్నాలు చేస్తారు.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకోగలుగుతారు. పిల్లలపట్ల జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తిరీత్యా గౌరవ, మర్యాదలు పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. మనోల్లాసాన్ని పొందుతారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. అధికారులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. అనవసర భయం ఆవహిస్తుంది.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యల్లో జాగ్రత్తగా నుండుట మంచిది. మోసపోయే అవకాశాలుంటాయి. ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది. నూతన కార్యాలు ప్రారంభించరాదు. ప్రయాణాలెక్కువ చేస్తారు.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**బంధు, మిత్రులతో మనస్పర్థలు రాకుండా జాగ్రత్త వహించుట మంచిది. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాల్లో వ్యయ, ప్రయాసలు తప్పవు. కలహాలకు దూరంగా ఉండుటకు ప్రయత్నించాలి. దూర వ్యక్తుల పరిచయం ఏర్పడుతుంది.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)** అపకీర్తి రాకుండా జాగ్రత్తపడుట మంచిది. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాల్లో వ్యయ, ప్రయాసలు తప్పవు. కలహాలకు దూరంగా ఉండుటకు ప్రయత్నించాలి. దూర వ్యక్తుల పరిచయం ఏర్పడుతుంది.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**గౌరవ మర్యాదలకు లోపముండదు. అనవసర వ్యయ ప్రయాసలుంటాయి. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. మానసికాందోళనతోనే కాలం గడుపవలసి వస్తుంది. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్త వహించాలి. శారీరకంగా బలహీనులవుతారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు. కళలందు ఆసక్తి పెరుగుతుంది. నూతన, వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు.

మాటాట

నిర్వహణ: సుధామ 1839



అడ్డం	ఆధారాలు	నిలువు
2. ఘరట్టము		1. హిస్టరీ
5. సిగ్గు		3. పార్వతి
7. హిందువుల పవిత్ర జంతువు		4. బలి
8. ముత్యము		6. జంతువు
9. ఓ రకం పిండి		7. నది కాదు వెన్నకాచిన మడ్డి!
10. సన్నము కాదు, వ్యతిరేకం		10. పోలీసు చేతి కర్ర!
12. పేనుగ్రుడ్డు		11. పాము విడిచేది
14. గోతము		13. కేశఖండనము

మాటాట-1838 సమాధానాలు

అడ్డం		నిలువు	
1. అరుంధతి	9. ఆర్మీ	2. ధవుడు	7. కిర్మీరం
5. మేను	10. పేక	3. చీకటి	10. పేరిణి
7. కిటి	12. రంపె	4. పేను	11. అనిలం
8. నక్క	14. తలంబ్రాలు	6. మేనక	13. పెట్టె

పుష్యమాస విశిష్టత




జ్యోతిష శాస్త్ర ప్రకారం ప్రతి మాస నిర్ణయము ఆ మాసంలో పౌర్ణిమ రోజున వచ్చే నక్షత్రం ఆధారంగా చేయబడుతుంది. చైత్ర పౌర్ణిమ రోజున చంద్ర సంచారము చిత్తా నక్షత్రమున అవుతుంది కనుక ఆ మాసానికి చైత్ర మాసమని, విశాఖ నక్షత్రమందు సంచరించుట వలన వైశాఖ మాసమని, ఇలా పన్నెండు మాసాల పౌర్ణమిలలో చంద్రుని సంచారం ఆధారంగా పేర్లను నిర్ణయించారు. చంద్రుడు పూర్ణిమ రోజున పుష్యమి నక్షత్రములో సంచరించే మాసం పుష్యమాసం. పుష్య అంటే పోషణ శక్తి కలిగినది అని అర్థం. పుష్యం శీతకాలంలో వస్తుంది. శూన్యమాసమై, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, వివాహాది శుభశోభనాలకు వీలు లేకున్నా, జపతప ధ్యానాదులకు, పితృ దేవతలను పూజించడానికి ఉద్దిష్టమైన మాసమిది. శ్రావణ పౌర్ణమి నుండి పుష్య పౌర్ణమి వరకు వేదాధ్యయయానికి, మంత్రాలు నేర్వడానికి పూర్వకాలం నుండి అనువైన సమయంగా చెప్పబడింది. రైతులకు పంట చేతికి అందేకాలం కనుక ధాన్యలక్ష్మి, ధన లక్ష్మి రూపేణ విష్ణుమూర్తి సమేత మహాలక్ష్మిని పూజించడం సనాతన సాంప్రదాయాచరణగా ఉంది. పుష్య మాసాధిపతియైన శని మరియు నక్షత్రాధిపతియైన గురును పూజించడం వల్ల విశేష ఫలితాలు వస్తాయని విశ్వాసం. పుష్య అమావాస్య దినాన శనికి తైలాభిషేకం నిర్వహించడం ద్వారా శనిబాధ నివృత్తి కలుగుతుంది. వస్త్ర, తిల, అన్నదానాల వల్ల కూడా శని దోషాలు తొలగిపోయి శుభ ఫలితాలు సిద్ధిస్తాయి. పుష్య పౌర్ణమి స్నానాలు సకల శ్రేయోదాయకాలు. ఉత్తరాయణ పుణ్యకాలం, తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి వచ్చేదీ ఈ మాసంలోనే. సూర్యుడు ధనురాశి నుండి మకరరాశిలో ప్రవేశించేదే మకర సంక్రాంతి. ఉత్తరాయణ కాలంలో తిలధేనుధానాలు, తిల తైలాదులతో శివాలయాలలో దీప దానం, శివారాధనం, శివుని ఘృతముచే అభిషేకించడం మహాఫలం. నల్ల నువ్వులచే అభ్యంగన స్నానం, తిలహోమం, తిలభక్ష్యం, తెల్ల నువ్వులచే దేవ తర్పణం, నల్ల నువ్వులచే పితృ తర్పణం చేయాలని ధర్మసింధు వివరిస్తున్నది. పౌర్ణమి తిథియందు పుష్యమి నక్షత్రంతో చంద్రుని కలయిక పౌషీ పౌర్ణమి. గ్రహాధిపతి సూర్యుడు మకరరాశిలో ప్రవేశించడంచేత మకర సంక్రమణ అవుతుంది. ఉత్తరాయణంలో సూర్య దేవ, సూర్య కిరణ ఆరాధన చేస్తారు. ఈ పుణ్య కాలాన సూర్యోదయం నుండి ఐదు ఘడియలు (రెండుగంటలు) వరకు విశిష్ట తేజస్సును ప్రసరింపచేసే సూర్య కిరణాలు జీవ చైతన్యాన్ని ఊర్ధ్వముఖంగా ప్రసరింప చేయుటకు తోడ్పడతాయి. మానవ శరీరంలోని వెన్నెముక యందలి విశుద్ధి చక్రము, కంఠ స్థానమునందున్న షోడశ దళ పద్మమునకు, హృదయ స్థానమందున్న అనాహత చక్రమునకు మధ్యన ప్రకాశించే ప్రజ్ఞాకేంద్రము మకర రాశిని సూచిస్తుంది. ఇది మహా విష్ణువు నివాస స్థానం. అనాహత చక్రానికి నారాయణుడు అధిదేవత. అందువల్ల పుష్య పూర్ణిమ నాడు "ఓం నమో భగవతే వాసుదేవాయ" అని ఉపాసించుటచేత సిద్ధిత్వం కలుగుతుంది. మనుస్మృతి, గోభిల మునిచే విరచితమైన ధర్మస్మృతి ప్రకారం శ్రావణ పౌర్ణమి నుండి పుష్య పౌర్ణమి వరకు అభ్యసించిన వేద మంత్రాధ్యయనానికి ముగింపు పలికి, ఇతర విద్యలను మళ్ళీ శ్రావణం వచ్చే వరకు అభ్యసించాలి. పుష్య పూర్ణిమ నాడు వేద మంత్ర ఉత్సర్జనము విధిగా చేసే ఆచారం ఉండేది. తమిళ నాట పుష్యపూర్ణిమను పూసమ్ అంటారు. తైపూసమ్ ఉత్సవాన్ని జరుపుకుంటారు. తంజావూరునందు ఉత్సవాన్ని వైభవంగా ఆచరిస్తారు. కుజదోషము, కాలసర్ప దోషము, సర్పదోషము, వివాహ అలస్యము, నిస్సంతానత్వం మున్నగు వాటికి స్త్రీ పురుషులు శ్రీసుబ్రహ్మణ్య, అంగారక గ్రహారాధనలు సత్ఫలితాలను అందిస్తాయి.

-సంగనభట్ల రామకిష్టయ్య

ప్రజల మనిషి

-వట్టికోట ఆళ్వారుస్వామి



-సి.రాఘవాచారి

తెలంగాణాలో జరిగిన మహోద్యమానికి సంబంధించి వచ్చిన సాహిత్య సంబంధమైన రచనలలో ప్రజల మనిషి అగ్రస్థానంలో వుంటుంది. ప్రజల మనిషి రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి స్వయంగా ఆ ఉద్యమంలో పాల్గొన్నవాడు. సాంస్కృతిక, రాజకీయ నేపథ్యం నుండి చూసినపుడు నవలకున్న ప్రాధాన్యం సుస్పష్టం.

మా నిజామురాజు జన్మజన్మాల బూజు అని మహాకవి దాశరథి చెప్పినట్లు ప్రతి ఊరిలోను ఆ నిజాం ప్రభువు పాలనకు ప్రతీకలుగా కొన్ని పాత్రలు, ప్రతిఘటనకు సిద్ధమవుతున్నటువంటి వారినుంచి కొన్ని పాత్రలను ఎన్నుకుని ఈ ప్రజల మనిషి ఒక మహేతిహాసంగా సాగుతుంది. దిమ్మగూడెం అనే గ్రామం అందుకు ఉదాహరణగా వట్టికోట ఆళ్వారుస్వామిగారు ఎన్నుకున్నారు. భూమికోసం పరితపించేటువంటి పేదల్ని అనేక ప్రలోభాలకు గురిచేసి వారిని వంచించేటువంటి కపట రాజనీతి ఒకవైపు, దానికి ప్రతిఘటనగా జాతి కోల్పోయినటువంటి సాంస్కృతిక ఆత్మను, అభిమానాన్ని పునరుద్ధరించుకునే ప్రజ ఒకవైపు ఇందులో మనకు కనబడతారు. ధర్మక్షేత్రం కురుక్షేత్రం అయినటువంటి ఆనాటి ఆ పోరాటంలోప్రజల వైపు వున్నటువంటి ఒక పాత్ర కంఠీరవాన్ని నాయకుడుగా ఎన్నుకుని ఆళ్వారుస్వామిగారు ఈ నవలను రచించారు. ఆ వూరిలో అన్ని వూళ్లలోలాగే ఒక భూస్వామి రాంభూపాలరావు, అలాగే నిజాం తొత్తైనటువంటి హైదరాలీ, దానితోపాటు భూస్వామికి కొమ్ము కాచేటువంటి రైతులు ఒక వైపు వున్నారు. మరోవైపు ఆ దోపిడీకి గురైనటువంటి వారిలో అటు అగ్రవర్ణాల నుంచి ఇటు నిమ్నజాతుల వరకు అనేకులు మనకు ఇందులో సందర్శనమిస్తారు. తెలంగాణ సాయుధ పోరాటం జరగటానికి ప్రాతిపదిక సిద్ధం చేసినటువంటి సాహిత్య రచనల్లో ఇది ఒకటని చెప్పవచ్చు.

తెలంగాణ గురించి చాలా నవలలు వచ్చినాయి కానీ వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన ప్రజల మనిషి, అలాగే దాశరథి రంగాచార్య రచించిన చిల్లరదేవుళ్లు నవలలో నేటివిటీ చాలా ఎక్కువగా ఉంది. వారిద్దరూ కూడా ఆ ప్రాంతవాసులే కాకుండా ఆ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నందువలన అక్కడి ప్రజల మనోభావాలకు చక్కనైనటువంటి సాహిత్య రూపం ఇవ్వగలిగారు. తరువాత విశ్వవిద్యాలయాల్లో సిద్ధాంత గ్రంథాల్లో తారతమ్య పరిశీలనలో తేలింది కూడా ఆ తెలంగాణ నవలలో వట్టికోట ఆళ్వారుస్వామి గారిది చాలా ఉత్కృష్టమైన రచన అని నిర్ధారింపబడింది. ఒక ఊళ్లో భూస్వామికి వ్యతిరేకంగా అనేక వర్గాల సమీకరణ సంఘటన ఈనవలలో ప్రధానాంశం. వేదాల రఘునాథాచార్యులుగారిది సనాతన వైష్ణవ కుటుంబం. దొర రాంభూపాలరావుగారికి ఆ కుటుంబానికి చాలా సాన్నిహిత్యం వుంది. వాస్తవానికి దొరగారి ఆధ్యాత్మిక గురువులైటువంటి ఈ రఘునాథాచార్యులుకి ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు వెంకటాచార్యులు సాంప్రదాయకమ్మైనటువంటి పద్ధతిలోనే నడుస్తూ, దొరవారి పక్షంగా వుంటాడు. చిన్నవాడు కంఠీరవం తాను తన వారిచే భ్రష్టుడనిపించుకున్నప్పటికీ వూరిలో దొరవారి పీడనకు గురవుతున్న వారి సానుభూతిని పొందగలుగుతాడు. అంతేకాకుండా ఈ నవలలో మరొక విశేషమేమంటే ఆనాడు వున్నటువంటి రాజకీయ పార్శ్వమే కాకుండా మత, సాంస్కృతిక వైవిధ్యాలకు సంబంధించిన అనేక అంశాలు చక్కగా చోటుచేసుకున్నాయి. ఉదాహరణకి కంఠీరవం క్రమంగా ఎదుగుతూ వచ్చిన వికాసం, ఆ పరిణామాన్ని ఈ నవలలో చాలా అద్భుతంగా చిత్రించారు. కంఠీరవం తనవైదిక నేపథ్యాన్ని వదులుకొని, ఎలా ఇతర వర్గాలవారి అనుభవాన్ని పురస్కరించుకుని, తాను మారుతూ వచ్చిందీ ఇందులో ఆళ్వారుస్వామిగారు చక్కగా ప్రతిబింబించారు. నిజామాబాద్ జైలుకు వెళ్ళేవరకూ కంఠీరవానికి ఇంకా తన కుల పట్టింపులు చాలా వున్నాయి. అందరితో కలిసి భోంచేయటం, అందరితో కలిసి ఉండటం అనే విషయాలమీద వున్నటువంటి ఆ శషభిషలు కూడా జైలు జీవితంలో పోయాయి. అందుకే జైల్లో జీవితం గడుపుతూ, అక్కడికి వచ్చినటువంటి అనేక వర్గాలవారితో ఆయన పొందిన అనుభూతిని ఒక్క వాక్యంలో ఆయన తేల్చి చెపుతాడు. జైలు ఒక పెద్ద పాఠశాల. వాస్తవానికి అది రెండువిధాల అన్వయించుకోవచ్చు. నిజాం ప్రభువు యొక్క దౌష్ట్యానికి గురైనటువంటి ప్రజలను మరింతగా అర్థం చేసుకునేటటువంటి క్రమంలో జైలు ఒక పాఠశాల అయితే, తాను జన్మించి పెరిగినటువంటి ఛాందస నేపథ్యాన్ని వదులుకుని సామాజికమైనటువంటి ప్రగతి పథంలో పయనించటానికి కంఠీరవానికి జైలు ఒక పాఠశాల అయింది.

-సశేషం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన - శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

హితవాక్యం

మూఢ! జహీహి ధనాగమతృష్ణాం
కురు తనుబుద్ధే! మనసి వితృష్ణాం!
యల్ల భసే నిజకర్మోపాత్తం
విత్తం తేన వినోదయ చిత్తమ్

జగద్గురువులైన శ్రీ ఆదిశంకరుల లలితాదేశ కశాఘాతం అది.

ధన + ఆగమ తృష్ణాం అంటే ధనమింకా రావాలనే తృష్ణను, జహీహి అంటే విడచిపెట్టుము అని భగవత్పాదులు బోధించారు. "డబ్బింకా రావాలి, డబ్బింకా రావాలి" అనే అనంతమైన తృష్ణ అంటే దాహం మానవుణ్ణి ఏ అకృత్యానికైనా ప్రేరేపిస్తుంది. సాధారణంగా కోరికలు రెండు విధాలు- సహజములైనవి, కృత్రిమమైనవి.

సహజమైన కోరికలు అవసరాలను దాటిపోవు. తగినంత అన్నం తింటే ఆకలి తీరుతుంది. నీటిని త్రాగితే దాహం తీరుతుంది. కాని కృత్రిమములైన కోరికలు అలా కాదు. అర్థకామాలు శ్రుతిమించితే అనర్థహేతువులు. అల్లంత ఎత్తుకు ఎగిసిపోవాలనే ఆరాటం అశాంతికి సోపానం.

కాబట్టి ఓ అల్పబుద్ధీ! మనస్సులో తృష్ణకు తావివ్వకు. నీ శ్రమకు లభించిన ధనంతో హాయిగా జీవించు. మనస్సును సంతృప్తి పథం వైపు మరల్చుకో! అదే సుఖజీవన మార్గం! అప్పుడే ఇలపై స్వర్గం!

-వ్యాఖ్యాత:డి.ఎన్.దీక్షిత్

శ్రీకాళహస్తీశ్వరా!

- **నిన్ను నమ్మినరీతి నమ్మనొరులన్, నీకన్న నాకెన్న లే**
రన్నల్దమ్ములు తల్లిదండ్రులు గురుండాపత్సహాయుండు నా
యన్నా! యెన్నడు నన్ను సంసృతి విషాదాంభోధి దాటించి యు
చ్ఛిన్నానంద సుఖాబ్ధిఁ దేల్చెదొ కదే! శ్రీకాళహస్తీశ్వరా!

భావం:ఈశ్వరా! నేను నిన్ను నమ్మినట్లు ఇతరులను ఎవరినీ నమ్మను. నాకు నీకంటే అన్నలుగానీ, తమ్ములుగానీ, తల్లిదండ్రులుగానీ, గురువులుగానీ, కష్టాలలో ఆదుకొను ఆప్తులుగానీ ఇంకెవ్వరూ లేరు. నన్ను ఈ సంసార విష సముద్రమును దాటించి చిదానంద స్వరూపమైన సౌఖ్యసముద్రంలో ఎప్పుడు తేలియాడిస్తావో కదా! అంతా నీ దయ.

- **నీ పంచం బడియుండఁగాఁ గలిగిననన్భిక్షాన్నమే చాలు ని**
క్షేపం బబ్బిన రాజకీటకముల నే సేవింపగా నోప, నా
శాపాశంబులఁ జుట్టి త్రిప్పకుము సంసారార్థమై, బంటుగాఁ
చేపట్టడం దయగల్గెనేని మదిలో శ్రీకాళహస్తీశ్వరా!

భావం: ఈశ్వరా! నీ చూరుకింద నిలబడగలిగినచో, నాకు ఆ అదృష్టమే చాలు; భిక్షాన్నమైనా తిని బ్రతుకుతాను. పురుగుల వంటి అధములైన ఈ రాజులను సేవింపలేను. నీవునీ సేవకునిగా అంగీకరించునంత దయ కలిగితే, నన్ను ఇంక ఆశాపాశములతో బంధించి ఈ సంసార తాపత్రయంలో పడేయక విముక్తున్ని చేయి.

- **నీ పేరున్, భవదంఘ్రి తీర్థము, భవ న్నిష్ఠ్యూత తాంబూలమున్**
నీ పళ్ళెంబు ప్రసాదమున్ గొని కదా నే బిడ్డనైనాడ! న
న్నీ పాటిం కరుణింపు మోపనిక నే నెవ్వారికిం బిడ్డగాన్
చేపట్టందగుఁ పట్టి మానఁదగదో శ్రీకాళహస్తీశ్వరా!

భావం: ఈశ్వరా! నీ నామస్మరణం, నీ పాద తీర్థం, నీవు నమిలి విడిచిన తాంబూలం, నీకు నివేదన చేసిన ప్రసాదం వీనిని స్వీకరించి కదా నీ పుత్రుడనైనాను! నీకిలా కొడుకు అయిన తర్వాత మరెవ్వరికీ కొడుకుగా పుట్టలేదు. నన్ను నీ దగ్గరికి చేర్చుకో. చేరుకున్న తరువాత మరలా విడిచిపెట్టకూడదు సుమా! (అనగా 'నీ సేవ చేయు నాకు పునర్జన్మ లేని మోక్షమును ప్రసాదింపుము' అని భావం)

- **అమ్మా యయ్య యటంచు నెవ్వరిని నే నన్నన్శివా! నిన్ను నే**
సుమీ! నీ మదిఁ దల్లిదండ్రుల నటంచుజూడగాఁబోకు, నా
కిమ్మైఁ దల్లియుఁ దండ్రియున్ గురుఁడు నీవే కాన సంసారపుం
జిమ్మం జీకటి గప్పకుండఁ గనుమా! శ్రీకాళహస్తీశ్వరా!

భావం: అమ్మా అని, నాన్నా అని నేను ఎవ్వరినీ, ఏ జన్మలో పిలిచినా, ఆ పిలుపులన్నీ నిన్నే అని గ్రహించు! ఆ జన్మలనిచ్చిన తల్లిదండ్రులను కాదని గ్రహించు. ఇపుడు నే నీ జన్మ ఎత్తాను. నాకిప్పుడు కూడా నీవే తల్లి, తండ్రి, గురువు. కావునా నన్ను ఈ జనన మరణరూప సంసారం అనే చీకటిలో పడ కుండా కాపాడు. (కొడుకు చీకటిలో దారి తెలియక తల్లడిల్లుతుంటే, తల్లిదండ్రులు చూసి ఊరుకుంటారా? వానిని వెలుగులోకి తీసుకురారా? అలాగే నన్ను జ్ఞానప్రకాశంలోకి తెచ్చి రక్షించు)

సావిత్రీ దేవి 'అట్లే జరుగుతుంది' అని దీవించింది. ఆ దేవి ఇంకా ఇలా అన్నది - 'ద్విజశ్రేష్ఠులు పొందే సాధారణ లోకాలకు నీవు వెళ్ళవు. అనిందితమ్మ, అనిమిత్తమ్మ అయిన బ్రహ్మ పదాన్ని నీవు పొందగలవు. నీవు కోరుకున్నది జరుగుతుంది. నియతితో, ఏకాగ్ర చిత్తంతో సాధన చేయి. ధర్ముడు నిన్ను సేవిస్తాడు. కాలుడు, మృత్యువు, యముడు - నీ సన్నిధిలో ఉంటారు. వారిలో నీకు ధర్మపరంగా చర్చ జరుగుతుంది.'' ఈ విధంగా పలికి సావిత్రీ దేవి అదృశ్యమయింది. బ్రాహ్మణుడు శ్రద్ధగా తన జపాన్ని కొనసాగించాడు. ఆ విధంగా నూరు దివ్య సంవత్సరాలు జరిగిపోయాయి.

అతను ఎల్లప్పుడు అసూయ లేకుండా, ఇంద్రియ నిగ్రహంతో, క్రోధం లేకుండా, సత్యసంధతతో ప్రవర్తించేవాడు. అతను నియమిత కాలం జపం చేసిన తర్వాత ధర్ముడు ప్రసన్నుడై అతని మాందు సాక్షాత్కరించాడు. ధర్ముడు అతనితో ఇలా అన్నాడు. ''విప్రోత్తమా! నేను ధర్ముడను. నీ కోసం వచ్చాను. నీ జప ఫలితం చెప్తాను విను. నీవు దివ్య మానుష లోకాలనన్నిటినీ జయించావు. నీవు దేవ లోకాలకు వెళ్ళగలవు. నీకిష్టమైన లోకానికి ఈ శరీరాన్ని విడిచి వెళ్ళు''.

అప్పుడు బ్రాహ్మణుడు ఇలా అన్నాడు - ''ధర్మా! ఆ లోకాలు నాకెందుకు? నేను ఈ శరీరంతో ఎన్నో కష్టాలను, సుఖాలను అనుభవించాను కనుక దీనిని విడువలేను''

ధర్ముడు - ''మునివరా! నీవు శరీరాన్ని త్యజించు. అలా చేస్తేనే ఏ క్ష్మిఁఊకానికైనా వెళ్ళగలవు''

''అవసరం లేదు, నాకు ఇచ్ఛ లేదు॥

ధర్ముడు - ''ఈ దేహం మీద అంత కోరిక ఉండకూడదు. దేహాన్ని వదిలితేనే రజోహీనమైన దేవలోకాన్ని పొందగలవు. అక్కడ దుఃఖం ఉండదు.''

బ్రాహ్మణుడు - ''దేవా! నేను జపం చేస్తేనే ఆనందంగా ఉండగలను. ఆ లోకాలు నాకు అక్కర్లేదు. సశరీరంగా స్వర్గానికి వెళ్ళగలనో లేదో చెప్పు.''

ధర్ముడు - ''బ్రాహ్మణా! నిన్ను చూడడానికి కాలుడు, మృత్యువు, యముడు వచ్చారు.''

వారు ముగ్గురు బ్రాహ్మణుని దగ్గరకు వచ్చి, యముడు అతనితో ఇలా అన్నాడు - ''నీవు చక్కగా చేసిన తపస్సుకు, నీ సత్ప్రవర్తనకే తగిన ఫలితం లభించింది.''

కాలుడిలా అన్నాడు - ''నీకు ఇది స్వర్గానికి వెళ్ళవలసిన సమయం. అది చెప్పటానికే నేను నీ దగ్గరకు వచ్చాను.''

బ్రాహ్మణుడు - ''మీ అందరికీ స్వాగతం. నేను మీ కోసం ఏమి చేయాలో ఆదేశించండి. నా శక్తికి తగినట్లుగా మీకు సేవ చేస్తాను. చెప్పండి''.

అదే సమయంలో తీర్థయాత్రలు చేస్తూ ఇక్ష్వాకు మహారాజు అక్కడికి వచ్చాడు. ఆ రాజర్షి వారందరినీ కుశలమడిగి అక్కడ వారితో పాటు ఆసీనుడయ్యాడు. బ్రాహ్మణుడు అతనికి కూడా అతిథి సత్కారాలు చేసి రాజు కోసం తానేమి చేయాలో చెప్పుమన్నాడు. అప్పుడు రాజు ఇలా అన్నాడు. ''నేను రాజును. నీవు వేద వేదాంగ పారంగతుడివైన బ్రాహ్మణుడివి. కనుక నీకు కొంత ధనమివ్వదలిచాను. నీకెలాంటి ధనం కావాలో కోరుకో'.

అప్పుడు బ్రాహ్మణుడు ఇలా సమాధానం చెప్పాడు.


జాపకోపాఖ్యానము



డాక్టర్ ముదిగొండ ఉమాదేవి

''రాజా! ధర్మాలు రెండు రకాలు. దానిని బట్టి బ్రాహ్మణులు కూడా ప్రవృత్తులు, నివృత్తులు అని రెండు రకాలు. నేను ప్రతి గ్రహం (దానం పట్టడం) నుండి నివృత్తుడను. కనుక ప్రవృత్తి ధర్మంలో ఉన్నవారికి దానం ఇవ్వు. నేను దానం ఇస్తాను. నీకేది కావాక్ష్మిఁఊ చెప్పు. నా తపశ్శక్తితో అది నీకు ఇస్తాను''.

రాజు ఇలా అన్నాడు. ''నేను క్షత్రియాడను. నాకు దానం ఇవ్వటమే తప్ప స్వీకరించడం తెలియదు. యుద్ధాన్ని మాత్రమే మేము యాచిస్తాము'.



బ్రాహ్మణుడు ఇలా అన్నాడు - ''రాజా నీవు నీ ధర్మంతో తృప్తి పడినట్లే నేను నా ధర్మంతో తృప్తిపడతాను. మనం ఇద్దరుం ఒకలాంటి వారమే. నీకేది ఇష్టమైతే అది చెయ్యి.''

రాజు ఇలా అన్నాడు - ''నీ శక్తిని అనుసరించి దానం చేస్తానని చెప్పావు. కనుక యాచిస్తున్నాను. నీ జప ఫలాన్ని నా కివ్వు''.

అప్పుడు బ్రాహ్మణుడు ఇలా అన్నాడు - ''మరి నీవు యుద్ధాన్ని మాత్రమే యాచిస్తానని చెప్పావు కదా! మరి నాతో యుద్ధాన్ని ఎందుకు యాచించటం లేదు?''

రాజు - ''విప్రోత్తమా! ద్విజులకు మాటయే వజ్రం వంటి ఆయాధం. క్షత్రియులు బాహుబలంతో జీవిస్తారు. ప్రస్తుతం నాకు నీతో జరుగుతున్నది వాగ్యుద్ధమే.''

బ్రాహ్మణుడు - ''ఇప్పటికీ నా ప్రతిజ్ఞ అదే. నా శక్త్యానుసారం నీకు కావలసింది ఇస్తాను. కనుక ఏం కావాలో కోరుకో''.

రాజు - ''నాకు దానమివ్వాలనుకొంటే, నూరు సంవత్సరాలు నీవు చేసిన జప ఫలితాన్ని నాకు ఇమ్ము''.

బ్రాహ్మణుడు - ''నా జపంలో కలిగిన ఫలితంలో అర్ధభాగం నీవు తీసుకో. లేదా ఇంకా కావాలంటే నా మొత్తం జప ఫలితాన్ని స్వీకరించు!''

రాజు ఇలా అన్నాడు 'నేను యాచించిన జప ఫలం నాకు లభించినట్లే. ఈ లభించిన జపఫలం ఏమ్పిఁఊ చెప్పు'.


అప్పుడు బ్రాహ్మణుడు ఇలా అన్నాడు. ''నేను చేసిన జపం యొక్క ఫలితమేమిటో నాకు తెలియదు. కాని ఆ జప ఫలం అంతా నీకు ఇచ్చివేశాను. దీనికి ఈ ధర్ముడు, కాలుడు, యముడు, మృత్యువే సాక్షులు.''

రాజు - ''ఫలితమేమిటో తెలియని నీ జపం నాకు ఏం మేలు చేస్తుంది? కనుక ఫలితాన్ని చెప్పలేకపోతే ఆ ఫలితమంతా నువ్వే ఉంచుకో''.

అప్పుడు బ్రాహ్మణుడు రాజుతో ఇలా అన్నాడు - ''రాజర్షీ! నేను ఇప్పటిదాకా చేసిన జపఫలం నీకిచ్చేశాను. దానికి మన సంభాషణే ప్రమాణం. నీకు ఎన్నడూ జపం చేసే సమయంలో దాని ఫలాపేక్ష లేదు. కనుక ఆ జపఫలం నాకెలా తెలుస్తుంది? ఇవ్వమని నువ్వు అడిగావు, నేను ఇచ్చాను అంతే!''

ఇంకావుంది...

సుందరకాండ



ఇక ఆతల్లి సొగసెట్లా ఉన్నది-

ఆమె శశాకంక ఖండ సంయుక్త మకుట అందు వలన శిరః స్థానం నుండి స్రవిస్తూన్న చంద్రకళ నుండి జారుతూన్న అమృత బిందువులు కలది. యోగి స్వాధిష్ఠాన కమలమందున్న అగ్నిని ప్రేరేపించి దాన్ని సహస్రారము వరకు తీసికొని వెడతాడు. అక్కడ ద్వాదశాంత కమలమొకటి ఉంటుంది. అది శ్వేతవర్ణ. దాని కర్ణిక హిమ రూపమైన చంద్ర ఖండం. యోగి ఈ స్వాధిష్ఠానాగ్ని వేధచే దాన్ని కరిగిస్తాడు.అప్పుడది స్రవించి కంఠస్థానాన్ని తడుపుతుంది. దానికే అమృత స్రావమని పేరు. ఇదీ సానుస్రుతాస్ర కంఠి అంటే-ఆ తల్లి సర్వాభరణ భూషిత.

వక్షస్థలానికి కంఠానికి సంబంధించిన భూషణ విశేషమే నిష్కం. కంఠం నుండి వక్షస్థలానికి వ్రేలాడే ఉత్తమ భూషణం స్త్రీకి మంగళసూత్రం. అందువల్లనే ఆతల్లికి కామేశబద్ధ మాంగల్య సూత్ర శోభిత కన్ధరా అని పేరు.

వివాహిత స్త్రీ చిహ్నమైన సూత్రంతో ఆ తల్లి తనకు మాతృమూర్తిగా కనిపించాలి. వరార్హోత్తమ నిష్క కంఠి అంటే ఇదీ భావం. అది స్వామిధ్యాస.

అటువంటి స్వరూపంతో తన యందు మాతృరూపంగా అభిరక్తమైన కంఠంఅనగా అనురాగ పూర్ణమైన కంఠంగల సీత తనంతతానుగా కనిపించాలని స్వామి ఆవేదన.

అడవియందు సంచరిస్తూన్న నెమలిలా ఆ తల్లి ఉండాలి.

ఇక్కడవనం అంటే ఆగమారణ్యం. అందులో ఆమె నెమలిలా సంచరిస్తూ ఉంటుంది. అందుకనే ఆగమ విపిన మయూరీం అని ఆమెను స్తుతిస్తారు. ఇదీ ఆంజనేయస్వామి దృష్టి. వాల్మీకి మహర్షి సందేశము ఇక్కడ.

కాదితాస్త దళైర్క పత్రైశ్చ సమధిష్ఠితం
తన్మధ్యే బాణలింగంతు సూర్యాయుత సమప్రభమ్

అనే అనాహత చక్ర లక్షణాన్ని ఇక్కడ మహర్షి చెప్పి స్వామి స్థితిని చెప్పేరు. అందుకనే శ్లోకం చివరి పదంగా 'కంఠి' అని ప్రయోగిస్తూ వర్ణ సమాహారాన్ని చేసేరు. అలాగే రేఖా శబ్దంలోని సంఖ్యా తత్త్వాన్ని చూపి ద్వాదశార్క పత్రములను ప్రదర్శించేరు. ఈ పద్మం 'బాణ'మును చిహ్నంగా కలిగి ఉంటుంది. కనుకనే బాణ రేఖాం అని సూచించేరు. ఇది పశ్యన్తీ వైఖరి ఈ స్థానాలకు మధ్య స్థితి కనుక మన ప్రయత్నం లేకుండగనే నాదం పుడుతుంది. ఇంత విషయాన్ని వాల్మీకి ఋషి భాషలో వివరించేరు. అంతేకాదు ఈ రెండు శ్లోకాలలో మొదటి శ్లోకం చివరి పదమైన నీలకంఠీం అనేదానిని, రెండవ శ్లోకంలోని చివరి పదం అయిన మేఘ రేఖాం అనేదానిని కలిపితే భక్త చిత్తకేకి ఘనాఘనా అనే నామం స్మృతికి వస్తుంది. సరే- అటువంటి రామపత్ని కనబడటంలేదు. స్వామి దుఃఖాభిహతుడైపోయేడు. ఆ తరువాత నెమ్మదించేడు. బయలుదేరి-

అససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేంద్ర నివేశనం
ప్రాకారేణార్క వర్ణేన భాస్కరేణాభి సంవృతమ్

ఇక్కడ స్వామి లక్ష్మీవంతుడైనాడు.సంయమనం మనోబల రూపైశ్వర్యం స్వామి కార్య మందలి దీక్ష ఆయన్ని లక్ష్మీవంతుని చేసేయి. ఇక్కడ కూడా మహర్షిఅనాహత లక్షణాన్ని సూచిస్తున్నారు. అర్క వర్ణం అంటే 12 వర్ణాలు. ఈ పద్మానికి నాభిస్థానం. వాయుతత్త్వాన్ని కలిగి ఉంటుంది. ఈ భాగం సౌర ఖండం.అందుకే 'భాస్వరేణ' అన్నారు. ఇదీ స్వామి ప్రదేశం. సరే అన్వేషిస్తున్నాడు.

అంతఃపురంలో వున్న రావణ గృహాలనన్నిటిని చూస్తున్నాడు. మహాపార్శ్వుడు కుంభకర్ణుడు విభీషణుడు ఇంద్రజిత్తు మొదలైన రాక్షసశ్రేష్ఠులనన్నిటిని దాటుతున్నాడు. ఇలా దాటి దాటి సాధకుని మనోమయకోశం వంటి పుష్పక విమానాన్ని చేరేడు.

సవేశ్మ జాలం బలవాన్ దదర్శ
వ్యాసక్త వైఢూర్య సువర్ణ జాలం
యధా మహత్ప్రావృషి మేఘజాలం
విద్యుత్పినద్ధం స విహంగ జాలమ్

ఈపుష్ప విమానాన్ని చూస్తున్న స్వామి బలవంతుడట. ఇది శరీర బలం కాదు మనోబలం. అది వున్నవాడే ఆగిపోకుండా ముందుకు వెళ్ళగలడు. సముద్రంలో మైనాకుణ్ణి కాదని ముందుకు వచ్చిన స్వామికే ఇది సాధ్యం.

ఎలా వుంది విమానం
వర్షాకాల మేఘసమూహంలా ఉందట.
దాని కిటికీలకు వైఢూర్యాలు పొదిగేరట.

అందులో మెరుపుల్లా పక్షి చిత్రాలు. అవి ఒక క్షణం ఎగిరినటులంటాయి. మళ్లీ ఆగిపోతాయి.


ప్రధానమైన శంఖాది ఆయుధశాలలు అందులోనే ఉన్నాయి.

ఇక్కడ శంఖ శబ్దం కొన్ని కోట్లను చెప్పే సంఖ్యా వాచకం. అలాగే దేవతలు కూడా చూసి ఆగి నమస్కరింపదగిన గృహాలు.

మెరుపులచే అర్చింపబడుతూన్న మేఘంలా- స్త్రీ రత్నాల చిత్రాలు అలంకరిస్తున్నాయి.

ఇంకావుంది...

పరమహంస బోధామృతము



55.శ్రీరాముడు, సీత, లక్ష్మణుడును వనముల బడి పోవుచుండిరి. రాముడు ముందును సీత నడుమన లక్ష్మణుడు వెనుకను నడచుచుండిరి. శ్రీరామచంద్రుడు నెల్లప్పుడును చక్కగా నవలోకింపవలయునని లక్ష్మణుని యభిలాష. కాని తనకును శ్రీరామునకును నడుమ సీత యుండుటచే లక్ష్మణుడు అటుల అవలోకింపజాలడయ్యెను. అప్పుడతడు కొంచెం ప్రక్కకు తొలగుమని యామెను ప్రార్థించెను. ఆమె యటుల తొలగినంతనే లక్ష్మణుడు తన కోర్కె ఫలింప శ్రీరామచంద్రుని కన్నులార గాంచగల్గెను. ప్రపంచమున బ్రహ్మము, మాయ, జీవుడు ననువాని స్థితి యిట్టిది. మాయచే గలిగిన భ్రాంతి తొలగని జీవుడు దేవుని గనజాలడు, నరునకు నారాయణుని దర్శనము కాదు.

56.ఒక మహాత్ముడు చిత్రవర్ణ ప్రదర్శనియగు గాజు కడ్డీని గాంచి చిరునవ్వు నవ్వుచుండెడివాడు, కారణమేమనగా, అందుండి ఎరుపు, పసుపు, నీలము మొదలగు వివిధ వర్ణములు అతనికి గానవచ్చుచుండెడివి. ఈ రంగులు వట్టి బూటకములని గ్రహించిన యాతడు ఈదృశ్య ప్రపంచము సైతము అటులనే బూటకమని గ్రహించి తనలో తాను నవ్వుకొనెడివాడు.

57.హరి (యను బాలుడు) సింగపుదలను తగిలించుకొనునప్పుడు నిజముగా భయంకరముగా గాన్పించును. తన చెల్లెలు ఆడుకొను తావును బోయి యాతడు పెడబొబ్బ పెట్టును. కాని చెల్లెలు అదిరిపడి యా భయంకర మృగము బారినుండి తప్పించుకొనిపోవు యత్నమున కెవ్వమనును. కాని భయకంపితయైయున్న ఆబాలిక, హరి తన వేషమును తీసి వేయగనే ఆతడు తన ప్రియసోదరుడే అని గుర్తించి ''ఓహో! మా అన్నయ్యయే!'' అని వాని చెంతకు పరుగెత్తును. మానవులందరి విషయము కూడా నిట్టిదే. అచింత్యమైన మాయాశక్తి మఱుగున నున్నది బ్రహ్మము. ఐనను ఈ మాయచే భ్రాంతికి లోనై లోకులు సర్వ విధమైన చేష్టలను చేయుచుందురు. కాని బ్రహ్మమునుండి మాయ యను తెర తొలగింపబడినపుడు నరునకు అతడు చండశాసనుడగు ఈశ్వరుడుగా గాన్పింపడు, అత్యంత ప్రియుడగు అంతరాత్మయై పరగును.

58.భగవంతుడు సర్వవ్యాపియగునేనిమనకేల కాన్పింపడు? పాచిపట్టిన కోనేటి యొక్క గట్టున నుండి చూచితివేని నీకు అందు నీరు ఉన్నట్లే కాన్పింపదు. నీటిని జూడదలతువేని పాచిని తొలగింపవలయును. మాయావృతమైన కన్నులతో జూచుచు, భగవంతుడు కాన్పించుటలేదని మొఱలిడుచున్నావు. భగవంతుని జూడ గోరుదువేనినీ కన్నులనుండి మాయ అను పొరను తొలగించుకొనుము

59.మబ్బు సూర్యునావరించు రీతిని మాయ బ్రహ్మము నావరించియున్నది. ఈ మాయామేఘము తొలగినంతనే బ్రహ్మను సూర్యుడు మరల కాన్పించును.

60.రాజహంస నీరు కలిగియున్న పాలనుండి నీటిని వేరు చేసి పాలను మాత్రమే గ్రహించును. ఇతర పక్షులిటుల చేయజాలవు. భగవంతుడు మాయతో సమ్మిశ్రితుడై యున్నాడు. సామాన్య మానవులు మాయను వేరుపరిచి భగవంతుని గనజాలరు. పరమహంసలు మాత్రము మాయను విసర్జించి శుద్ధబ్రహ్మమును గ్రహింపజాలుదురు.

61.తననుగని పట్టినంతనే దొంగ పారిపోవు రీతిని మాయాతత్త్వమును నీవు గ్రహించినంతనే మాయ నివర్తించును.

మోక్షహేతువగు విద్యామాయ

62.భగవంతునియందు విద్యామాయయు అవిద్యా మాయయు కూడా కలవు. విద్యా మాయ నరుని భగవంతుని వైపునకు మరల్చును. అవిద్యా మాయ నరుని బ్రహ్మమార్గమునుండి విముఖుని జేయును. కారుణ్యము, జ్ఞానము, భక్తి, వైరాగ్యము- ఇవన్నియు విద్యామాయా స్వరూపములు. వీని మూలమున మాత్రమే నరుడు నారాయణుని బొందగలుగును.

63.బ్రహ్మసాక్షాత్కారమును గలిగించునది మాయయే. మాయ యొక్క తోడ్పాటు లేనిపక్షమున ఎవ్వరు బ్రహ్మ సాక్షాత్కారమును బొందగలరు? శక్తిని (అనగా భగవంతునియొక్క సృజనాది రూపమగు మాయాశక్తిని) దర్శింపకుండ భగవంతుని గనజాలము.

శ్రీ రామకృష్ణ బోధామృతము - పరిశోధితమగు 112 మహోపదేశములుగల శ్రీరామకృష్ణ వాక్య రత్నాకరము - సంగ్రహ జీవిత సహితము - అనువాదకుడు: శ్రీ చిరంతనానందస్వామి

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ
తెలుగు అనువాదం: డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

అలాగే ఎవడూ తయారుచేయకపోతే ఈ విశ్వమంతా ఎక్కడనుండి వచ్చింది? అనంత సృష్టిలోని ఈ సమస్త వస్తుజాలాన్నంత ఒక క్రమపద్ధతిలో నడిపిస్తూ సంరక్షిస్తూ ఉన్న ఆ మహావ్యక్తి తప్పక అనంత శక్తివంతుడని అందరూ అంగీకరించాలి. అందుచేత సృష్టిలో శక్తిసంపన్నుడు కావాలని తలంచే ప్రతి జీవి ఆ అనంత శక్తిసంపన్నుని పూజించాలి, ప్రార్థించాలి అని వేదం సాస్యుక్థ్యః ''అట్టి సృష్టికర్తవగు నీవే ప్రశంసనీయుడవు- పూజార్హుడవు'' అని ఆది దేవుని ప్రశంసించింది.

సోమరసాన్ని ఎలా పిండాలి?

న మాం తమన్న శ్రమన్నోత తంద్రన్న
వోచామ మా సునోతేతి సోమమ్।
యో మే పృణాద్యో దదద్యో నిబోధాద్యో
మా సున్వంతముప గోభిరాయత్॥

భావం:- సంతృప్తిని, సావధానతను కలిగిస్తూ సర్వప్రదాయినియై గోవులతో కూడినవానిగా సోమరసాన్ని పిండేవాని వద్దకు ఏ సోమ రసం నన్ను చేరుస్తున్నదో ఆ సోమరసం నాలో ఆవేశాన్ని, శ్రమను, సోమరితనాన్ని కలిగించడం లేదు. కావున సోమరసాన్ని పిండవద్దని ఎవరితోనూ కూడ చెప్పజాలం.

188

వివరణ:- సోమరసపాన మహిమను గూర్చి ఈ మంత్రం సంభాషణాత్మకంగా వివరిస్తుంది. సోమ రసాన్ని త్రాగు. త్రాగను. ఎందుకు? 'న మాతమత్' ''భావావేశపరచుట లేదు''. అందువలన త్రాగను. సోమరసాన్ని చాలా శ్రమపడి పిండాము. తప్పక త్రాగు. 'న శ్రమత్' నన్నేమీ ఏ విధంగా శ్రమకలిగించలేదు. మైమరపు కలిగిస్తుంది. వద్దనక త్రాగవయ్యా. చాలు చాలు 'నోత తంద్రత్' మైమరపు కాదు. కనీసం కునుకుపాటు కూడా రాలేదు.

అయితే సోమరసాన్ని పిండటం మానివేయమంటావా? 'న వోచామ మా సునోతేతి సోమమ్' వద్దు వద్దు. మేమలా చెప్పం? నీకు సోమరస పానం వలన సుఖమేదో కలుగుతూ ఉన్నట్టు ఉంది. నీవు పిండుకొని త్రాగు. నాకు మాత్రం 'యో మే పృణాత్' నాకు తృప్తిని కలిగించిన దానినే నేను కోరుకొంటాను. సోమరసం తృప్తిని కలిగిస్తుంది. 'యో దదత్' కొంచెం మైమరపు ఇస్తుంది. కాని నేను కోరేదది కాదు. 'యో నిబోధాత్' నన్ను సదా జాగృతపరచాలి. పొరపాట్లకు, సోమరితనాలకు నేనెప్పుడో వశమయ్యాను. నిద్రించి నిద్రించి విసిగిపోయాను.

మరిప్పుడు నేనేమి చేయమంటావు? నేను సోమ రసాన్ని పిండి తయారుచేస్తాను. ఎందుకు? ఎలా? 'యో మ సున్వంతముప గోభిరాయత్' ''అతడు ఆవులను తీసుకొని వస్తే నేను సోమరసాన్ని పిండుతాను'' ఏమిటి చేస్తున్నావు? అందమైనవి, శబ్దక్షీరాన్ని ఇచ్చేవి, రుచికరమైనవి మరియు పరిమళ భరితమైన పాలనిచ్చే ఆవులు కావాలా? సరే. ఇంతేనా? నీవా పాలతో కాయాకల్పం (వృద్ధాప్యం రాకుండా ఔషధాలతో తయారుచేసే చికిత్స) చేయాలనుకొంటున్నావా? సరే. సోమలత ఆ విధంగా చేయగలదు. కాని పిండిన సోమరసాన్ని త్రాగిన పిమ్మట అది సిద్ధిస్తుంది. అయితే నాకు మాత్రం సోమరసం పిండే సమయంలోనే కాయకల్ప యోగం కలగాలి. నాకెట్టి సోమరసం కావాలో గుర్తించావా? నా సోమరసం జాగృతం చేస్తుంది. నీది నిద్రపుచ్చుతుంది. నీ రసం శరీరాన్ని కాయాకల్పం చేస్తుంది. నా బుద్ధిని కాయాకల్పం చేస్తుంది. అంటే ఉత్సాహపరుస్తుంది.

అయితే సోమరసాన్ని పిండటం నిలిపివేయమంటావా! వద్దు. వద్దు 'న వోచామ' మేమలా చెప్పం. ఎందుకంటే 'మహా అసున్వతో వధః' (ఋ.8-62-12) ''సోమ రసాన్ని పిండనివానికి మహా హత్యాపాపం సిద్ధిస్తుంది. ''భూరి జ్యోతీంషి సున్వతః'' (ఋ.8-62-12) ''సోమరసాన్ని తయారుచేసే వానికి గొప్ప తేజస్సు ఏర్పడుతుంది.'' నాకు తేజస్సు కావాలి. నీకో! గోవులు కావాలి. అప్పుడా పృచ్ఛకుడికి తేజస్సు తనకూ కలగాలని కోరిక కలిగింది. నిజానికి గోవులు- తేజస్సూ రెండూ ఒకటే. ఎలాగంటే- గోభిష్టరే మామతిం దురేవామ్ (ఋ.10-44-10) గోవుల ద్వారా మేము ''ఆకర్మణ్యత నుండి తొలగిపవుదుము గాక'' ఈ కోరిక నీ గోవు వలన సిద్ధించదు. జ్ఞానమే గోవు. దానివల్లనే సాధ్యపడుతుంది. అదే దుర్గతి- బుద్ధిహీనత- నాస్తికత్వాలను గూర్చి తెలియపరచి వాని నుండి దూరం చేయగలదు.

నా బుద్ధి కర్మశీలి యగుగాక!

కిమంగ త్వా మఘవన్ భోజమాహుః
శిశీహి మా శిశయం త్వాశ్రుణోమి।
అప్నస్వతీ మమ ధీరస్తు శక్ర వసువిదం
భగమింద్రా భరా న.॥

భావం:- ప్రియమైన దైవమా! జనులు నిన్ను జీవులన్నింటిని పోషించి రక్షించేవాడవని ఎందుకు చెబుతున్నారు? నన్ను దయతో వెంటనే సంరక్షించు. నీవు వెనువెంటనే జీవులను సంరక్షించేవాడవని విన్నాను. నా బుద్ధిని సదా కర్మశీలిగా ప్రచోదనం చేయి. ఓ శక్తిశాలీ! ఓ ఐశ్వర్యశాలీ! మేము ధనాన్ని పొందగల భాగ్యాన్ని మాకు అనుగ్రహించు.

ఇంకావుంది...

ఆంధ్రభూమి

చిత్రభూమి

జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!

సోమవారం 7, జనవరి 2019


వేసవినుంచి చిరుతో కొరటాల?



మెగాస్టార్ చిరంజీవి తన తర్వాత చిత్రాన్ని దర్శకుడు కొరటాల శివతో చేయబోతున్నారని గత కొన్నినెలలుగా సోషల్ మీడియాలో అనేక వార్తలు వస్తూనే ఉన్నాయి. అయితే ఈ సినిమాకు సంబంధించి ఇటు కొరటాల నుండి గాని, అటు మెగా క్యాంపు నుండి గాని ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటకన రాలేదు. కానీ తాజాగా సినీవర్గాల సమాచారం ప్రకారం కొరటాల శివ, మెగాస్టార్‌తో చెయ్యబోతున్న సినిమా ఈ వేసవి నుంచి మొదలుకానుందని తెలుస్తోంది. చిరుకోసం కొరటాల ఓ మంచి సోషల్ మెసేజ్‌తో కూడుకున్న స్క్రిప్టును తయారుచేశారట. ప్రస్తుతం మెగాస్టార్ స్వాతంత్య్ర సమర యోధుడు ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి జీవితకథ ఆధారంగా తెరకెక్కుతున్న 'సైరా నర్సింహారెడ్డి' చిత్రంతో బిజీగా ఉన్నారు.

బతుకు దొంతరలు..

ఏ దారీ లేకపోతే గోదారే.. -అన్నది పాత తెలుగు సామెత. సినిమాకు సరైన కథ దొరక్కపోతే -ఎవరి జీవితాన్నైనా పట్టుకుంటే సరి అన్న పరిస్థితి ఇండస్ట్రీలో కనిపిస్తోంది. ఒకకోణంలో ఇది మంచిదే అయినా -బయోపిక్ అసలు అర్థాన్ని బురదలో కలిపేస్తున్నారన్న ఆవేదనలూ వినిక తప్పడం లేదు. 'మహానటి'కి ముందు అటు బాలీవుడ్, ఇటు టాలీ, మాలీ, కోలీవుడ్ లలోనూ బయోపిక్‌లు వచ్చినా -సావిత్రి సినిమా తరువాత ఈ జోనర్ సినిమాలపై ఆసక్తి పెరిగిందని చెప్పక తప్పదు. అటు చరిత్ర నుంచీ ఇటు సమాజం నుంచీ ప్రముఖుల కథలు ఏరుకుని వరుసపెట్టి బయోపిక్‌లను వదులుతున్న పరిస్థితి కనిపిస్తోంది.





ఈ ఏడాదీ ఆ తరహా చిత్రాలు లెక్కకు మిక్కిలిగానే వస్తున్నాయన్నది ప్రకటనలను బట్టి తెలుసుకోవచ్చు. మహానటుడు యన్‌టిఆర్ కథను కొడుకు బాలకృష్ణ 'కథానాయకుడు', 'మహానాయకుడు' భాగాలుగా తీస్తుంటే, పాదయాత్రతో రాజకీయాన్ని మలుపు తిప్పిన దివంగత వైఎస్సార్ 'యాత్ర' ఘట్టమూ తెరకెక్కడం తెలిసిందే. రెండు చిత్రాలూ విడుదలకు సిద్ధమైపోయాయి. మరోపక్క స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పాత్రను చిరంజీవి పోషిస్తూ -సైరా తీస్తుంటే, ఆటగాళ్ల, పాటగాళ్లు, సైంటిస్టులు, పొలిటిక్సూ కథలు సైతం -బయోపిక్‌లుగా వచ్చేస్తున్నాయి. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్ బయోపిక్‌గా ఇప్పటికే మాజీ ప్రధాని మన్మోహన్ రాజకీయ కథను -ది యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్ టైటిల్‌తో అనుపమ్ ఖేర్ సినిమా చేస్తే.. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ పొలిటికల్ ప్రస్తానాన్ని వివేక్ ఒబెరాయ్ ప్రధాన పాత్రగా చిత్రం తెరకెక్కించేందుకు రంగం సిద్ధం చేశారు. అలాగే తమిళనాడు రాజకీయంలో ఒక శకాన్ని సృష్టించిన పురచ్చితలైవి జయలలిత జీవిత కథనూ తెరకెక్కిస్తున్నారు. దివంగత జయలలిత కథను ముగ్గురు దర్శకులు విభిన్న కోణాల్లో తెరకెక్కిస్తున్నారంటే -ఆమె పాపులార్టీ అర్థం చేసుకోవచ్చు. ప్రియదర్శిని దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో నిత్యమీనన్ లీడ్ రోల్ పోషిస్తోంది. జయలలిత పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయడానికి శక్తికొలదీ కృషి చేస్తున్నట్టు చెప్పుకుంది కూడా. సుందర్ సి దర్శకత్వంలోనూ జయలలిత కథను తెరకెక్కిస్తున్నట్టు ఇప్పటికే ప్రకటన వెలువడింది. మరోపక్క నేరుగా సినిమాకాకుండా, వెబ్‌స్టోరీ రూపంలో జయలలిత కథను తెరకెక్కించే ప్రయత్నాలూ సాగుతున్నాయి. ఇక వర్ధమాన రాజకీయాన్ని టార్గెట్ చేస్తూ 'లక్ష్మీస్ ఎన్టీఆర్' పేరిట రామ్‌గోపాల్ వర్మ సైతం ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'వెన్నుపోటు' ఘట్టాన్ని కీలకంగా తీసుకుని చరమాంకంలో ఎన్టీఆర్ కష్టాలను స్క్రీన్‌పై చూపించే ప్రయత్నం చేస్తున్నారు.

చారిత్రక నేపథ్యాన్ని తీసుకుని బ్రిటీష్ పాలకులపై కత్తిదూసిన వీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి కథను ఇప్పటికే కంగన రనౌత్ ప్రధాన పాత్రగా తెరకెక్కించారు. 'మణికర్ణిక' పేరిట ఈనెల్లోనే ఆ చిత్రం విడుదలకానుంది. ఇక క్రీడారంగంలోని ప్రముఖుల జీవితాలనూ స్క్రీన్‌కు ఎక్కించేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు సాగుతున్నాయి. యువతకు స్ఫూర్తినిచ్చే చిత్రాలుగా వీటిని తెరకెక్కిస్తున్నారు. చిన్న వయసులోనే బ్యాడ్మింటన్‌లో సంచలనాలు సృష్టించిన సైనా నెహ్వాల్ కథను అమోల్‌గుప్త తెరకెక్కిస్తుంటే, సైనాగా శ్రద్ధాకపూర్ నటిస్తుంది. అండమాన్‌కు చెందిన ప్రముఖ సైకిలిస్ట్ దెబోరా హెరాల్డ్ జీవితం ఆధారంగా తెరకెక్కుతోంది. సైకిలిస్టుగా ఆమె సాధిస్తోన్న విజయాలతోపాటు, సునామీని ఎదిరించి చెట్టుపైన వారంపాటు గడిపి ప్రాణాలు నిలుపుకున్న ఆమె జీవితంలోని ధైర్య సాహస ఘట్టాన్ని ఈ కథలో స్పృశించనున్నారు. ఇక పుల్లెల గోపీచంద్, సానియా మీర్జా, అథ్లెటిక్స్‌లో సంచలనాలు సృష్టించిన భారత క్రీడాకారుల జీవితాలనూ బయోపిక్‌లు చేసేందుకు నటులు, దర్శకులు, నిర్మాతలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఇదిలావుంటే శాస్త్రవేత్తల జీవితాలూ తెరకెక్కుతున్నాయి. ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితంలోని ముఖ్య ఘట్టాన్ని మాధవన్ తెరకెక్కిస్తుంటే, భారతీయ రోదసి నావికుడు రాకేష్ శర్మ కథను తెరకెక్కించేందుకు షారుక్ ఖాన్ ఉవ్విళ్లూరుతున్నాడు.

ఇక యాసిడ్ దాడికి గురై మనోవేదనను తట్టుకుని జీవితంలో పదిమందికి స్ఫూర్తినిస్తున్న లక్ష్మీ అగర్వాల్ కథతో 'చాపక్' పేరిట దీపిక పడుకొనె సినిమా చేస్తుంటే, ఒకప్పటి సంచలన తార షకీలా బయోపిక్‌లో బాలీవుడ్ బ్యూటీ రిచా చద్దా నటిస్తుండటం తెలిసిందే. ఇలా బయోపిక్ అనేది కొత్త జోనర్‌గా స్థిరపడిపోతుందంటే అతిశయోక్తి కాదు.

-రాణీప్రసాద్





బాబీ చేతుల మీదుగా ధీవర ఫస్ట్‌లుక్

తెలుగులో వైవిధ్యమైన సినిమాల హవా పెరుగుతోంది. కొత్తగా వస్తోన్న దర్శకులే కాదు, నిర్మాతలూ ఈ తరహా కథలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈక్రమంలో మరో డిఫరెంట్ మూవీ రాబోతోంది. అదే -ధీవర. నాగసాయి, విద్యాచైతన్య హీరో హీరోయిన్లు. టైటిల్‌కు తగ్గట్టే డైనమిక్ స్క్రిప్ట్, డిఫరెంట్ స్క్రీన్‌ప్లేతో సాగే సస్పెన్స్ థ్రిల్లర్. చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు బాబీ విడుదల చేశారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ.. 'ధీవర' కాన్సెప్ట్ బాగుంది. యూత్‌కి కనెక్టయ్యే కథ. పోస్టర్ బాగా నచ్చిందని, ఎంటైర్ యూనిట్‌కు ఆల్ ద బెస్ట్ చెప్పారు. దర్శకుడు విజయ్ జిక్కి మాట్లాడుతూ 'ధీవర' సినిమాలో స్క్రీన్‌ప్లే హైలైట్ అన్నారు. లవ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా సాగే సినిమా ఒకేసారి రెండు జోనర్స్‌లో సాగుతుందన్నారు. నిర్మాత హరనాథ్‌బాబు మాట్లాడుతూ -కమర్షియల్ అంశాలకూ పెద్దపీట వేశామని, అన్నివర్గానూ ఆకట్టుకునేలా యూత్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్సు జరుగుతోందన్నారు. త్వరలోనే ఆడియో సహా ట్రైలర్ విడుదల చేస్తామన్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని వచ్చే నెలాఖరుకి ప్రేక్షకుల ముందుకు తెస్తామన్నారు. భగీరథ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న చిత్రానికి సంగీతం అద్దంకి వెంకటేష్, సినిమాటోగ్రఫీ సాగర్ గొళ్లా.

మహేష్‌తో మ్యాజిక్

సూపర్‌స్టార్ మహేష్ చూపు బాలీవుడ్ భామలపై ఉందా? ఈసారి నటించే సినిమాకి ఓ బాలీవుడ్ ముద్దుగుమ్మను ఎంపిక చేసుకునే ఆస్కారం ఉందా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. ఆమేరకు పలువురు కథానాయికలతో మంతనాలు సాగుతున్నాయని తెలుస్తోంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం మహేష్ తన కెరీర్ 25వ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో 'మహర్షి' చిత్రీకరణ శరవేగంగా పూర్తవుతోంది. క్రిస్మస్- కొత్త సంవత్సరం సెలవుల్ని ముగించుకుని మహేష్ తిరిగి తాజా షెడ్యూల్ చిత్రీకరణలో పాల్గొనేందుకు ప్రిపేరవుతున్నారట. సైమల్టేనియస్‌గా పోస్ట్ ప్రొడక్షన్ పూర్తిచేసి - సమ్మర్ కానుకగా ఏప్రిల్‌లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు బృందం సన్నాహకాల్లో ఉన్నారు. ఈ సినిమా తర్వాత మహేష్ 26 కన్ఫామ్ అయిన సంగతి తెలిసిందే. మహేష్ నటించే 26వ చిత్రానికి సుకుమార్ దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు- కాస్టింగ్ ఎంపికలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పటివరకూ మహేష్ సరసన కథానాయికను ఫైనల్ చేయలేదు. తొలుత దీపిక అనుకున్నా కానీ కుదరలేదు. ఆ క్రమంలోనే అందాల కత్రిన కైఫ్ పేరును పరిశీలిస్తున్నారట. క్యాట్‌తో మైత్రి సంస్థ టచ్‌లో ఉందని తెలుస్తోంది. ఇప్పటికైతే కత్రిన ఓకే చెప్పాల్సి ఉందింకా. మహేష్ సరసన ఇదివరకు నటించిన బాలీవుడ్ నాయికల జాబితా చాంతాడంత ఉంది. బిపాసాబసు, ప్రీతి జింతా, నమ్రత, భూమిక, అమృతారావు తదితరులు మహేష్ సరసన నటించారు. ఇప్పుడు అతడి ఖాతాలో కత్రిన పేరు కూడా ఉంటుందేమో చూడాలి. మార్చిలో ఈ సినిమా ప్రారంభోత్సవం ఉంటుందని చెబుతున్నారు.

మిస్టేక్..



నేపాలీ ముద్దుగుమ్మ మనీషా కోయిరాలా జీవితంలో ఎన్నో ఒడుదొకుడులు. ముఖ్యంగా మనీషా క్యాన్సర్ బారిన పడి మరణం అంచులవరకు వెళ్లింది. క్యాన్సర్‌తో పోరాడి జీవితాన్ని గెలిచిన మనీషా జీవితంలో ఇప్పుడు చాలా మార్పులు వచ్చాయట. క్యాన్సర్‌కు ముందు తాను చెడు అలవాట్లకు బానిసైనట్లుగా మనీషా బయోగ్రఫీలో పేర్కొంది. ఇటీవలే మనీషా కోయిరాలా తన ఆటోబయోగ్రఫీ హేడెల్‌ను విడుదల చేసింది. ఆ పుస్తకంలో తన జీవితంలోని చీకటి కోణాన్ని ఆవిష్కరించింది. హీరోయిన్‌గా బిజీగా ఉన్న సమయంలో ప్రపంచంమొత్తం తన కాళ్లవద్ద ఉందన్నట్లుగా ఫీల్అయ్యానని, ఒంటరితనం భరించలేక బాగా తిరిగేదాన్నని, పార్టీలకు ఎక్కువగా వెళ్తూ జీవితాన్ని ఎంజాయ్ చేసేదాన్నని పేర్కొంది. తక్కువ సమయంలోనే మద్యానికి బానిసైనట్టు వెల్లడించింది. ఆ కారణంవల్లే క్యాన్సర్ పట్టి పీడిచ్చినట్లుగా భావిస్తున్నాను. క్యాన్సర్‌తో పోరాడిన తర్వాత ఆ తప్పులన్నీ నాకు తెలిసివచ్చాయి. అందుకే క్యాన్సర్ వ్యాధి నా జీవితానికి ఒక బహుమతిగానే భావిస్తున్నట్లుగా మనీషా పేర్కొంది. జీవితంలోని కొన్ని సంఘటనలు తను పూర్తిగా మారిపోయేలా చేశాయని మనీషా హేడెల్ పుస్తకంలో పేర్కొంది.



హన్సిక ది గ్రేట్...?

తెలుగులో 'దేశముదురు' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమై పుష్కర కాలంగా గ్యాప్ లేకుండా సినిమాలు చేస్తూ వస్తోంది ముద్దుగుమ్మ హన్సిక. తమిళంలోనూ ఈమె హవా తక్కువేం లేదు. స్టార్ హీరోలకు జోడీగా నటించి స్టార్ హీరోయిన్ అయ్యింది. తెలుగులో మాత్రం హన్సికకు ఆశించిన స్థాయిలో స్టార్‌డం దక్కలేదు. అందుకే ఈమె తమిళానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తోంది. ఇది ఒక కోణం. రెండో కోణంలో హన్సిక అందగత్తే కాదు, అందమైన మనసున్నది కూడా. పెద్ద మనసున్నది కనుకే -చిన్న వయస్సులోనే ఏకంగా 34మంది పిల్లలకు తల్లయ్యింది. ప్రస్తుతం ముంబయికి చెందిన 34 మంది పిల్లలను చేరదీసి, వాళ్లకు సంబంధించిన అన్ని విషయాలూ హన్సికే చూస్తోందట. ఆ పిల్లల అవసరాలన్నీ తల్లిలా తీరుస్తోందట. నాణ్యమైన ఆహారం, వాళ్ల చదువు, ఆరోగ్యం అన్ని బాధ్యతలనూ ఆమె భుజాలపై వేసుకుందట. ఆమె పెంపకం ఎంత గొప్పగా ఉందంటే, ఈ ఏడాది ఒక పిల్లాడు టెన్త్ పరీక్షలకు అటెండ్ అవుతున్నాడు. న్యూఇయర్ సందర్భంగా ఈ విషయాన్ని హన్సికే వెల్లడిస్తూ, ఆ పిల్లాడు స్టేట్ ర్యాంకు సాధించేలా శిక్షణ ఇప్పించడంతోపాటు, ఉన్నతంగా మార్కులు సాధించేందుకు తనవంతు కృషిచేస్తానంటోంది. అతడిని టాప్ స్టూడెంట్‌గా నిలపడమే ఈ ఏడాది తన ముందున్న లక్ష్యమనీ ప్రకటించింది. చాలామంది హీరోయిన్లు ఫేమ్ సంపాదించొచ్చు. కానీ, హన్సిక మాత్రం ప్రేమను సంపాదించుకుంటుంది. సెలబ్రిటీగా తన బాధ్యతను నిర్వర్తిస్తూ పదిమందికి ఆదర్శమవుతుంది. హన్సిక.. ది గ్రేట్.

థ్రిల్లర్ కథతో యమ్6

విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బ్యానర్స్‌పై విశ్వనాథ్ తన్నీరు నిర్మిస్తున్న చిత్రం 'యమ్6'. ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు వివి వినాయక్ ఆవిష్కరించి యూనిట్‌ను అభినందించారు. కార్యక్రమంలో హీరో ధ్రువ, నిర్మాత విశ్వనాథ్ తన్నీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత విశ్వనాథ్ మాట్లాడుతూ 'యమ్6' ట్రైలర్‌ను వినాయక్ ఆవిష్కరించటం హ్యాపీగా ఉందన్నారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రాన్ని ఖర్చులో రాజీపడకుండా క్వాలిటీగా తెరకెక్కించామన్నారు. దర్శకుడు జైరాం పనితనం స్క్రీన్‌మీద కనిపిస్తుందని, హీరో ధ్రువ కొత్తవాడైనా చక్కటి నటన ప్రదర్శించాడన్నారు. ధ్రువ సరసన మిస్ బెంగళూరు అశ్విని తొలిసారి లీడ్ రోల్ పోషించింది. మంచి కంటెంట్‌తో రూపొందిన సినిమా ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుందన్నారు. సినిమాటోగ్రఫీ, సంగీతం, సస్పెన్స్,



కామెడీ, యాక్షన్ సన్నివేశాలు సినిమాకి హైలైట్‌గా నిలుస్తాయని, ప్రేక్షకులు ప్రతి సన్నివేశాన్నీ ఎంజాయ్ చేస్తారన్నారు. 'యమ్6'కి అర్థం సినిమా చూస్తే తెలుస్తుందన్నారు. 'ఈ క్షణం...' అనే మెలోడీ సాంగ్‌ను మంగుళూరు, అరకులోని అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరించామని, పాటకు మంచి స్పందన వస్తోందన్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు.

ధ్రువ మాట్లాడుతూ హీరోగా ఇది తొలి చిత్రమని చెబుతూ, వైవిధ్యమైన పాత్రలతో మంచి నటుడిగా స్థానం సాధించాలన్నది కోరిక అన్నాడు. దర్శక, నిర్మాత ప్రోత్సాహంతో మంచి పెర్ఫార్మెన్స్ ఇచ్చానన్నాడు. మంచి సినిమా ద్వారా హీరోగా పరిచయమవ్వడం హ్యాపీగా ఉందన్నాడు.